

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 200

బుధవారం 5-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




టైటాన్స్ ఆడుతూ పాడుతూ..

రాణించిన సాయి సుదర్శన్.. గుజరాత్‌కు వరుసగా రెండో విజయం - 12లో



భారత వృద్ధి రేటుకు కోత


వరల్డ్ బ్యాంక్ 2023-24 అంచనాలు 6.3 శాతానికి డౌన్ - 13లో



ఎగబాకుతున్న కరోనా కేసులు

దేశంలో గత 24 గంటల్లో కొత్తగా 3,038 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.

వివరాలు 6లో ▸



పేర్లు మార్చినా నిజం మారదు

అరుణాచల్‌ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టుకున్నా.. నిజం మాత్రం మారదని భారత్ పునరుద్ఘాటించింది.

వివరాలు 6లో ▸



సిక్కింలో భారీ హిమపాతం

సిక్కింలోని నాథూ లా ప్రాంతంలో సంభవించిన భారీ హిమపాతం ధాటికి ఏడుగురు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



నాటో కూటమిలోకి ఫిన్లాండ్

ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగిన రష్యా తమపైనా దాడికి యత్నించవచ్చనే భయాలతో ఫిన్లాండ్ దేశం నాటో కూటమిలో చేరింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పేదల ఇళ్లపై ప్రొక్లెయినర్లతో దాడి



పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లపై టీడీపీ నాయకులు ప్రొక్లెయినర్లతో దాడి చేసి.. కూల్చివేశారు. లబ్ధిదారులను భయపెట్టి అక్కడి నుంచి తరిమేసి.. స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి 14 మంది టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివరాలు 14 ▸

జగనన్న మహిళా మార్టులు అద్భుతం



ఏపీలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్టుల నిర్వహణ అద్భుతంగా ఉందని కేరళ అధికారులు కితాబిచ్చారు. ఈ తరహా మార్టులను తమ రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వివరాలు 14 ▸

బీజేపీ ఇంకా బలపడాలి



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంగళవారం రాత్రి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. ఏపీలో బీజేపీ ఇంకా బలోపేతం కావాల్సి ఉందన్నారు. రెండు పార్టీల భవిష్యత్తు ప్రణాళికపై స్పష్టత వచ్చాక తామే మీడియాకు వెల్లడిస్తామన్నారు.

వివరాలు 14 ▸



రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?

రాజధాని పిటిషనర్లను ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం

- ఇళ్ల స్థలాల కేటాయింపు అభివృద్ధిలో భాగమే.. ఫలానా వారికి ఇళ్ల స్థలాలివ్వొద్దని చెప్పజాలరు
- ఆ భూములు ప్రస్తుతం సీఆర్‌డీఏవే.. రైతులవి కాదు
- ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవే..
- జీవో 45పై ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం.. ఇప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ప్రసక్తే లేదు
- సుప్రీంలో విచారణ కొనసాగుతున్నందున రాజధాని వ్యవహారాన్ని జఠిలం చేయలేం
- ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారు
- కౌంటర్ దాఖలు చేయాలని పురపాలక శాఖ, సీఆర్‌డీఏకు ఆదేశం



సాక్షి, అమరావతి: ''రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా?'' అని హైకోర్టు ధర్మాసనం రాజధాని పిటిషనర్లను ప్రశ్నించింది. రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమని వ్యాఖ్యానించింది. ఫలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పజాలరని స్పష్టం చేసింది. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్‌డీఏవేనని, అంతేకానీ భూములిచ్చిన వారివి కాదని పేర్కొంది. రాజధాని వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున అందుకు సంబంధించిన వ్యవహారంలో తాము జోక్యం చేసుకుని పరిస్థితిని జఠిలం చేయలేమని తెలిపింది. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా రాజధాని ప్రాంతంలో 1,134 ఎకరాలను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తెలిపింది. ప్రస్తుత దశలో స్టే విధించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే ప్రభుత్వం చెప్పిందని, అందువల్ల కేటాయింపులను ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలు అపరిపక్వమైనవని స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజధాని విషయంలో కొన్ని అంశాలను హైకోర్టులో, కొన్నింటిని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తున్నారని ప్రస్తావిస్తూ జీవో 45పై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేమని, అవి ప్రభుత్వ విధుల్లో భాగమని తేల్చి చెబుతూ జీవో 45పై

మిగతా 2వ పేజీలో ▶

సంక్షేమ క్యాలండర్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పేదలకు 45 నెలల్లో రూ.2,96,148.09 కోట్లు

డీబీటీ, నాన్ డీబీటీతో లబ్ధి చేకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం

- సంక్షేమ క్యాలెండర్ 2023-24ను ఆవిష్కరించిన సీఎం జగన్
- దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడాది పొడవునా పథకాలు
- ఏ నెలలో ఎలా ప్రయోజనం చేకూర్చనున్నారో ముందే వెల్లడి

2లో

కలసి నడుద్దాం.. ఘన విజయం సాధిద్దాం

- పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్
- ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్

2లో

రామోజీ అతీతుడా!?

తప్పుచేస్తే ఎవరికైనా శిక్షలుంటాయి

- మార్గదర్శి వ్యవహారంలో సీఏల విమర్శలు తగదు
- విజయ్‌మాల్యా, రామోజీరావు ఇద్దరూ చేసింది ఒక్కటే
- డిపాజిటర్ల పేర్లు వెల్లడించాలి
- జగన్‌ను విమర్శిస్తే విశ్వాస ఘాతకుడినవుతా
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యలు



సాక్షి, రాజమహేంద్రవరం: బ్రహ్మయ్య అండ్ కో కంపెనీ చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)ను అరెస్టుచేస్తే అందరు సీఏలపై దాడి ఎలా అవుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. తప్పు ఎవరుచేసినా తప్పేనని, చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. అది రామోజీరావు అయినా, మరెవరైనా అంతా సమానమేనన్నారు. సాక్షాత్తూ తిరుమల టీటీడీ హుండీలో వేసే విదేశీ కరెన్సీ విషయంలో ముందస్తు అనుమతి తీసుకోవడంలో జాప్యం చేసినందుకు రూ.10 కోట్ల ఫైన్‌వేశారని ఉండవల్లి గుర్తుచేశారు. వెంకటేశ్వరస్వామి కంటే అతీతుడినని రామోజీరావు భావిస్తున్నారని ఆయన మండిపడ్డారు. విజయ్‌మాల్యా, రామోజీరావు ఇద్దరూ చేసింది ఒక్కటే అని వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శిలో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తాను 2006 నుంచి చెబుతూనే ఉన్నానని.. తాను ఆరోపించినట్లుగానే

మిగతా 10వ పేజీలో ▶

జనంలోకి వైఎస్సార్‌సీపీ



- 45 నెలల పాలనను చాటిచెప్పడం.. విపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యం
- ఈనెల 7 నుంచి 20 వరకూ 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో భారీ కార్యక్రమం
- 14 రోజుల్లో 1.60 కోట్ల ఇళ్లను సందర్శించనున్న జగనన్న సైన్యం
- టీడీపీ సర్కార్‌కూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను చెప్పనున్న శ్రేణులు
- ఇంటింటా సీఎం జగన్ పాలనపై పీపుల్స్ సర్వే

3లో

ట్రంప్ అండర్ అరెస్ట్!

హష్ మనీ చెల్లింపుల కేసులో కోర్టులో హాజరైన అమెరికా మాజీ అధ్యక్షుడు



- సాంకేతికంగా పోలీసుల అదుపులోకి..
- తర్వాత అభియోగాలు విన్పించిన జడ్జి
- కెమెరాల్లేకుండా రహస్య విచారణ
- కోర్టు వద్ద భారీ భద్రత
- అమెరికాలో న్యాయం అడుగంటింది: ట్రంప్

6లో


> అగ్రరాజ్యం అమెరికా నానాటికీ దిగజారుతోంది. థర్డ్ వరల్డ్ మార్క్సిస్టు దేశంగా మారుతోంది. ఏ తప్పూ చేయనందుకు విపక్ష నేతను అధికార పార్టీ అరెస్టు చేస్తోంది. ఈ రోజుతో అమెరికాలో న్యాయం అడుగంటింది.
> - అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్

పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌తో అఫైర్‌ను కప్పిపుచ్చుకునేందుకు జరిపిన చెల్లింపుల కేసులో క్రిమినల్ నేరాభియోగాలు ఎదుర్కొంటున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మన్‌హాటన్ జ్యూరీ ముందు విచారణకు హాజరయ్యారు. తన లాయర్లు, సీక్రెట్ సర్వీస్ సిబ్బందితో కలిసి కోర్టు ప్రాంగణంలోకి అడుగు పెట్టిన ట్రంప్.. ఆ క్షణమే సాంకేతికంగా అరెస్టయినట్టు చెబుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.30కు ఆయన్ను జడ్జి ముందు ప్రవేశపెట్టారు. మీడియా కంటపడకుండా కోర్టు గదిలోకి తీసుకెళ్లారు. కాగా, తాను అరెస్టు కాబోతున్నానంటూ అభిమానులకు ట్రంప్ మెయిల్ చేశారు.

విచారణపై స్టే ఇవ్వలేం

- మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు
- సీఐడీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చు
- ఈ కేసులో ఏజీ వాదనలు వినిపిస్తారు
- అప్పటివరకు ఆదేశాలు ఇవ్వొద్దు
- కోర్టుకు విజ్ఞప్తి చేసిన ఏపీ స్పెషల్ జీపీ

5లో



'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజల నినాదమే

పోస్టర్‌ను ఆవిష్కరించిన సజ్జల

2లో



జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్‌కు 9.4 లక్షల మంది

అడ్మిట్‌కార్డులు విడుదల చేసిన ఎన్‌టీఏ

- ఈ నెల 6, 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో పరీక్ష
- గతంలో 12 వరకే షెడ్యూల్ ప్రకటించినా మరో 2 రోజులు అదనంగా నిర్వహణ
- దేశంలో 330 పట్టణాల్లో.. ఏపీలో 25 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు
- మొదటి సెషన్లో పరీక్షరాసిన విద్యార్థులు 8.2 లక్షల మందే
- అడ్మిట్ కార్డ్‌లోని అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- పరీక్ష కేంద్రానికి అడ్మిట్‌కార్డు, ఫొటో ఐడీ తప్పనిసరి



సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్ఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ అడ్మిట్‌కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం రాత్రి విడుదల చేసింది. www.nta.ac.in లేదా https://jeemain.nta.nic.in/ వెబ్‌సైట్ల నుంచి వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా 9.4 లక్షల మంది

మిగతా 14వ పేజీలో ▶

'అక్కసు'కి అంతే లేదు!

పింఛన్లపై 'ఈనాడు' తప్పుడు రాతలు

- సచివాలయానికి 15కి.మీ లోపు ఉంటేనే పింఛన్ అంటూ అసత్య ప్రచారం
- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందంటూ పచ్చి అబద్ధాలు.. దీనిపై ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వని ప్రభుత్వం
- లబ్ధిదారులు సచివాలయానికి ఎంత దూరంలో ఉన్నారో తెలుసుకునేందుకే జియో ఫెన్సింగ్
- మరింత సమర్థంగా, సులభంగా పింఛన్లు ఇచ్చేలా సమాచార సేకరణకే
- అదీ ప్రయోగాత్మకంగా అమలుకు సాఫ్ట్‌వేర్‌లో చిన్న మార్పు
- అర్హులకు పింఛను ఇవ్వాలనే తప్ప ఎగ్గొట్టాలన్న ఆలోచన లేదన్న సర్కార్

3లో



- అవ్వాతాతలకు కష్టం తెలియకుండా ప్రభుత్వం పింఛన్ల పంపిణీ
- బాబు హయాంలో పింఛను మంజూరు కావాలంటే అనేక కష్టాలు పడాలి
- నెలనెలా పింఛన్ తీసుకోవాలన్నా కష్టమే
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి పింఛను అందిస్తున్న వలంటీర్లు



శ్రీకాకుళంలోని మహాలక్ష్మీ నగర్‌కాలనీలో అమ్మాయమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ ఏకాశి

49.92 లక్షల మందికి రూ.1,375.17 కోట్లు

78.72 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి

- వివరాలు 2లో

49.92 లక్షల మందికి రూ.1,375.17 కోట్లు

78.72 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి,అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. ఈ నెలలో 63,42,805 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1,747.88 కోట్లను విడుదల చేయగా... వలంటీర్లు లబ్ధిదారుల ఇంటిం టికీ వెళ్లి మంగళవారం సాయంత్రం వరకు 49,92,870 మందికి రూ.1,375.17 కోట్లను పంపిణీ చేశారు. 78.72 శాతం మందికి ఇప్పటికే పంపిణీ పూర్తయిందని, మరో 3 రోజుల పాటు వలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ కొనసాగుతుందని సెర్ప్ అధికారులు వెల్లడించారు.


విజయనగరంలో వృద్ధురాలు మహాలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సత్యలత


ఏలూరు రాణినగర్‌లో జమితిరెడ్డి అచ్చాయమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రీదేవి


నెల్లూరు ఆదిత్య నగర్‌లో ఎన్.మరియమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ కావేరి


నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం చిన్నకొప్పెర్లలో పుల్లమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ ఓబులమ్మ


గుంటూరుకు చెందిన పఠాన్ హుస్సేన్‌వలికి దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ ఖాసింబీ


ఒంగోలు ధారావారితోటలో శ్రీనివాసులుకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ సాయికృష్ణ


తిరుపతి జిల్లా వల్లివేడు గ్రామంలో వృద్ధురాలు బండి రమణమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ పిట్ల పవన్ కల్యాణ్


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాణిగారి తోటలో చెరుకూరి వెంకట సుబ్బలక్ష్మికి వృద్ధాప్య పింఛను అందిస్తున్న వార్డు వలంటీర్ భాగ్యలక్ష్మి

భగవాన్ మహావీర్‌కు సీఎం జగన్ నివాళి


భగవాన్ మహావీర్ చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: భగవాన్ మహావీరుడి చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం మహావీర్ జయంతి కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, రమేష్ జైన్, రవి కొఠారి, నిర్మల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి నడుద్దాం.. ఘన విజయం సాధిద్దాం

- పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్
- ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉందని, సమన్వయంతో అంతా కలసి పనిచేయడం ద్వారా ఘనవిజయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమైన సీఎం జగన్ పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేశారు. వారికి నిర్దేశించిన జిల్లాల్లో నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత సమర్థంగా నెరవేర్చాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్ది అం దర్నీ ఒక్క తాటిపైకి తేవాలని సూచించారు. అంతిమంగా మన అభ్యర్థులకు మంచి మెజార్టీ రావాలని, ఆ లక్ష్యంతోనే పనిచేయాలని నిర్దేశించారు. పార్టీ సమన్వయకర్తలుగా వారు తనతో ఏ విషయాన్నైనా చర్చించవచ్చని, ఎప్పుడైనా కలవవచ్చని సూచించారు. 'పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్' అని పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల రూపంలో చక్కటి యంత్రాంగం ఉందని, వలంటీర్లను వారితో మమేకం చేయాలన్నారు. ఈ యంత్రాంగం చురుగ్గా పని చేసేలా, క్రియాశీలకంగా వ్యవహరించేలా కార్యక్రమాలను రూపొందిం చామన్నారు. వాటిని సజావుగా, సమర్థంగా ఆయా నియోజకవర్గాల్లో నిర్వర్తించేలా పర్యవేక్షణ, సమన్వయ బాధ్యతలను స్వీకరించాలని సూచిం చారు. 'మీరు, నేను, పార్టీ యంత్రాంగం అంతా కలసి ముందుకుసాగితే ఎన్నికల్లో విజయభేరి మోగించడం తథ్యం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రజల నినాదమే

- పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన సజ్జల
- 7 నుంచి 20 వరకూ 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్'



సాక్షి, అమరావతి: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ అంచనాలకు మించి రెండింతలు నమ్మకాన్ని నిలబెట్టుకున్నారని ప్రజలు చెబుతున్నారన్నారు. సీఎం జగన్‌ను తామంతా విశ్వసిస్తున్నామని, తమ భవిష్యత్తు ఆయనలో కనిపిస్తోందని ప్రజలు బలంగా చెబుతున్నారన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' నినాదం ప్రజల ఆకాంక్షల నుంచి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం లభిస్తుందన్నారు. మం గళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రులు మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం ,ఎమ్మెల్యే మల్లాది విష్ణులతో కలసి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పోస్టర్‌ను సజ్జల ఆవిష్కరించారు. ఈనెల 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. సజ్జల ఏమన్నారంటే..

ప్రజల ఆకాంక్షల మేరకు..

ప్రజలతో మమేకమయ్యేందుకు భారీ స్థాయిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పార్టీ పరంగా పనిచేసే వారు కార్యకర్తలుగానే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి నెరవేర్చేలా ముందుకెళ్తాం. ప్రభుత్వం పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి అంచ నాలకు అనుగుణంగా నడుచుకునేలా భారీ కసరత్తు ప్రారంభించాం. ఈ కార్య క్రమం ఎలా ఉండాలి? పార్టీ సైన్యం ప్రజలతో ఏ విధంగా మమేకమవ్వాలనే విషయంపై ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చాం.

14 రోజులపాటు కార్యక్రమం..

ఈ నెల 7 నుంచి 20 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతుం ది. 7 లక్షల మంది సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో కూడిన క్షేత్ర స్థాయి సైన్యం ఈ కార్యక్రమంలో పదాతిదళంగా వ్యవహరిస్తుంది. వలంటీర్లు స్థానికంగా ఎంత ప్రాంతాన్ని కవర్ చేస్తారో అంతే పరిధిలో గృహ సారథుల వ్య వస్థ కూడా పనిచేస్తుంది. సచివాలయాల కన్వీనర్లతోపాటు మండల ఇన్‌చార్జ్‌లు, వారిని ఎప్పటికప్పుడు సమన్వయం చేసే జోనల్ కో–ఆర్డినేటర్ వ్యవస్థలు 'జగనన్నే మా భవిష్యత్తు'లో పూర్తిస్థాయిలో భాగస్వాములు అవుతారు. ఈ యంత్రాంగం మొత్తం శాసనసభ్యులు, నియోజకవర్గాల సమన్వయకర్తల ఆధ్వ ర్యంలో నడుస్తుంది. 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం ద్వా రా దాదాపు 1.60 కోట్ల కుటుంబాలను కలుసుకుంటారు. గత సర్కార్‌కు, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటారు. రాష్ట్రం లో సగటున 87% కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు జరుగుతోం ది. అర్హులైన కుటుంబాలను నూరుశాతం సంక్షేమ పథకాల పరిధిలోకి తెచ్చిన నేపథ్యంలో సర్వే ద్వారా వారి అభిప్రాయాల్ని సేకరిస్తాం. వికృత చేష్టలతో సం క్షేమ రథానికి అడ్డుపడుతున్న దుష్టశక్తులకు గుణపాఠం చెబుతాం.

రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పురపాలక శాఖ, సీఆర్‌డీఏలను న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాం త్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గం గారావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు ఇళ్ల స్థలాలపై పిటిషన్లు..

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేసేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రినాయుడు, ఉన్నం మురళీధరరావు, దేవ్‌దత్ కామత్, వీఎస్‌ఆర్ ఆంజనేయులు తదితరులు వాదిం చారు. ఇళ్ల స్థలాల నిమిత్తం గతంలో జారీ చేసిన జీవోను హైకోర్టు నిలుపుదల చేసిందని మురళీధరరావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తరువాత సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేసి ఆర్ 5 జోన్ తెచ్చారన్నారు.

తుది ఉత్తర్వులకు లోబడి ఉండేలా ఆదేశాలిస్తాం..

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉండేలా ఆదేశాలు ఇస్తామని పేర్కొనగా దీన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. రాజధాని భూములను



అన్యాక్రాంతం చేయడం, బదలాయించడం, థర్డ్ పార్టీ హక్కులు సృష్టించడం చేయరాదని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా 3 అంశాలపైనే స్టే విధించిం దన్నారు. మిగిలిన అంశాల విషయంలో హైకోర్టు తీర్పు అమల్లోనే ఉందని నివేదించారు.

పరిస్థితిని జటిలం చేయలేం..

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రజలందరిదని, అది ఏ వ్యక్తిదో, వర్గానిదో కాదని స్పష్టం చేసింది. రాజధానిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యం లో జీవో 45 విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వమే సమస్యను జటిలం చేస్తోందంటూ పిటిషనర్ల న్యాయవాది దేవ్‌దత్ కామత్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను చదివి వినిపిం చడంతో... సుప్రీంకోర్టు ఉత్తర్వులకు తమను భాష్యం చెప్పమని కోరుతున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కావాలంటే సుప్రీంకోర్టుకే వెళ్లాలని స్పష్టం చేసింది. రాజధాని విషయంలో హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషనర్ల న్యాయవాదులు పేర్కొనగా దానిపై ఇప్పటికే కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైందని ధర్మాసనం తెలిపింది.

ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరు..

ఈ సమయంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు స్పందిస్తూ థర్డ్ పార్టీలకు భూములు కేటాయిస్తే విషయం జటిలం అవుతుందన్నారు. తదుపరి దాఖలు చేసే వ్యాజ్యాల్లో వారందరినీ ప్రతివాదులుగా చేయాల్సి ఉంటుందని, అది ఆచరణ సాధ్యం కాద న్నారు. పిటిషనర్లు రైతులని, ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల వారి హక్కులు ప్రభావితం అవుతాయన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఇవి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కావని, అందరి తరఫున వ్యాజ్యా లు వేసి జీవో మొత్తాన్ని నిలుపుదల చేయాలని కోరలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ఇతరులు కూడా లబ్ధి పొందుతున్నారని గుర్తు చేసింది. ప్రస్తుత దశలో జీవో 45 విషయంలో ఎలాంటి మధ్యం తర ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది. అపరిపక్వమైన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదంది. ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరని వ్యాఖ్యానించింది. రైతులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఇతరులకు ఇళ్ల స్థలాలివ్వడం చట్ట విరుద్ధమని మరో సీనియర్ న్యాయవాది వీఎస్‌ఆర్ ఆం జనేయులు వాదించారు.

జరగని కేటాయింపులపై వ్యాజ్యాలేమిటి?

ఈ వ్యాజ్యాలను ఇప్పటికిప్పుడు విచారించాల్సినంత అత్యవసరం ఏముందో చెప్పాలని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిదీ అత్యవసరమంటూ పిటిషన్లు దాఖలు చేయడాన్ని తాము ఎంతమాత్రం హర్షించబోమని, తమను ఒత్తిడి చేయవద్దని తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయిం పులు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఈ దిశగా ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పునరుద్ఘాటించిం ది. ముఖ్యమంత్రి ఓ సమావేశం నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారని, అం దువల్లే జీవోపై స్టే కోరుతున్నామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు నివేదించారు. 'ప్రభుత్వం పని చేయాల్సిం దే కదా. నిర్ణయాలు తీసుకోకుండా ఎలా నిరోధించగలం? అసలు ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి. ప్రభుత్వం భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే చెప్పిం ది. కేటాయింపులు ఇంకా జరగలేదు. జరగని కేటాయిం పులపై వ్యాజ్యాలు దాఖలు చేయడం ఏమిటి? ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయనివ్వండి. ఆ తరువాత ఏం చేయాలో చూద్దాం...' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఇన్‌సైడర్స్.. అవుట్ సైడర్స్ ఏమిటి?

సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ మే మొదటి వారంలో ఇళ్ల స్థలాలివ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. అవుట్‌సైడర్స్‌కు (రాజధానేతరులు) ఇళ్ల స్థలాలిస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొనడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. రాజధాని ప్రజలందరిదీ, కేవలం పూలింగ్ కింద భూములిచ్చిన వారిది మాత్రమే కాదని పేర్కొంది. అవుట్ సైడర్స్, ఇన్‌సైడర్స్ అంటూ మాట్లాడొద్దని సూచిం చింది. రాజధాని భూములను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా అదే జరుగుతోందని తెలిపింది.

ప్రజలతో మమేకమయ్యే భారీ కార్యక్రమం
'జగనన్నే మా భవిష్యత్'

- మీడియాతో మంత్రులు బొత్స, మేరుగు, వేణు, ఎమ్మెల్సీలు
- ఈ నెల 7వ తేదీ నుంచి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం చేపడుతున్నట్టు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభివృ ద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రులు, పలువురు ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎవరేమన్నారంటే..

7 లక్షల మంది పదాతి దళంతో..



రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులపాటు నిర్వహించే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో 7 లక్షల మంది వరకు ప్రధాన కార్యకర్తలు మా పదాతి దళంగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం సచివాలయ వలంటీర్లు స్థానికంగా ఎంత ఏరియా కవర్ చేస్తారో, అంతే పరిధిలో గృహ సారథుల వ్యవస్థ కూడా పనిచేస్తుంది. వాళ్లమీద సచివాలయ కన్వీనర్ల వ్యవస్థతో పాటు మండల ఇన్‌చార్జులు, వారిని ఎప్పటికప్పుడు సమన్వయం చేసే జోనల్ కో–ఆర్డినేటర్ల వ్యవస్థలు సైతం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పూర్తి స్థాయిలో భాగస్వాములవుతారు. ఈ యంత్రాంగం మొత్తం శాసనసభ్యులు, నియోజకవర్గాల సమన్వయకర్తల ఆధ్వర్యంలో నడుస్తుంది.
– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమం



వైఎస్సార్‌సీపీ తరఫున ప్రజలతో మమేకమయ్యే ఒక భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పార్టీ తరఫున సచివాలయ కన్వీన ర్లతోపాటు వారి తర్వాత స్థాయిలో పనిచేసే గృహ సారథుల నియా మకం తర్వాత తొలిసారిగా ఒక కార్యక్రమంతో ప్రజలతో మమేకమవుతున్నాం. ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చే బాధ్యత గల కార్యకర్తలున్న రాజకీయ పార్టీగా వైఎస్సార్‌సీపీ ముందుకు వెళ్తుందన్నది నిరూపించాలనేది మా ప్రయత్నం.
– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

ప్రజాభిప్రాయం తెలుసుకుంటాం



గత ప్రభుత్వాలకు ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటాం. మా నాయకుడు వైఎస్ జగన్ చెప్పినట్టు రాష్ట్రంలో సగటున 87 శాతం ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల పూర్తిస్థాయి విశ్వసనీయత కనబరుస్తారనే బలంగా నమ్ముతున్నాం. సీఎం జగన్ నడుపుతున్న సంక్షేమ రథానికి అడ్డంపడే ప్రయత్నాలు, కుట్రలు చేస్తున్న దుష్టశక్తులకు ఈ కార్యక్రమం తగిన గుణపాఠం చెబుతుంది.
– జయమంగళ వెంకట రమణ, ఎమ్మెల్సీ

గుణాత్మక మార్పు కనిపిస్తోంది



తమ భవిష్యత్ సీఎం వైఎస్ జగన్‌లో కనిపిస్తోందనే విషయం ప్రజల మాటల్లో బలంగా వినిపిస్తోంది. ప్రజల నుంచి వచ్చిన 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదాన్నే కార్యక్రమం పేరుగా ఎందు కు చేయకూడదని పార్టీ నాయకత్వం అనుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా సీఎంతో మాట్లాడే అవకాశం కూడా లభిస్తోంది. పలు సర్వేలను పరిశీలిస్తే.. 80 నుంచి 90 శాతం వరకు సమాజంలో గుణాత్మకమైన మార్పు కనిపిస్తోందని నిరూపితమైంది.
– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యం. ఇప్పుడు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేసే కుట్రలు చేస్తున్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న రోజుల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం. దోచుకో.. పంచుకో.. తినుకో.. కార్యక్రమానికి సీఎం జగన్ గండి కొట్టారు. సచివాలయ కన్వీనర్లను, గృహసారథులను కలుపుకుని ప్రజల్లోకి వెళ్తాం. 2024లోనూ విజయం వైఎస్సార్‌సీపీదే.
– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

45 నెలల్లో పేదలకు రూ.2,96,148.09 కోట్లు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 45 నెలల్లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా (డీబీటీ, నాన్ డీబీటీ) రూ.2,96,148.09 కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూర్చింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏ నెలలో ఏ సం క్షేమ పథకాల ద్వారా ఏడాది పొడవునా ప్రయోజనం చేకూర్చ నుందో వెల్లడిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను ముందే ప్రకటించి మరీ అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే కావడం గమనార్హం . జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023 – 24ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాల యంలో ఆవిష్కరించారు. సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సమాచారశాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు.

2023-24 ఏ నెలలో ఏ పథకం?

- ఏప్రిల్ 2023: జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఈబీసీ నేస్తం
- మే 2023 : వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ (మొదటి విడత), వైఎస్సార్ ఉచిత పంటల బీమా, జగనన్న విద్యాదీవెన (మొదటి విడత), వైఎస్సార్ కళ్యాణమస్తు–షాదీ తోఫా (మొదటి త్రైమాసికం), వైఎస్సార్ మత్స్యకార భరోసా
- జూన్ 2023: జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి
- జూలై 2023: జగనన్న విదేశీ విద్యా దీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కళ్యాణమస్తు–షాదీతోఫా (రెండో త్రైమాసికం)
- ఆగస్టు 2023: జగనన్న విద్యా దీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర
- సెప్టెంబర్ 2023: వైఎస్సార్ చేయూత
- అక్టోబర్ 2023: వైఎస్సార్ రైతుభరోసా– పీఎం కిసాన్ (రెండో విడత), జగనన్న వసతి దీవెన (మొదటి విడత)
- నవంబర్ 2023: వైఎస్సార్ సున్నావడ్డీ– పంట రుణాలు, వైఎస్సార్ కళ్యాణమస్తు– షాదీతోఫా (మూడో త్రైమాసికం), జగనన్న విద్యాదీవెన (మూడో విడత)
- డిసెంబర్ 2023: జగనన్న విదేశీ విద్యాదీవెన (రెండో విడత), జగనన్న చేదోడు, మిగిలిపోయిన లబ్ధిదారులకు లబ్ధి
- జనవరి 2024: వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ (మూడో విడత), వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు (రెండో విడత), వైఎస్సార్ లా నేస్తం (రెండో విడత), పెన్షన్ల పెంపు (నెలకు రూ.3,000)
- ఫిబ్రవరి 2024: జగనన్న విద్యా దీవెన (నాలుగో విడత), వైఎస్సార్ కళ్యాణమస్తు – షాదీ తోఫా (నాలుగో త్రైమాసికం), వైఎస్సార్ ఈబీసీ నేస్తం
- మార్చి 2024: జగనన్న వసతి దీవెన (రెండో విడత), ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు

సీఎం వైఎస్ జగన్ ఒంటిమిట్ట పర్యటన రద్దు

సాక్షి, అమరావతి/కడప సిటీ: వైఎస్సార్ జిల్లాలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన రద్దయింది. ఆయన ఉదయం వ్యాయామం చేస్తున్న సమయంలో కాలు బెణికింది. సాయంత్రానికి కాలినొప్పి పెరిగడంతో ప్రయాణాలు రద్దు చేసుకుని, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీం తో ముఖ్యమంత్రి వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట పర్యటన రద్దు అయిందని సీఎంవో ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన బుధవారం ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉంది.

'ఏపీ 40 జీ'తో ప్రభుత్వ వాహనాలకు రిజిస్ట్రేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ విభాగాల కోసం కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు 'ఏపీ 40 జీ' సిరీస్‌తో రిజిస్ట్రేషన్ నంబర్లు కేటాయించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా చట్టానికి సవరణ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.1	26.7
కర్నూలు	40.2	27.4
రాజమహేంద్రవరం	38.5	25.8
కనిగిరి	38.0	26.0
నంద్యాల	38.0	25.0
కడప	37.3	25.4
నెల్లూరు	36.3	27.2
విజయవాడ	36.0	26.0
తిరుపతి	36.0	23.0
విశాఖపట్నం	34.8	26.0
అనకాపల్లి	34.5	24.0
కాకినాడ	34.1	25.8
మచిలీపట్నం	34.0	27.0
ఏలూరు	34.0	26.0
భీమవరం	34.0	24.0
విజయనగరం	33.0	25.0
శ్రీకాకుళం	31.0	26.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	40.0	23.7
రామగుండం	37.0	26.2
హైదరాబాద్	37.6	25.0

క్లుప్తంగా...

ఆర్టీసీలో కొత్తగా 140 బస్సులు

అద్దె ప్రాతిపదికన ప్రవేశపెట్టేందుకు టెండర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో 140 కొత్త బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ మంగళవారం టెండర్లు పిలిచింది. వాటిలో నాన్ ఏసీ స్లీపర్-11, సూపర్ లగ్జరీ-5, అల్ట్రా డీలక్స్-7, ఎక్స్‌ప్రెస్-30, అల్ట్రా పల్లెవెలుగు-41, పల్లెవెలుగు-25, మెట్రో ఎక్స్‌ప్రెస్-18, సిటీ ఆర్డినరీ-3 బస్సులు ఉన్నాయి. ఆసక్తిగల బిడ్డర్లు ఆర్టీసీ ఇ-కామర్స్ పోర్టల్ 'ఎంఎస్‌టీసీ'లో నమోదు చేసుకుని టెండరుదరఖాస్తులు పొందాలి. బిడ్లను ఈ నెల 5 ఉదయం 10 నుంచి 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియను మే 3 ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు. అద్దె బస్సులు ప్రవేశపెట్టే రూట్లు, బస్సుల ప్రమాణాలు, ఇతర వివరాల కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆర్టీసీ ఈడీ(ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మైనింగ్‌లో ఫలించిన సంస్కరణలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: మైనింగ్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని మైనింగ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో గనుల శాఖ, ఏపీఎండీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.4,692 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. మేజర్ మినరల్స్‌లో 81 శాతం, మైనర్ మినరల్స్‌లో ఏకంగా 125 శాతం పురోగతి సాధించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 4,222 నాన్-వర్కింగ్ లీజుల్లో ఇప్పటికే 3,142 చోట్ల మైనింగ్ జరుగుతోందని, మిగతా వాటిలోనూ కార్యకలాపాలకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి, ఏపీఎండీసీ వైస్ ప్రెసిడెంట్ రామ్ నారాయణన్, సలహాదారు డీఎల్ఆర్ ప్రసాద్, గనుల శాఖ జేడీ రాజబాబు, డీడీ రవి చంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం జూలైకి పూర్తి

- రూ.380 కోట్లకు పెరిగిన స్మృతివనం నిర్మాణ వ్యయం
- మంత్రి మేరుగు నాగార్జున సమీక్ష



సాక్షి, అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణం జూలైకి పూర్తవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం రూ.268 కోట్ల నుంచి రూ.380 కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణంపై మంగళవారం మంత్రి మేరుగు నాగార్జున సచివాలయంలో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి నాటికి స్మృతివనం పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అనివార్య కారణాలతో కాస్త ఆలస్యమవుతోందని తెలిపారు. జూలైకి పనులను పూర్తిచేసి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పురోగతిని శిల్పి నరేష్ వివరించారు. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, డైరెక్టర్ కె.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రబీలో పకడ్బందీగా ధాన్యం సేకరణ

మంత్రి కారుమూరి



సాక్షి, అమరావతి: రబీ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి గింజను కొనుగోలు చేయాలని చెప్పారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ అధికారులు, మిల్లర్లతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని, ఆర్బీకేల్లో ముందస్తుగా గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడా రైతుకు మద్దతు ధర తగ్గకుండా, అవకతవకలకు తావు లేకుండా కొనుగోళ్లు చేయాలని చెప్పారు. మిల్లర్లకు బ్యాంక్ గ్యారంటీ విషయంలో వెసులుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిల్లర్లు ధాన్యం సేకరణలో జోక్యం చేసుకున్నా, బియ్యం దారిమళ్లించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'



ఏలూరులోని రామకోటి ప్రాంగణంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



అనకాపల్లిలో డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మహిళా నేతలు



వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా ఒంగోలు చర్చి సెంటర్‌లో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



వైఎస్సార్ జిల్లా కమలాపురంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో కోలాటమాడుతున్న మహిళలు



నంద్యాల జిల్లా బేతంచర్లలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, చిత్రంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

'అక్కసు'కి అంతే లేదు!

సచివాలయానికి 15 కి.మీ లోపు ఉంటేనే పింఛన్ అంటూ 'ఈనాడు' అసత్య ప్రచారం

నా మనవడు జగనయ్య చల్లగా ఉండాలయ్యా..



ఈ చిత్రంలో నడవలేని స్థితిలో మంచంపై కూర్చొని ఉన్న వృద్ధురాలి పేరు రామలక్షుమ్మ. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఎస్‌బీఐ కాలనీలో ఉంటోంది. ఆ ప్రాంత వలంటీర్ భాస్కర్ ఉదయాన్నే ఆ వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. దీంతో రామలక్షుమ్మ సంతోషం వ్యక్తం చేసింది. 'నా మనవడు జగనయ్య మా కోసం వలంటీర్లను పెట్టారు. ఇంటి వద్దకే పింఛన్ పంపిస్తున్నారు. నా మనవడు చల్లగా ఉండాలయ్యా' అంటూ దీవించింది.

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: 'ఈనాడు' అక్కసుకు అవ్వా తాత, అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులు.. ఇలా ఎవరూ అతీతం కాదు. ఎవరికి మంచి జరిగినా తన ఓర్వలేనితనాన్ని అక్షర రూపంలో కక్కుతోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి ప్రజలకు చేస్తున్న మంచి కార్యక్రమాలపై అసత్య వార్తలతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఏనాడూ ప్రజలకు ఒక్క మేలూ చేయని చంద్రబాబుని తిరిగి పీఠం ఎక్కించడమే లక్ష్యంగా ఈనాడు అబద్ధపు కథనాలు సాగుతుంటాయి. ఇందులో భాగంగానే అవ్వాతాతలకు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ఇచ్చే పింఛనుపైనా తన అక్కసును వెళ్లగక్కింది. ప్రభుత్వం ఆలోచన కూడా చేయని విషయాన్ని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందంటూ పచ్చి అబద్ధాలను అచ్చేసింది. 'పింఛనుదారులపై మరో పిడుగు' అంటూ మంగళవారం ఈనాడు పత్రికలో వచ్చిన కథనంపై 'ఫ్యాక్ట్ చెక్'.

ఈనాడు కథనం: 'పింఛనుదారులపై మరో పిడుగు. సచివాలయానికి 15 కిలోమీటర్ల లోపు దూరంలో ఉంటేనే పింఛను అందించే వీలు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

వాస్తవం: 'ప్రభుత్వం సంతృప్త స్థాయిలో దాదాపు 63.42 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తోంది. సూర్యుడు ఉదయించక ముందే పింఛన్లను గ్రామ వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి అందించే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. పింఛన్లను మరింత సులభతర మార్గంలో అందించడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా లబ్ధిదారులు సెక్రటేరియట్ నుంచి ఎంత దూరంలో ఉన్నారో తెలుసుకునేందుకు జియో ఫెన్సింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించడానికి సాఫ్ట్‌వేర్ నమూనాలో అధికారులు చిన్న మార్పు చేశారు. పింఛన్లు మరింత సమర్థంగా, అత్యంత సులభంగా అందించడానికి అవసరమైన సమాచార సేకరణలో భాగంగా మాత్రమే.. అదీ ప్రయోగాత్మకంగానే జరుగుతుందని ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. ఇప్పటివరకు దీనిపైన ఎలాంటి ఉత్తర్వులు కూడా జారీ చేయలేదు.

'ఈనాడు' కథనం: సచివాలయం నుంచి 15 కిలోమీటర్ల లోపు మాత్రమే వలంటీర్లు పింఛన్లు అందించే సదుపాయం ఉంటుంది. 15 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉంటే పింఛను అందించే అవకాశం వలంటీర్లకు ఉండదు.

వాస్తవం: ప్రభుత్వం ఉత్తర్వులే జారీ చేయనప్పుడు 15 కిలోమీటర్లకంటే ఎక్కువ దూరంలో ఉన్నవారికి పింఛన్లు అందించరన్నది పూర్తిగా తప్పు. అర్హులకు పింఛను ఎలా ఇవ్వాలో అనే ఆలోచనే తప్ప ఎలా ఎగ్గొట్టాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదని ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయాన్ని ప్రభుత్వం గుర్తు చేస్తోంది.

పేదల పక్షపాతి సీఎం జగన్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేదల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన దానికంటే ఎక్కువగానే మేలు చేస్తున్నారు. పైసా అవినీతి లేకుండా, ఆ పార్టీ ఈ పార్టీ, కులం, మతం అన్న తారతామ్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో పథకాలను అమలు చేస్తున్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యి నాలుగేళ్లు పూర్తి కాకమునుపే దేశంలో మరే రాష్ట్రంలో జరగని విధంగా ఏకంగా సుమారు రూ.2 లక్షల కోట్లపైగా పేద ప్రజలు నేరుగా లబ్ధి పొందారు. అందుకే సీఎం జగన్ పేదల పక్షపాతిగా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏనాడూ అమలు చేయని చంద్రబాబు, ఆయనకు వంతపాడే ఎల్లో మీడియాకు ఇది మింగుడు పడని విషయమే. అందుకే వైఎస్ జగన్‌పై విషం చిమ్మి, చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రి చేయాలన్న కుయుక్తులతో 'ఈనాడు' తప్పుడు కథనాలు రాస్తోంది.

ఉద్దేశపూర్వక విష ప్రచారంపై చర్యలు తీసుకుంటాం: సెర్ప్

'పింఛనుదారులపై మరో పిడుగు' శీర్షికన ఈనాడు ప్రచురించిన కథనాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయం ఖండించింది. 'ఈనాడు పత్రిక అసత్య వార్తలు రాయడం ద్వారా ప్రజలు, పింఛను లబ్ధిదారులకు తప్పుడు సమాచారం అందించినట్టు అవుతుంది. తప్పుడు రాతలతో లబ్ధిదారులను ఆందోళనకు గురిచేసినట్టు అవుతుంది. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన విష ప్రచారంగానే భావిస్తూ, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని సెర్ప్ కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది.

అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడానో..

- 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో అవ్వాతాతలు, వితంతువుల, దివ్యాంగులు పింఛను మంజూరు చేయండంటూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. కష్టనష్టాలకోర్చి ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరిగినా పింఛను మంజూరయ్యేది కాదు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పింఛను మంజూరుకు లబ్ధిదారులు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. అర్హులు ఉంటే గ్రామ, వార్డు వలంటీర్లే వారి వద్దకు వెళ్లి దరఖాస్తు పూర్తి చేసి, సచివాలయంలో దానిని అందజేస్తారు. అర్హతల మేరకు వారికి పింఛను మంజూరు కాగానే ఆ మంజూరు పత్రాన్ని ఇంటికే తెచ్చి ఇచ్చేస్తున్నారు.
- చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం రెండేళ్లకు ఒకసారి నియోజకవర్గానికి 200 – 300 కొత్త పింఛన్లు మంజూరు చేసేది. వాటిని కూడా జన్మభూమి కమిటీ (ఆ కమిటీల్లో ఉండేది ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ నేతలే) సభ్యులు మంజూరు చేసేవారు. కేవలం తమ పార్టీకి ఓటు వేసిన వారికి లేదంటే లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంతృప్త స్థాయిలో అర్హులందరికీ ఎప్పటికప్పుడే కొత్త పింఛన్ల మంజూరు చేస్తోంది. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం మూడేళ్లలోనే 24.69 లక్షల కొత్త పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది.
- తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అవ్వాతాతలు, దివ్యాంగులు ఎవరైనా పింఛను కావాలంటే ప్రతి నెలా ఆ ఊరిలో ఆఫీసుకు వెళ్లి పడిగాపులు పడాలి. తమ ఊరిలో ఎప్పుడు పింఛన్ల పంపిణీ జరుగుతుందో తెలియక ప్రతి రోజూ ఆఫీసుకు వచ్చి ఎండలో కూర్చొని ఉసూరుమంటూ తిరిగి వెళ్లే దయనీయ పరిస్థితి ఉండేది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పింఛనుదారులకు ఈ బాధలు తప్పాయి. ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీనే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు లేదా వారు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛను అందజేసే విప్లవాత్మక మార్పునకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనివల్ల పింఛనుదారులకు వ్యయప్రయాసలు తప్పాయి. ఎవరికీ పైసా ముట్టజెప్పాల్సిన అవసరం లేకుండానే పింఛను సొమ్ము మొత్తం చేతికి వస్తోంది.
- అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి నెలకు సరాసరిన కేవలం రూ. 400 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టే పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి రూ. 1,750 కోట్ల దాకా ఖర్చు పెడుతోంది.

జనంలోకి వైఎస్సార్‌సీపీ

టీడీపీ సర్కార్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను చెప్పనున్న శ్రేణులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 45 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వివరించడమే లక్ష్యంగా 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ కార్యక్రమాన్ని చేపట్టింది. సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లు.. ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహసారథులు వెరసి ఏడు లక్షల మందితో క్షేత్రస్థాయిలో అత్యంత క్రియాశీలక వ్యవస్థలను ఏర్పాటు చేశాక మొట్టమొదటగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈనెల 7న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం 20 వరకూ అంటే 14 రోజుల పాటు కొనసాగుతుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తల నేతృత్వంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని 1.60 కోట్ల ఇళ్లకు కన్వీనర్లు, గృహసారథులు వెళ్లి.. ఆ కుటుంబాల ప్రజలతో మమేకమవుతారు. 2.6 లక్షల మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొంటారు. టీడీపీ సర్కార్‌కూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాలను వివరిస్తారు. ప్రతిపక్షాలు వికృత చేష్టలకు ఒడిగడుతూ.. ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ రథానికి అడుగడుగునా అడ్డుతగులుతున్న వైనాన్ని ప్రజలకు చాటిచెప్పనున్నారు. 'పీపుల్స్ సర్వే'లో భాగంగా ప్రతి ఇంట్లోనూ ఐదు ప్రశ్నలు అడిగి.. వారు చెప్పిన సమాధానాలను 'ప్రజా మద్దతు పుస్తకం'లో నమోదుచేసి రశీదు ఇస్తారు. ఆ తర్వాత జగన్ సర్కారుకు మద్దతు తెలిపేందుకు అంగీకరించిన వారితో 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని ఆ కుటుంబ సభ్యులను గృహసారథులు కోరుతారు. ఇలా మిస్డ్‌కాల్ ఇచ్చిన నిమిషంలోపే వారికి సీఎం జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ వస్తుంది. సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపట్ల రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాల ప్రజలు పూర్తి విశ్వసనీయత కనబరచి.. 'జగనన్నే మా భవిష్యత్తు' అంటూ నినదించి.. ప్రతిపక్షాలకు తగినరీతిలో గుణపాఠం చెబుతారని వైఎస్సార్‌సీపీ బలంగా నమ్ముతోంది. ఈ కార్యక్రమాన్ని మండల ఇన్‌చార్జ్‌లు, జోనల్ కో-ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తారు.

బాధ్యత కలిగిన కార్యకర్తలున్న పార్టీ..

ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలుగానే కాకుండా... ప్రజల అవసరాలను గుర్తించి.. వాటిని తీర్చే బాధ్యతగల కార్యకర్తలున్న పార్టీగా వైఎస్సార్‌సీపీ ముందుకెళ్తోందన్నది 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో నిరూపించాలని వైఎస్సార్‌సీపీ నిర్దేశించుకుంది. ప్రభుత్వ పనితీరుపై.. పార్టీపట్ల ప్రజల అభిప్రాయాన్ని, వారి సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. ప్రజల అంచనాలకు అనుగుణంగా పార్టీ అజెండా మార్చుకోవాలనుకునే సమర్థమంతమైన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌ను కలిగి ఉన్నది వైఎస్సార్‌సీపీ అని గర్వంగా చెప్పుకునేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా చేసుకుంది. అందుకనే, ప్రజలతో మమేకమయ్యే ఈ భారీ కార్యక్రమం ఎలా ఉండాలి? మా పార్టీ సైన్యం ప్రజలతో ఏ విధంగా మమేకమవ్వాలనే విషయంపై ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చింది.

ప్రజల నుంచి వచ్చిన నినాదంతోనే...

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం సీఎం వైఎస్ జగన్ అమలుచేసి ఎన్నికల మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా.. లంచాలకు తావులేకుండా.. అత్యంత పారదర్శకంగా 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. నాలుగేళ్లు గడవక ముందే సంక్షేమ పథకాల ద్వారా రూ.2 లక్షల కోట్లకు పైగా నిధులను డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. విద్య, వైద్య, వ్యవసాయరంగాలలో విప్లవాత్మక సంస్కరణలను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారు. గ్రామ, వార్డు సచివాలయాలు.. 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించడం ద్వారా వికేంద్రీకరించి ప్రజల ఇళ్ల వద్దకే పరిపాలనను తీసుకొచ్చారు. దాంతో సీఎం జగన్‌పై నానాటికీ ప్రజల్లో ఆదరణ పెరుగుతూ వస్తోంది. 2019 తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలతోపాటు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి రికార్డు విజయాలను కట్టబెట్టడం ద్వారా 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదించారు. ప్రజల నుంచి వచ్చిన ఆ నినాదంతోనే వైఎస్సార్‌సీపీ భారీ కార్యక్రమాన్ని చేపట్టింది.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోనూ..

గత ప్రభుత్వాల ఆలోచనలకు భిన్నంగా.. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండే లక్షణం రాజకీయ పార్టీలకు ఉండాలన్నది వైఎస్సార్‌సీపీ విధానం. ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలకు, అంచనాలకు అనుగుణంగా పాలన సాగించాలన్నది వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం. ప్రజల జీవితాల్లో, వారి జీవనశైలిలో స్పష్టమైన మార్పును తెచ్చి.. ఆ మార్పును కళ్లకు కట్టినట్లు చూపించడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ చెబుతోంది. అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేసి చూపించింది. గత 45 నెలల్లో ప్రజల జీవితాల్లో అనూహ్యమైన మార్పును తెస్తూ, బాధ్యతగా సేవలందించడంలో అందరికంటే మేం ముందున్నామని వైఎస్సార్‌సీపీ చాటిచెబుతోంది. పార్టీ అజెండా రూపకల్పన నుంచి.. సంక్షేమ పథకాల అమలుతీరు.. మెరుగైన పాలన అందిస్తున్న క్రమాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నది గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న స్పందనే తార్కాణమని చెబుతోంది.

విజయవంతంగా దశలవారీ మద్య నియంత్రణ

- చంద్రబాబు హయాం కంటే గణనీయంగా తగ్గిన మద్యం అమ్మకాలు
- గణాంకాలతో సహా వెల్లడించిన ఎక్సైజ్ శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంతో పోలిస్తే వైఎస్ జగన్ పాలనలో మద్యం అమ్మకాలు భారీగా తగ్గాయి. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో దశలవారీ మద్య నియంత్రణ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్టు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో మద్యం అమ్మకాలు, 2019 నుంచి 2022 వరకు జరిగిన మద్యం అమ్మకాల వివరాలను వెల్లడించింది. చంద్రబాబు అధికారం చేపట్టే నాటి కంటే ఆయన దిగిపోయే నాటికి మద్యం విక్రయాలు భారీగా పెరగ్గా.. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి ఉన్న మద్యం విక్రయాలు ఆ తర్వాత గణనీయంగా తగ్గాయి.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

ఏడాది	ఐఎంఎల్(మద్యం) విక్రయాలు	బీరు విక్రయాలు
2014-15	2.88 కోట్ల కేసులు	1.74 కోట్ల కేసులు
2015-16	3.06 కోట్ల కేసులు	1.69 కోట్ల కేసులు
2016-17	3.32 కోట్ల కేసులు	1.74 కోట్ల కేసులు
2017-18	3.60 కోట్ల కేసులు	2.27 కోట్ల కేసులు
2018-19	3.84 కోట్ల కేసులు	2.77 కోట్ల కేసులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

ఏడాది	ఐఎంఎల్(మద్యం) విక్రయాలు	బీరు విక్రయాలు
2019-20	3.08 కోట్ల కేసులు	2.12 కోట్ల కేసులు
2020-21	1.94 కోట్ల కేసులు	57.57 లక్షల కేసులు
2021-22	2.78 కోట్ల కేసులు	82.60 లక్షల కేసులు

మద్య నిషేధాన్ని ఎత్తేసింది చంద్రబాబే

- చంద్రబాబు, రామోజీ తోడు దొంగలు
- బాబు హయాంలో ఏటా మద్యం అమ్మకాలు పెరిగింది నిజం కాదా
- 'మార్గదర్శి' అక్రమాల పుట్ట పగులుతుందనే బాధతోనే రామోజీరావు ఆక్రోశం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత ఫైర్



సాక్షి,అమరావతి: 'ఎన్టీఆర్ అమలు చేసిన సంపూర్ణ మద్యనిషేధాన్ని ఎత్తివేసింది చంద్రబాబే కదా. ఈ విషయాన్ని ఈనాడు రామోజీరావు ఎందుకు రాయరు' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ప్రశ్నించారు. చంద్రబాబు, రామోజీరావు తోడు దొంగలని ఆమె ఫైర్ అయ్యారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మద్యాన్ని ఏరులై పారించిన చంద్రబాబు ఎవరి రక్తమాంసాలతో వ్యాపారం చేశారో రామోజీకి కన్పించలేదా. మార్గదర్శి అక్రమాల పుట్ట పగులుతుందనే బాధతో రామోజీరావు రాష్ట్ర ప్రభుత్వంపై ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు' అని దుయ్యబట్టారు. బాబు హయాంలో ఏటా మద్యం అమ్మకాలు పెరిగింది వాస్తవం కాదా, సీఎం జగన్ పాలనలో మద్యం ఉత్పత్తి, అమ్మకాలు తగ్గింది నిజం కాదా. దీన్ని నియంత్రణ అని అంటారా.. అనరా. మేం మేనిఫెస్టోలో చెప్పింది నిజమా.. కాదా అని ప్రశ్నించారు. సునీత ఇంకా ఏమన్నారంటే..

వారిద్దరిలో నైతిక అర్హత ఎక్కడ?

- కాంగ్రెస్ హయాంలో సంపూర్ణ మద్య నిషేధం కావాలి. అదే చంద్రబాబు వస్తే మద్య నిషేధం వల్ల అనర్థాలు. ఇదీ రామోజీ, చంద్రబాబు విధానం. అటువంటి వారికి మద్యంపై మాట్లాడే నైతిక అర్హత ఎక్కడుంది? 'మార్గదర్శి' అక్రమాల బండారం బయటకు వస్తుందని రామోజీరావు ఆందోళన చెందుతున్నారు. మరో అగ్రిగోల్డ్ కాకూడదనే మార్గదర్శి చిట్స్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది.
- మద్యాన్ని హెల్త్ డ్రింక్‌గా ప్రమోట్ చేసింది చంద్రబాబే. అప్పుడు ఎవరి రక్తమాంసాలతో చంద్రబాబు వ్యాపారం చేశారు? ఈ విషయంపై రామోజీ సమాధానం చెప్పాలి.బెల్టు షాపులకు ఆద్యుడే చంద్రబాబు. మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి, అవి సరిపోవంటూ ఒక్కో దుకాణానికి అనుబంధంగా బెల్టుషాపులు, పర్మిట్ రూమ్‌లంటూ మద్యం అమ్మించిన ఘనుడు చంద్రబాబు. ఈ దుర్మార్గాలపై ఈనాడులో రాయడానికి రామోజీరావుకు చేతులు రావు.
- సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే మద్యం నియంత్రణకు అనేక చర్యలు చేపట్టారు. మద్యం విధానాన్నే మార్చి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోకి తెచ్చారు. చంద్రబాబు హయాంలో ఉన్న 4,380 మద్యం దుకాణాలను 2,934కు తగ్గించారు. చంద్రబాబు హయాంలో ఉన్న 43 వేల మద్యం బెల్టు దుకాణాలను పూర్తిగా రద్దు చేశారు. పర్మిట్ రూమ్‌ల వ్యవస్థను కూడా రద్దు చేశారు. అక్రమ మద్యాన్ని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ని ఏర్పాటు చేశారు.

పశువుల అక్రమ రవాణా నిషేధం అమలు చేయాలి

అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అమలు చేయాల్సిందేనని అధికారులకు హైకోర్టు తేల్చి చెప్పింది. ఇందుకోసం కిందిస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. తమ ఆదేశాలను అమలు చేయకపోతే కఠినచర్యలు తప్పవని హెచ్చరించింది. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్, డీజీపీలను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. లంపీ స్కిన్ వ్యాధి ఉద్ధృతి నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌ను అధికారులు సరైన స్ఫూర్తితో అమలు చేయడం లేదంటూ విజయవాడకు చెందిన తోట సురేష్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ మంగళవారం విచారించారు.

సంజీవయ్య, సంజీవరెడ్డి ఎస్కేయూలో చదివారు

యువగళంలో నారా లోకేశ్



అనంతపురం శ్రీకంఠం సర్కిల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరోసారి పప్పులో కాలేశారు. అనంత వాసులు విద్యావంతులు, రాజకీయ చైతన్యం కలిగిన వారంటూ..మాజీ సీఎం దామోదరం సంజీవయ్య, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిలు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో చదివి నేతలుగా ఎదిగారని వ్యాఖ్యానించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా ఎస్కేయూలోనే ప్రొఫెసర్‌గా పనిచేశారని చెప్పారు. వాస్తవానికి దామోదరం సంజీవయ్య, నీలం సంజీవరెడ్డిల విద్యాభ్యాసం కాలంలో, సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపకుడిగా పనిచేసిన సమయంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీనే అసలు లేదు. లేని యూనివర్సిటీల్లో ఆయా వ్యక్తులు ఎలా చదివి ఉంటారో అని ప్రజలు నవ్వుకున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం అనంతపురంలోని పెన్నార్ భవన్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో బహిరంగ సభ నిర్వహించారు. లోకేశ్ ప్రసంగిస్తూ..తాము అధికారంలోకి వస్తే అనంతపురంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు డంపింగ్ యార్డు, ఔటర్ రింగు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. బీసీలపై దాడులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకువస్తామన్నారు. వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బాధ్యత తీసుకుంటామన్నారు.



“ మనల్ని రూపొందించేది మన ఆలోచనలే.
మనం ఏం ఆలోచిస్తే అదే అవుతాం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, ఏప్రిల్, 5

చైనా వింత చేష్టలు!

దౌత్యం ఒక ప్రత్యేక కళ. అవతలి పక్షం నుంచి రాబట్టుకోవాలన్నా, మనం ఇచ్చేది ఘనంగా కనబడేట్టు చేయాలన్నా నేర్పుతో, ఓర్పుతో, చాకచక్యంతో మాట్లాడాల్సివుంటుంది. చైనాది మొరటు పద్ధతి. అక్కడి పాలకులకు ఆంతరంగికంగా ఇబ్బందులెదురైనా, సరిహద్దు అవతల తనకు నచ్చని పరిణామం చోటుచేసుకున్నా వెంటనే తన సైనికులను హద్దు దాటించి అలజడి రేకెత్తించటం అలవాటు. అలాంటిది కుదరనప్పుడు నామకరణ మహోత్సవానికి దిగటం రివాజు. తాజాగా చైనా చేసిందదే. ఒక ప్రాంతానికి దక్షిణ టిబెట్ ప్రాంతమని పేరెట్టి, మాండరిన్ భాషాపదమైన జంగ్నన్‌గా దాన్ని వ్యవహరిస్తూ మన అరుణాచల్ ప్రదేశ్ అందులో భాగమని ఎప్పటినుంచో వాదిస్తోంది. ఆ రాష్ట్ర రాజధాని ఇటానగర్‌కు సమీపంలోని పట్టణంతో సహా 11 ప్రాంతాలకు తన సొంత పేర్లతో తాజా జాబితా విడుదల చేసింది. ఇందులో అయిదు పర్వత శిఖరాలు, రెండు జనావాస ప్రాంతాలు, రెండు నదులు, మరో రెండు ఇతర స్థలాలు ఉన్నాయి. లోగడ 2017లో ఒకసారి, 2021లో మరోసారి చైనా ఈ నామకరణ మహోత్సవాలు చేసింది. చైనా దబాయింపులపై ఎప్పటికప్పుడు మన దేశం అభ్యంతరం చెబుతూనే వస్తోంది. ఇప్పుడు తాజాగా పేర్ల జాబితా విడుదల చేస్తూ 'చారిత్రక, పాలనాపర అంశాల ప్రాతిపదికగా' కొత్త పేర్లు పెట్టామని చైనా పౌర వ్యవహారాల మంత్రిత్వ శాఖ చెప్పుకుంటోంది.

చరిత్ర తిరగేస్తే జనం ఒకచోటు నుంచి మరో చోటుకు స్వేచ్ఛగా సంచరిస్తూ వెళ్లటం, ఎక్కడ జీవనం సవ్యంగా గడుస్తుందనిపిస్తే అక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవటం కనబడుతుంది. ఈ ఆవాసాలకూ, దారిలో తారసపడే ప్రదేశాలకూ, నదులకూ, పర్వతాలకూ పేర్లు పెట్టడం కూడా మామూలే. దేశాలు తమ తమ సరిహద్దుల్ని ఖరారు చేసుకోవటం ఇంచుమించు 17వ శతాబ్దంలో మొదలైంది. ఇరుగు పొరుగు దేశాలతో సరిహద్దుల విషయంలో సమస్య ఏర్పడినప్పుడల్లా చరిత్రలో ఆ ప్రాంతాలకు మాండరిన్ భాషలో ఫలానా పేరుందని, కనుక అది తమదేనని మర్కట తర్కానికి దిగటం చైనాకు తెలిసిన విద్య. మన దేశంతో మాత్రమే కాదు... దక్షిణాసియాలో ఇంచుమించు చాలా దేశాలతో దానికి ఇదే తగువు. ఉదాహరణకు దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని రెండు ప్రధాన ద్వీప సమూహాల్లోని స్ప్రాట్లీ, పరాశల్ దీవుల విషయంలో బ్రూనై, ఇండొనేసియా, మలేసియా, ఫిలిప్పైన్స్, తైవాన్, వియత్నాంలతో చైనాకు లడాయి నడుస్తోంది. శతాబ్దాల క్రితం చైనీయులు చేపల వేటకు ఉపయోగించిన మార్గాన్ని 'ఖరారు' చేసి ఆ ప్రాంతమంతా తనదేనని వాదించటం చైనాకే చెల్లింది. ఆ లెక్కన హాంకాంగ్ మొదలు బోర్నియో వరకూ గల దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని 35 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 90 శాతం చైనాదే అవుతుంది! తూర్పు చైనా సముద్ర ప్రాంతంలోని సెంకాకు దీవులు జపాన్ అధీనంలో ఉండగా హఠాత్తుగా ఆ ప్రాంతాన్ని దియోయూ అంటారనీ, అది తనదేననీ 1950లో పేచీకి దిగింది. చైనా ఇలా పేర్లు మార్చినప్పుడల్లా అది జారీచేసే పాస్‌పోర్టుల్లోనూ, అంతర్జాతీయ మీడియాకు విడుదల చేసే ప్రకటనల్లోనూ ఆ కొత్త పేర్లు వచ్చి కూచుంటాయి. దేశదేశాల్లో ఉండే చైనా పౌరులు వాటిని పదే పదే వల్లిస్తారు. ఈ తంతు అంతా పూర్తి చేశాక తన భూభాగాన్ని అవతలి పక్షం 'చట్టవిరుద్ధంగా' ఆక్రమించుకున్నదని అదును చూసుకుని గొడవ మొదలెడుతుంది. వివాదాలు ముదిరి అంతర్జాతీయ న్యాయస్థానం ముందు కెళ్లినప్పుడు ఆ ప్రాంతం తన పాలనా నిర్వహణలోనే ఉన్నదని చెప్పుకోవటం, దానికున్న పేరు తాను పెట్టిందేనని నిరూపించుకోవటం, సంబంధిత మ్యాప్‌లు చూపటం అవసరమవుతుంది. ఇలా చడీచప్పుడూ లేకుండా చిన్నగా వివాదం ప్రారంభించటం, ఆనక దాన్ని పెద్ద సమస్యగా మార్చటం చైనాకు అలవాటు. వియత్నాంతో ఉన్న వివాదం విషయంలో అది మరింత వింతగా ప్రవర్తించింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా వాదనకు అనుగుణమైన మ్యాప్ ముద్రించి ఉన్న టీ షర్టులతో 2018లో 14 మంది చైనా పర్యాటకులు వచ్చినప్పుడు వియత్నాం ప్రజలు ఆగ్రహంతో రగిలిపోయారు. ఆ టీ షర్టులు తీసేవరకూ బయటకు అడుగుపెట్టనీయబోమని విమానాశ్రయ అధికారులు చెప్పటంతో గత్యంతరంలేక వారు మార్చుకోవాల్సి వచ్చింది. చూడటానికి ఇది తుంటరి చేష్టగా కనబడుతుంది. పెద్ద పట్టించుకోవటం ఎందుకనిపిస్తుంది. కానీ ఇలాంటి చిన్న చిన్న చర్యలే మున్ముందు అక్కర కొస్తాయన్నది దాని ఆలోచన.

చైనాతో మనకు సరిహద్దు వివాదం ఉంది. దాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవటానికి మన దేశం మొదటినుంచీ అన్నివిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. అయినా దలైలామాను మన అధికార పక్ష నేతలు కలిసినప్పుడో, అరుణాచల్ ప్రదేశ్‌లో కేంద్రమంత్రులు పర్యటించినప్పుడో నిరసన స్వరం వినిపించటం చైనాకు అలవాటు. మరికొన్ని వారాల్లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) మంత్రుల స్థాయి సదస్సుకు చైనా రక్షణ మంత్రి మన దేశం రావాల్సివుంది. జూలైలో ఆ సంస్థ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వస్తారు. ఎస్‌సీఓకు ప్రస్తుతం మన దేశం సారథ్యం వహిస్తోంది. ఇలాంటి సమయంలో కొత్త తగువు రేకెత్తించాలన్నది చైనా ఎత్తుగడ కావొచ్చు. మన దేశం చెప్పినట్టు కొత్త పేర్లు పెట్టినంత మాత్రాన భౌగోళిక వాస్తవాలు మారిపోవు. వివాదాలు పరిష్కారమైపోవు. వివేకం తెచ్చుకుని హుందాగా వ్యవహరించటం నేర్చుకుంటే గౌరవం నిలబడుతుంది. చిల్లర తగాదాలతో కాలక్షేపం చేద్దామనుకుంటే అది చైనాకే చేటు తెస్తుంది.

ఇప్పుడెందుకు గుర్తొచ్చినట్టో!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

లలిత్ మోదీ, నీరవ్ మోదీ బీజేపీ భావజాల కథనాల్లో ఓబీసీలుగా ఎలా మారిపోయారు? ఈ జాతి వ్యతిరేక శక్తులు ఓబీసీలు అయినట్లయితే, మొత్తం ఓబీసీ సమాజం నిజంగా సిగ్గుపడాలి. ఓబీసీ రిజర్వేషన్‌ల కోసం జరిగిన పోరాటంలో ఏ కీలక సమయంలోనూ ఓబీసీ ఎజెండాను బీజేపీ బలపర్చలేదు. కానీ రాహుల్ గాంధీని ఎదుర్కోవడానికి దేశంలో మోదీ పేరు పెట్టుకున్నవారందరినీ బీజేపీ ఓబీసీలుగా మార్చేసింది. మోదీ ఇంటి పేరుగా కలిగిన వారందరూ ఓబీసీలేనని వీరు ఎలా సమర్థించుకుంటారు? మోదీ పేరు కలిగిన వారు చాలామంది దేశంలో పరిశ్రమలను పెట్టారు. కానీ వీరిలో ఏ ఒక్క మోదీ కూడా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌కు మద్దతివ్వలేదు.

రాహుల్ గాంధీ ఒక స్వయంప్రకటిత బ్రాహ్మణుడు. నరేంద్ర మోదీ ఒక ధ్రువీకృత ఓబీసీ. వీరి జీవిత చరిత్రల్లో ఈ వాస్తవం నిరాకరించలేనిది. కానీ లలిత్ మోదీ, నీరవ్ మోదీ న్యాయస్థానంలోనూ, బీజేపీ భావజాల కథనాల్లోనూ ఓబీసీలుగా ఎలా మారిపోయారు? కర్ణాటకలో లలిత్ మోదీ, నీరవ్ మోదీ, నరేంద్ర మోదీ అని మూడు పేర్లను రాహుల్ పేర్కొన్నారు. లలిత్ మోదీ, నీరవ్ మోదీ విదేశాల నుంచి హవాలా ద్వారా డబ్బును దొంగిలించి, చట్టవిరుద్ధంగా భారత్ నుంచి పరారై, లండన్‌లో నివసిస్తున్నారు. వీరిద్దరికీ భారీ అంతర్జాతీయ బిజినెస్ నెట్‌వర్కులు ఉన్నాయి. వీళ్లకు ఓబీసీ ధ్రువపత్రాలు కూడా ఉన్నాయా?

ఉద్దేశపూర్వక ప్రచారం

మార్చి 23 ఉదయం నుంచి టీవీ ఛానల్స్, సోషల్ మీడియా వేదికల్లో బీజేపీ నేతలు... ఓబీసీలను దూషించడం రాహుల్ గాంధీ అలవాటుగా మార్చుకున్నారంటూ భారీ ప్రచారం మొదలెట్టారు. కాంగ్రెస్ పార్టీ పెద్దగా ఓబీసీల పట్ల ప్రేమ కురిపించలేదని నాకు తెలుసు. జాతీయ స్థాయిలో మండల్ అనుకూల ఓబీసీ నేత ఎవరినీ కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయిలో ప్రోత్సహించలేదు. కానీ ఆ పార్టీని దెబ్బ గొట్టడానికి లలిత్ మోదీ, నీరవ్ మోదీ ఎలా ఓబీసీలు అయిపోయారు? మార్చి 24వ తేదీ ఉదయం ఒక టీవీ చర్చలో బీజేపీ ప్రభుత్వంలోని ఓబీసీ మంత్రి భూపేంద్ర యాదవ్ నోటి నుంచి లలిత్ మోదీ, నీరవ్ మోదీ ఓబీసీలు అయిపోవడం తొలిసారిగా విన్నాను. ఆ తర్వాతి నుంచి బీజేపీ వాదనలన్నింటిలోనూ అన్ని దశల్లోనూ ఇదే వినిపించింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్, ఇతర సీనియర్ మంత్రులు దీన్నే పునరావృతం చేశారు. లలిత్ మోదీ, నీరవ్ మోదీలు ఇద్దరూ ఓబీసీలే అయినట్లయితే, మొత్తం ఓబీసీ సమాజం నిజంగా సిగ్గుపడాలి.

నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యాక ఓబీసీ కార్డును బీజేపీ జాగ్రత్తగా ఉపయోగించడం ప్రారంభించిందని నాకు తెలుసు. ఎందుకంటే దేశంలో ఓబీసీలు మాత్రమే ఏకైక అతిపెద్ద ఓటు బ్యాంక్ శక్తిగా ఉంటున్నారు. ఇది మాత్రమే బీజేపీని అధికారంలో ఉంచగలదు.

మండల్ ఉద్యమం ప్రారంభించినప్పటి నుంచి ఆరెస్సెస్, బీజేపీ సాగించిన ఓబీసీ వ్యతిరేక ఉద్యమ చరిత్రను దేశంలో ఏ ఓబీసీ నేత కూడా ఎండగట్టలేదు. ఓబీసీ రిజర్వేషన్‌ల కోసం జరిగిన పోరాటంలో ఏ కీలక సమయంలోనూ ఓబీసీ ఎజెండాను బీజేపీ బలపర్చలేదు. కానీ రాహుల్ గాంధీని ఎదుర్కోవడానికి దేశంలో మోదీ పేరు పెట్టుకున్నవారందరినీ బీజేపీ ఓబీసీలుగా మార్చేసింది. మోదీ ఇంటి పేరుగా కలిగిన ప్రతి ఒక్కరూ 'మోధ్-ఘాంచీ-తేలీ' కులం నుంచే వచ్చారా? బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కుల జనగణనలో దీనికి



సాక్ష్యం ఎక్కడ ఉంది?

ఒక్క అఖిలేశ్ యాదవ్ మాత్రమే బీజేపీ ఓబీసీ మాయమాటల ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అధికార నివాసాన్ని తాను ఖాళీ చేశాక, గంగాజలంతో దాన్ని శుద్ధి చేయడం ద్వారా తన శూద్ర ఓబీసీ నేపథ్యాన్ని రాజ్‌పుత్ (క్షత్రియ) అయిన యోగి ఆదిత్యనాథ్ అవమానించారని అఖిలేశ్ పదే పదే చెబుతూ వచ్చారు. బీజేపీ కానీ, ప్రత్యేకించి ఓబీసీ ప్రధానమంత్రి కానీ తమ సొంత పార్టీ సీఎం పాటిస్తున్న ఇలాంటి అమానుషమైన కుల ఆచరణలను ఎన్నడూ వ్యతిరేకించిన పాపాన పోలేదు.

ఓటు బ్యాంకు కోసమే!

రాహుల్ లేదా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓబీసీలకు అవమానం జరిగిందనే కొత్త కథనాన్ని ప్రచారం చేయడం... 'రామచరిత మానస్'లో శూద్ర/ఓబీసీలకు వ్యతిరేకంగా భాష ఉందన్న నేపథ్యంలోని ఓటు బ్యాంక్‌ను ఉత్తరప్రదేశ్‌లో నిలబెట్టుకోవడానికేనా? ఈ నేపథ్యంలోనే ఆరెస్సెస్ సర్‌సంచాలక్ మోహన్ భాగవత్ కులాన్ని దేవుడు సృష్టించలేదని మాట్లాడారు. కుల సమస్యపై శాస్త్రాలను పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని కూడా చెప్పారు.

కులం అనేది ఉనికిలోనే లేదన్న చందంగా, కాంగ్రెస్ మేధా శక్తులు ఎన్నడూ కులం గురించి మాట్లాడలేదన్నది నిజం. లౌకికవాద శక్తులను వ్యతిరేకించడంలో భాగంగా ఆరెస్సెస్-బీజేపీ హిందూ మతం చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారు అధికారాన్ని కోల్పోకుండానే కుల సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. కానీ ఓబీసీ జాబితాలోకి లలిత్ మోదీ, నీరవ్ మోదీ వంటి జాతి వ్యతిరేక శక్తులను తేవడం ద్వారా ఓబీసీ జాతీయవాద కథనాన్ని ఎలా ఆచరణలోకి తెస్తారు?

మోదీ ఇంటిపేరుగా కలిగిన వారందరూ ఓబీసీలేనని వీరు ఎలా సమర్థించుకుంటారు? మోదీ పేరు కలిగిన వారు చాలామంది దేశంలో పరిశ్రమలను పెట్టారు. కానీ వీరిలో ఏ ఒక్క మోదీ కూడా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌కు మద్దతివ్వలేదు.

ప్రైవేట్ రంగంలో ఎంతో కొంత రిజర్వేషన్ ఉండాలని యూపీఏ ప్రభుత్వం కనీస ప్రతిపాదన చేసింది. వీరప్ప మొయిలీ నేతృత్వంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ గురించి వాటాదారులకు నచ్చజెప్పడానికి ఒక కమిటీని వేశారు. అలాంటి ప్రతిపాదనను అన్ని పెద్ద పరిశ్రమలూ వ్యతిరేకించాయి. ఓబీసీ ప్రధాని కేంద్రంలో గద్దెనెక్కిన తర్వాత అలాంటి రిజర్వేషన్ కోసం ఆరెస్సెస్, బీజేపీ ప్రతిపాదించిన పాపాన కూడా పోలేదు. పరిశ్రమలను కలిగి ఉన్న ఏ మోదీ కూడా ఓబీసీలకు మద్దతివ్వడం కానీ, ఉద్యోగాలను ప్రతిపాదించడం కానీ చేయలేదు.

వైఖరి వెల్లడించాలి!

ఈ దేశ పీడిత ప్రజారాశులను వంచించడానికి కుల ప్రతిపత్తిని తారుమారు చేయలేము. దేశంలోని ముఖ్యమైన ఓబీసీలు శూద్ర వ్యవసాయ, చేతివృత్తుల ప్రజారాశులకు సంబంధించినవారు. ఆధునిక పరిశ్రమకు ముందు, గానుగ ఆడించి నూనె తీసే వర్గం చేతివృత్తుల కులంగా ఉండేదనడంలో సందేహమే లేదు. అయితే దీన్ని మోదీ ఇంటిపేరుతో ముడిపెట్టలేము. దీని ఆధారంగా చట్టబద్ధమైన లేక సామాజిక వాదనను నిర్మించలేము. ఉదాహరణకు, అనేక కమ్యూనిటీల్లో చౌదరి ఇంటిపేర్లు ఉన్నాయి.

భారతదేశంలోనూ, అమెరికా, కెనడా వంటి ఇతర దేశాల్లోనూ కుల వ్యతిరేక చట్టాలను ఆరెస్సెస్, బీజేపీ వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్ అధికారిక పత్రిక 'పాంచజన్య'తోపాటు, ఆరెస్సెస్ కీలక నేతల్లో ఒకరైన రామ్ మాధవ్ అమెరికా, కెనడాల్లో తెచ్చిన కుల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ రాశారు. మన దేశంలో మాత్రం ఎన్నికలు, ఓట్ల ప్రయోజనం కోసం వీరు ఓబీసీ ఎజెండాను ఉపయోగించుకుంటున్నారు.

ఓబీసీ ట్యాగ్ ఉన్న నరేంద్ర మోదీని ప్రధాని కావడానికి అనుమతించడం అనే వాస్తవాన్ని మినహాయిస్తే, భారతదేశంలోని ఓబీసీల ప్రయోజనాల కోసం ఆరెస్సెస్, బీజేపీ ఎలాంటి నిర్దిష్ట చర్యలూ చేపట్టలేదు. ఓబీసీ అంశంపై ఆరెస్సెస్, బీజేపీ వైఖరి గురించి జాతీయ స్థాయి చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా ఓబీసీ అంశంపై ఎలాంటి సీరియస్ సానుకూల ఆచరణ, వైఖరిని కలిగిలేదన్నది వాస్తవం. అయితే ఆరెస్సెస్, బీజేపీ ఉపయోగించుకున్నట్లుగా ఓబీసీ కార్డును కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ఉపయోగించుకోలేదు. ఈ ధోరణి కనుక ఇలాగే కొనసాగినట్లయితే, ఓబీసీలు భారీగా నష్టపోతారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లేనే లేరా?



నా చిన్నతనమంతా నాకు అబద్ధాలే చెప్పారు. నేను నా పాఠశాల మీద కేసు వేయదలుచుకున్నాను. వాళ్లు నాకు అక్బర్ గొప్పవాడని చెప్పారు. ఇప్పుడే నాకు తెలిసింది, ఆయన కనీసం ఉనికిలోనే లేరని! (ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లోంచి మొఘలుల మీద పాఠం తొలగించడం మీద వ్యంగ్యం.)

– సైరా షా హలీమ్, బోధకురాలు

సానుకూలమే మేలు



ఇది నా వినయ పూర్వక (వ్యక్తిగత) అభిప్రాయం. 18 ఏళ్లలోపు భారతీయ పిల్లలకు క్రీ.పూ. 5000 నుంచి క్రీ.శ. 1000 వరకు గల భారతదేశ సంస్కృతి, చరిత్ర గురించి సానుకూల కథనాలు మాత్రమే బోధించాలి. వివాదాస్పద చరిత్రను కళాశాల పాఠ్యపుస్తకాలకూ, వ్యక్తిగత పఠనానికీ వదిలేయాలి.

– అరవింద్ విర్‌మానీ, నీతి ఆయోగ్ సభ్యుడు

వైవిధ్యం నాశనం



భారతదేశంలో వికసించిన రెండు లక్షల వరి రకాల ఘన వారసత్వాన్ని 'ఐఆర్‌ఆర్‌ఐ' ధ్వంసం చేసింది. అది మన వరి రకాలను దొంగిలించింది. 'సీఆర్‌ఆర్‌ఐ' డైరెక్టర్ డాక్టర్ రిచారియాను తప్పించింది. ఐఆర్‌ఆర్‌ఐ వరి రకాలు పంజాబ్ నేల, నీరు, జీవవైవిధ్యాన్ని నాశనం చేశాయి. ఇప్పుడు అది బిల్‌గేట్స్ ఎజెండా అయిన 'గోల్డెన్ రైస్'ను ఆచరణలో పెడుతోంది. (1960 ఏప్రిల్ 4న 'ది ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్' (ఐఆర్‌ఆర్‌ఐ) ఫిలిప్పైన్స్‌లో ప్రారంభమైంది.)

– వందనా శివ, యాక్టివిస్ట్

అప్పుడేనా?



ఈ ఏడాది నాకు నలభై ఏళ్లు వస్తున్నాయని నా పిల్లలకు ఇప్పుడే తెలిసింది. దానికి వాళ్లు ఎంతో కంగారుపడ్డారు. అదోలా ముఖం పెట్టి, "అది మరీ దగ్గరగా వెళ్లినట్టు కదా" అన్నారు. "దేనికి దగ్గరగా వెళ్లడం?" అని నేను అడిగాను. "వందకు" అని జవాబిచ్చారు వాళ్లు.

– దీక్షా బసు, రచయిత్రి

ఇన్‌బాక్స్

కరవు కోరల్లో 'ఆఫ్రికా కొమ్ము'

'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' దేశాలు తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయి. 'హార్న్' అంటే కొమ్ము అని అర్థం. ఇథియోపియా, సోమాలియా, కెన్యా దేశాలు ఉన్న ఆఫ్రికా ఖండ భూభాగాన్ని మ్యాపులో చూసినప్పుడు 'కొమ్ము' ఆకారంలో కనిపిస్తాయి. అందుకనే ఈ భూభాగాన్ని 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' అని పిలుస్తారు. ఇది ఆఫ్రికా ఈశాన్య భాగంలో ఉన్న ప్రాంతం. ప్రస్తుతం ఈ భూభాగంలో ఉన్న ప్రజలు మునుపెన్నడూ లేని కరవులో చిక్కుకున్నారు. ఈ మూడు దేశాలలో ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. తృణ ధాన్యాలను ఎక్కువగా ఆహారంలో భాగంగా తీసుకునే ఇక్కడి ప్రజలు ఇప్పుడు వాటి కొరతతో దీనావస్థకు చేరారు.

వాతావరణంలో వచ్చిన మార్పులు ఆ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశువులకు గ్రాసం దొరక్క మృత్యువాత పడుతున్నాయి. అలాగే మరో భయానకమైన విషయం ఏమంటే పసిపిల్లలకు పాలు దొరక్క ఏడవడానికి కూడా ఓపిక లేక మరణిస్తున్నారు. పాడి పశువుల మరణంతో ప్రజల జీవనోపాధి అడుగంటింది. పనులు లేక కుటుంబ పోషణ కోసం ప్రజలు వలస బాట పడుతున్నారు. పాఠశాలల్లో పిల్లలకు చదువు లేదు.

ఈ నేపథ్యంలో ఆయా దేశాలకు ఆపన్న హస్తం అందించాలని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం అక్కడి పాలకులు చేసిన ప్రధాన తప్పిదం. అంతంత మాత్రమే ఉన్న జలవనరులపై మూడు దేశాలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయి. తాగడానికి నీళ్ళు లేవంటే అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమాలియాలో పరిస్థితి కడు దుర్భరం. పిల్లలు, పెద్దలు బక్కచిక్కి అస్థిపంజరాల్లా తయారయ్యారు. తినడానికి ఏమీ లేని పిల్లలు చివరికి మన్ను తినే దృశ్యం హృదయాన్ని కదిలించివేస్తోంది.

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ 'ఫుడ్ అండ్ ఎగ్రికల్చర్ ఆర్గనైజేషన్' (ఎఫ్ఏఓ) ఈ మూడు దేశాల ప్రజలకు ఆహారం అందించాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ప్రాంత, జాతి భేదాలకు అతీతంగా ప్రపంచ దేశాలన్నీ స్పందించాల్సిన సమయమిది. అందుకే ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఈ మూడు దేశాలను ఆదుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. భారత్ వెంటనే స్పందించి తన ఉదారతను చాటుకుంది.

ఇవ్వాళ హార్న్ ఆఫ్ ఆఫ్రికా దేశాల దుఃస్థితికి అంతర్గత రాజకీయ సమస్యలే అసలైన ముద్దాయిలు. వేర్పాటు వాదులను అణచడం, అధికారాన్ని కాపాడుకోవడంపైనే పాలకులు దృష్టిపెట్టి ప్రజల బతుకులను గాలికి వదిలేశారు. పరిస్థితులు ఎప్పటికి మారతాయో మరి!

– కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు

సమతావాది... సంస్కరణవాది...

సందర్భం



డొక్కా మాణిక్య వరప్రసాద్

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారీ వ్యవస్థ రద్దు వంటి మౌలిక విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది బాబూ జగ్జీవన్ రామ్. సామాజిక, రాజకీయ ఉద్యమాలను ఏక కాలంలో నడిపిన యోధుడు. దళితుల అభ్యున్నతికై పని చేస్తూ వారిని సామాజికంగా బలవంతుల్ని కావించే సాంస్కృతిక ఉద్యమాలూ నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే కలకత్తాలో గురు రవిదాస్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాటుపడ్డారు.. మరోవైపు గాంధీ వంటి మహనీయుల ప్రోద్బలంతో స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ... తన జాతి జనులు సైతం ఉద్యమంలో పాల్గొనేట్టు ప్రేరేపించారు. దేశ చరిత్రలో 'బాపూజీ'గా ప్రజలు పిలుచుకున్న నాయకులు ఇద్దరే. అందులో ఒకరు మహాత్మా గాంధీ కాగా, మరొకరు బాబూ జగ్జీవన్‌రామ్.

ఆయన సామాజిక న్యాయ సాధకుడిగా యోధునిలా పనిచేశారు. తన 28వ ఏటనే బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి ఎంపికై అణగారిన వర్గాల సమాఖ్య తరపున వారి గొంతును వినిపించారు. ఈ క్రమంలోనే 1935లో 'హామండ్ కమిషన్' ముందు హాజరై మొదటిసారిగా అంటరాని వర్గాలకు ఓటుహక్కు కావాలని డిమాండ్ చేశారు.

విలక్షణ వ్యవహార దక్షత కలిగిన జగ్జీవన్‌రామ్ బిహార్‌లోని కుగ్రామం 'చాంద్వా'లో జన్మించారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లోనే 'అఖిలభారత రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారాయన. గాంధీ ద్వారా ప్రేరణపొంది ఆయన అనుయాయిగా అనేక స్వాతంత్ర్య, రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్రవహించి 1942 ఆగస్టులో అరెస్టయ్యారు. కుల, మత, భాష ప్రాతిపదికన విభజించి పాలించే బ్రిటిష్ వారి పరిపాలన ఎత్తుగడలను ఎండగట్టారు. గాంధీ నెలకొల్పిన 'అంటరానితనం వ్యతిరేక సమాఖ్య' ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆహ్వానితుడిగా సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. మరోవైపు అగ్రవర్ణ హిందువుల్లో మార్పు తీసుకురావడం ద్వారానే సమాజంలో సమానత్వం సిద్ధిస్తుందనీ, తద్వారా అన్ని సామాజిక వర్గాలూ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములవుతాయనీ, అదే స్వాతంత్ర్య సిద్ధికి బాటలు వేస్తుందనీ వక్కాణించారు. అణగారిన వర్గాల ప్రజలకు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే అవకాశం ఉండాలనీ... బడి, గుడి, బావులు అందరికీ అందుబాటులో ఉన్నప్పుడే



మానవులందరికీ సమాన హక్కులు లభ్యమవుతాయనీ పేర్కొన్నారు. ఇంతటి గొప్ప ఉపన్యాసం చేసిన జగ్జీవన్ ఉపన్యాస పటిమను మెచ్చుకున్న మదన్ మోహన్ మాలవీయ 'దళిత బంధువులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటే నేను వారి పాదధూళిని నా నుదుటిపై రాసుకుంటాన'ని అన్నారు.

దళిత వ్యవసాయ కూలీల పిల్లలకు ఉచితవిద్య అందించడం... హాస్టల్ సౌకర్యం, స్కాలర్ షిప్స్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారానే సాధ్య మవుతుందని చెప్పారు. 'ఖేతిహార్ మజ్దూర్ సంఘం' ద్వారా భూమిలేని కార్మికులకు, వ్యవసాయ కూలీలకు తగు వేతనాలు చెల్లింపునకై ఉద్యమించారు.

రాజ్యాంగ రూపకల్పనలో పలు కమిటీల్లో కీలక భూమిక నిర్వహించారు. ముఖ్యంగా మైనారిటీ హక్కుల సబ్‌కమిటీలోనూ, సలహా కమిటీలోనూ కీలక పాత్ర పోషించారు. తన సోదరుడు, అసమాన ప్రతిభావంతుడు అయిన డా॥ బీఆర్ అంబేడ్కర్‌ను రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు తన వంతుగా నెహ్రూ, గాంధీ, పటేల్ వంటి మహా మహులను ఒప్పించిన రాజకీయ నేర్పరి బాబూ జగ్జీవన్‌రామ్.

బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి ఎంపికయింది మొదలు దాదాపు ఐదు దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా కొనసాగారు. దేశ మొట్టమొదటి దళిత ఉప ప్రధానిగా, మంత్రిగా భారతదేశాభివృద్ధికి పలు విధాల తోడ్పాటు అందించారు. వ్యవసాయ శాఖమంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవానికి నాందిపలికి ఆహారోత్పత్తిని పెంపొందించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టి నిరుపేదల ఆకలి తీర్చేందుకు శ్రీకారం చుట్టారు. స్వామినాథన్ వంటి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తను వెలుగులోకి తెచ్చిన దార్శనికుడు.

కేంద్ర కార్మికశాఖ మంత్రిగా కనీస వేతనాలు చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సవరణ) చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం వంటి వివిధ కార్మిక చట్టాలను తెచ్చారు. రైల్వేశాఖ మంత్రిగా రైల్వేలను ఆధునికీకరించి రైల్వే ఛార్జీల భారం పేదవాళ్ళపై పడకుండా సంస్కరణలు చేపట్టారు. దేశ రక్షణశాఖ మంత్రిగా... పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో సియాచిన్ పర్వత శ్రేణుల్లో సైనికులతో కలిసి తిరిగారు. యుద్ధం గెలిచి బంగ్లాదేశ్ ఆవిర్భావానికి బాటలు వేశారు. అజాతశత్రువుగా భారత రాజకీయ, సామాజిక రంగాల్లో వెలుగొందిన జగ్జీవన్‌రామ్ తన 78వ ఏట కన్నుమూశారు. ఇంతటి మహానుభావుణ్ణి 'భారతరత్న'తో గౌరవించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వ్యాసకర్త ఏపీ ప్రభుత్వ విప్, మాజీ మంత్రి
(నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి)

కృతజ్ఞత

జ్యోతిర్మయం

కురుక్షేత్ర యుద్ధం ముగిశాక శరతల్పం మీద పడుకొని ఉన్న భీష్ముడు, ధర్మరాజు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అతణ్ణి శాంతపరుస్తాడు. ఆ సందర్భంలోనే ధర్మరాజు అడుగుతాడు, ఆశ్రయం ఇచ్చినవాని యెడల, ఆశ్రయం పొందినవాడు ఎలా నడుచుకోవాలి అని! సమాధానంగా భీష్ముడు ఒక కథ చెప్తాడు. అది మహాభారతం అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసంలో ఉన్నది.

పూర్వం కాశీ రాజ్యంలో ఒక వేటగాడు ఉండేవాడు. ఒకనాడు అడవికి వేటకు వెళ్ళి, విషం పులిమిన బాణాన్ని లేడి మీదకు సంధించి వదిలాడు. అది గురి తప్పి, పూవులు కాయలతో పెరిగిన పెద్ద చెట్టును తాకింది. విషపు బాణం దెబ్బకు ఆ చెట్టు ఎండి మోడైపోయింది. ఆ చెట్టు తొర్రలో ఒక చిలుక ఎప్పటి నుండో నివాసం ఉంటోంది. అది ఆ చెట్టును విడిచిపెట్టి పోకుండా, ఆ చెట్టు తొర్రలోనే కృతజ్ఞతతో ఉండి పోయింది.

చిలుక ఉదాత్త వైఖరిని ఇంద్రుడు తెలుసుకొన్నాడు. మనిషిగా రూపం మార్చుకొని, ''ఈ అడవిలో గొప్ప గొప్ప వృక్షాలు, పూలు, ఫలాలతో అనేకం ఉన్నాయి. వాటిని ఆశ్రయించక, మోడువారిన ఈ చెట్టునే ఆశ్రయించుకొని ఎందుకు ఉన్నావు?'' అని అడిగాడు. అందుకా చిలుక ''పండ్లు కాస్తున్నప్పుడు చెట్టును ఆశ్రయించుకొని ఉండి, ఎండిపోయినప్పుడు వదిలిపోవటం కృతఘ్నత అనిపించుకోదా ఇంద్రా?' అన్నది. పూర్వ జన్మలో ఈ చిలుక చేసుకొన్న పుణ్యంవల్ల గదా, మారు వేషంలో ఉన్న తనను గుర్తించగలిగింది అని ఇంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. చిలుకతో ఏదైనా వరం కోరుకో అంటాడు. తనకు ఆశ్రయం ఇచ్చిన వృక్షానికి పూర్వపు శోభను తిరిగి కలిగించమని వేడుకొంది. సరే అని ఇంద్రుడు చెట్టు వేళ్ళను అమృతంతో తడిపి పూలు, పండ్లతో పూర్వం కంటే ఎక్కువ శోభను కలిగించాడు. తను చేసిన మంచి పనికి, ఆ చిలుక కూడా చనిపోయాక స్వర్గం చేరుకొంది.

చిలుకకు చెట్టు మీద ఉండే భక్తి, దయ, కృతజ్ఞతాభావం మెచ్చుకోదగ్గవి. పూర్వం ఆ చెట్టు బాగున్నప్పుడు దానిని ఆశ్రయించుకొని జీవించిన సంగతి చిలుక మర్చిపోలేదు. చాలామంది మనుషులు ఇతరులు చేసిన మేలు మరచిపోయి ప్రవర్తిస్తుంటారు. ఈ కథలో చిలుక చేసిన పని అలాంటి వారికి కనువిప్పు కలిగించేదిగా ఉంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.9.03 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.11.16 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.8.09 నుండి 9.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.37 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ గంగారావుకు ప్రసాదాలను అందజేస్తున్న ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు మంగళవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా దర్శనానికి విచ్చేసిన జస్టిస్ గంగారావుకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

7న ఆది దంపతుల కృష్ణా నది విహారం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి,అమ్మవార్లు ఈ నెల 7న పవిత్ర కృష్ణా నదిలో విహరించనున్నారు. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతులకు నదీ విహారం నిర్వహించాలని ఆలయ వైదిక కమిటీ నిర్ణయించింది. శ్రీ గంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గాఘాట్‌కు తీసుకువెళ్లి నదీ విహారం నిర్వహించనున్నారు. నదీ విహారానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో భ్రమరాంబ అధికారులను ఆదేశించారు. పడవపై ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఉంచి నదీ విహారానికి ఏర్పాట్లు చేసేలా పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ వైదిక కమిటీ సభ్యులు నదీ విహారం ఏర్పాట్లపై సమీక్షించారు.

కాణిపాకంలో నేటి నుంచి తిరుమంజన సేవ



కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

యాదమరి (చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల కోరిక మేరకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు మరిన్ని సేవలు ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి బుధవారం తిరుమంజనం సేవను మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతర దర్శనం ఉన్నట్లు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. అభిషేక సమయాల్లో లఘు దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకోవచ్చని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి చెప్పారు.

సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం డిగ్రీ కోర్సు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ తెలిపారు. ఈ నెల 7 నుంచి మే 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష మే చివరి వారంలో నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు, ఇతర వివరాలకు www.sjgckurnool.edu.in ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం

- రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆ శాఖ సంచాలకుడు రవిప్రకాశ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయో వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ఆ శాఖ సంచాలకుడు వి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర అధ్యక్షతన గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో మంగళవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రవిప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను, విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో సుమారు 5,200 మంది విద్యార్థులకు మాస్టర్ ట్రైనర్స్‌తో అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం–2016, తల్లి దండ్రుల పోషణ, సంరక్షణ చట్టం–2007, ట్రాన్స్‌జెండర్స్ చట్టం అమలులో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కుమారరాజా మాట్లాడుతూ దివ్యాంగులకు 2022–23వ సంవత్సరానికి 1,750 మూడు చక్రాల మోటార్ వాహనాల పంపిణీ చేపట్టామన్నారు. 315 మందికి రూ.9కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు.

గరుడ వాహనంపై కోదండ రాముడు

ఒంటిమిట్టలో నేడు శివధనుర్భంగాలంకారం



గరుడ వాహనంపై విహరిస్తున్న రఘురాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు మంగళవారం కోదండరాముడు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ మోహినీ రూపంలో గ్రామోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీరామచంద్రుడిని చూసి భక్తులు జయజయధ్వానాలు చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేడు పున్నమి వెన్నెలలో సీతారాముల కళ్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామచంద్రుడు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శివ ధనుర్భంగాలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పున్నమి వెన్నెలలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

కోటి తలంబ్రాల సమర్పణ

సీతారాముల కల్యాణానికి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్యసంఘం అధ్యక్షుడు శ్రీకల్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను మంగళవారం సమర్పించారు. 180 కిలోల తలంబ్రాలను ఆలయం వద్ద డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, అర్చకుడు శ్రావణ్‌కుమార్ సమక్షంలో అందించారు. ఆరునెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి నాలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో మూడునెలల పాటు ధాన్యాన్ని గోటితో ఒలిచి ఈ తలంబ్రాలు సిద్ధం చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా భద్రాద్రి రాముడికి, ఆరేళ్లుగా ఒంటిమిట్ట రాముడికి కల్యాణోత్సవం సందర్భంగా తలంబ్రాలు అందజేస్తున్నామని అప్పారావు తెలిపారు.

ఒంటిమిట్టకు ఇలా చేరుకోవచ్చు...

- ఒంటిమిట్ట క్షేత్రం కడప–తిరుపతి రహదారిపై ఉంది. కడప నుంచి 26 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఆలయానికి చేరుకోవచ్చు.
- రైలులో రాజంపేట రైల్వేస్టేషన్‌లో దిగి బస్సులో ఒంటిమిట్టకు చేరుకునే సౌలభ్యముంది.
- కడప రైల్వేస్టేషన్‌లో రైలు దిగి బస్సు, ఇతర వాహనాల్లో ఒంటిమిట్టకు చేరుకోవచ్చు.
- తిరుపతి విమానాశ్రయం నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒంటిమిట్టకు రైలు, బస్సు, ఇతర వాహనాల్లో చేరుకోవచ్చు.



ఒంటిమిట్ట రామయ్యకు తీసుకొస్తున్న కోటి గోటి తలంబ్రాలు

విచారణపై స్టే ఇవ్వలేం

మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి విషయంలో ఏపీ సీఐడీ విచారణపై స్టే ఇవ్వలేమని, దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. అయితే, తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు 30 మంది మేనేజర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరిస్తూ తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నిధులను చట్టవిరుద్ధంగా అక్రమ మార్గాలకు మళ్లిస్తున్నారని పేర్కొంటూ ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కేసుల్లో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ మార్గదర్శి చైర్మన్ రామోజీరావు (ఏ1), ఎండీ శైలజ (ఏ2) ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు.. దర్యాప్తులో భాగంగా విచారణకు రావాలని 30 మంది మార్గదర్శి మేనేజర్లకు సీఐడీ తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రామోజీరావు, శైలజ మంగళవారం ఇంటర్లోక్యుటరీ అప్లికేషన్‌ను లంచ్ మోషన్‌గా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులకు జారీచేసిన నోటీసులను కొట్టేయాలన్నారు. మార్గదర్శి కేసు దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీచేసి.. స్వతంత్ర ఏజెన్సీకి అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు..

ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ‘గత విచారణ సందర్భంగా హైకోర్టు కేవలం రామోజీరావు, శైలజకు మాత్రమే ఉపశమనం కలిగించింది. ఇతరులకు ఇది వర్తించదు. దర్యాప్తు ప్రారంభమైన నాటి నుంచి పిటిషనర్లు పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు. ఏపీ ప్రభుత్వానికి సమయం ఇవ్వకుండానే పిటిషనర్లకు అనుకూలంగా ఆదేశాలు జారీ అవుతున్నాయి. ఈ కేసులో ఏపీ అడ్వొకేట్ జనరల్ హాజరై వాదనలు వి నిపిస్తారు. ఏపీ ప్రభుత్వ వాదన విన్న తర్వాతే మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి. అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఏపీ సీఐడీ నుంచి నోటీసులు అందుకున్న ఉద్యోగులు ఎవరో, ఎప్పుడు నోటీసులు అందుకున్నారో.. లాంటి వివరాలు ఏమీలేకుండానే పిటిషన్ వేశారు. వివరాలు తెలీకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. మార్గదర్శి నిధులను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్స్‌లోకి మళ్లించడం ద్వారా భారీ కుంభకోణానికి పాల్పడింది. కౌంటర్ దాఖలు చేసే వరకైనా మాకు సమయం ఇవ్వాలి’.. అని గోవింద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తును అడ్డుకోవడం లేదుకదా..

‘మీకు (ఏపీ సర్కార్) అభ్యంతరం ఉంటే రేపే వెకేట్ స్టే పిటిషన్ వేయండి. హౌస్‌మోషన్ మూవ్ చేయండి.. మా ఆదేశాల సవరణకు పిటిషన్ వేయండి.. విచారణ చేపట్టడానికి మాకెలాంటి అభ్యంతరంలేదు. మేం దర్యాప్తును అడ్డుకోవడంలేదు కదా. మా ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేయడం సరికాదు’.. అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు.

మరణంలోను.. వీడని బంధం

- గోదావరిలో గల్లంతై భార్య మృతి
- ఆ వార్త విని భర్త హఠాన్మరణం



తోట సత్యనారాయణ (బూరయ్య), జయలక్ష్మి దంపతులు (ఫైల్)

కొవ్వూరు: సుమారు 50 ఏళ్ల పాటు అన్యోన్యంగా జీవితం గడిపిన దంపతులు మృత్యువు వెంట కూడా కలిసే నడిచారు. ఒకరి మరణవార్తతో మరొకరు ప్రాణాలొదిలారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోనెమతడలవారివీధిలో ఈ హృదయ విదారక ఘటన జరిగింది. ఈ వీధికి చెందిన తోట జయలక్ష్మి (68) మంగళవారం తెల్లవారుజామున గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. నదిలో గల్లంతైన జయలక్ష్మి కొద్దిసేపటి తరువాత పిండ ప్రదానాల రేవులో విగతజీవిగా కనిపించారు. ఆమె మరణవార్త విన్న భర్త సత్యనారాయణ (74) ప్రాణాలొదిలేశారు. బూరయ్య అని పిలిచే సత్యనారాయణ క్యాన్సర్ వ్యాధితో నాలుగునెలలుగా మంచంలో ఉంటున్నారు. బూరయ్యను భార్య జయలక్ష్మి అన్నీ తానై కంటికిరెప్పలా చూసుకున్నారు. ఈ నేపథ్యంలో భార్య మరణవార్త విన్న ఆయన విలవిల్లాడిపోయారు. సహధర్మచారిణి లేని జీవితం ఇంకెందుకనుకున్నారేమో కొద్దిసేపటికే.. నీవెంటే నేనంటూ ప్రాణాలు వదిలేశారు. ఈ వృద్ధ దంపతుల మృతదేహాలను ఒకేసారి అంత్యక్రియలకు తరలించడాన్ని చూసి స్థానికుల హృదయాలు తల్లడిల్లాయి. మూడేళ్ల కిందట వీరి పెద్దబ్బాయి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దకోడలు లక్ష్మీప్రసన్న ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇప్పుడు వీరి మృతి ఆ కుటుంబంలో తీరని విషాదం మిగిల్చింది. చిన్న కుమారుడు గన్నిరాజు, కుమార్తె గీత కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరి పెద్దకోడలు లక్ష్మీప్రసన్న వైఎస్సార్‌సీపీ తరఫున 11వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు.

తెలంగాణ తీరుతోనే శ్రీశైలం, సాగర్ నిర్వహణ అస్తవ్యస్తం

- కృష్ణాబోర్డుకు ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి లేఖ

సాక్షి, అమరావతి: తెలంగాణ సర్కార్ తీరుతోనే ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని కృష్ణాబోర్డుకు ఏపీ సర్కార్ మరోసారి ఫిర్యాదు చేసింది. కోటా కంటే 102.87 టీఎంసీలను వాడుకున్న తెలంగాణ సర్కార్‌ను.. ఇకపై వాడుకోకుండా కట్టడి చేయాలని కోరింది. మైలవరం, తిరువూరు, నూజివీడు ప్రాంతాల్లో పంటలను రక్షించుకోవడానికి, తాగునీటి అవసరాల కోసం సాగర్ ఎడమ కాలువ ద్వారా ఏపీ సరిహద్దుకు 1,500 క్యూసెక్కులు సరఫరా చేసేలా తెలంగాణను ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి డి.ఎం.రాయ్‌పురేకి ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రస్తుత నీటిసంవత్సరంలో బోర్డు నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా కేవలం విద్యుదుత్పత్తి కోసమే శ్రీశైలం నుంచి 70.58, సాగర్ నుంచి 126.98 టీఎంసీలను తెలంగాణ తోడేసిందని.. ఆ జలాలన్నీ కడలి పాలయ్యాయని గుర్తుచేశారు. దీనివల్ల దిగువ రాష్ట్రమైన ఏపీ రైతుల హక్కులకు విఘాతం కలిగిందని పేర్కొన్నారు. తమ కోటాలో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లలో ఇప్పటికీ 115.27 టీఎంసీలున్నాయని తెలిపారు. వాటి నుంచి సాగు, తాగునీటి అవసరాలకు వాడుకుంటామని స్పష్టం చేశారు.

కుక్కల దాడిలో రైతు మృతి

సంబేపల్లి: కుక్కల దాడిలో ఓ రైతు మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా జరిగింది. పోలీసుల కథనం మేరకు..సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముదినేని వడ్డిపల్లెకు చెందిన మదనపల్లె రెడ్డయ్య (60) అనే రైతు వ్యవసాయం చేసుకుంటున్నాడు. గ్రామ సమీపంలోని తమ పొలంలో సాగు చేసిన వరిపంటకు అడవి పందుల బెడద ఉందని సోమవారం రాత్రి పంటకు కాపలాకు వెళ్లాడు. పొలం సమీపంలోని కంసల బండపై మంగళవారం ఉదయం రెడ్డయ్యపై కుక్కల మంద దాడి చేయడాన్ని చూసి గ్రామస్తులు కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే రెడ్డయ్య మృతి చెందాడు. మృతుని భార్య గతంలో చనిపోయింది. కొడుకు, కోడలు దగ్గరే రెడ్డయ్య ఉంటున్నాడు. పోలీసులు రెడ్డయ్య మృతదేహాన్ని పంచనామా కోసం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ లింగప్ప ఎస్‌ఐ షరీఫ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటుందని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

ఇద్దరు మహిళలపై కత్తితో యువకుడి దాడి

- ఒకరు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు
- అమలాపురంలో ఘటన



చికిత్స పొందుతున్న వెంకటరమణ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న సీఐ దుర్గాశేఖరరెడ్డి



పోలీసుల అదుపులో హరికృష్ణ



హత్యకు గురైన శ్రీదేవి

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏఎంజీ కాలనీలో మంగళవారం ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలపై ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. ఒక మహిళ ఘటనాస్థలంలోనే మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడి బ్యాగ్‌లో ఉన్న ఆధార్, పాన్, ఏటీఎం కార్డుల ఆధారంగా అతడ్ని నెల్లూరుకు చెందిన కోట హరికృష్ణ (30)గా పోలీసులు గుర్తించారు. స్థానిక ఏఎంజీ కాలనీలోని కమ్మిండి వెంకటరమణ అనే మహిళ ఇంటి డాబాపైకి హరికృష్ణ ఎక్కి అక్కడ పని చేస్తున్న మన్నెం శ్రీదేవి పీకను కత్తితో కోశాడు. శ్రీదేవి కేకలు వేయడంతో యజమానురాలు వెంకటరమణ వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించగా, ఆమె వీపుపైనా కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరి కేకలు విని ఇరుగుపొరుగువారు వచ్చి హరికృష్ణను పట్టుకున్నారు. అతడ్ని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీదేవి, వెంకటరమణను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీదేవి మరణించినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణకు వైద్యులు చికిత్స చేస్తున్నారు. సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి బాధిత మహిళ వెంకటరమణ వాంగ్మూలం నమోదు చేశారు. డీఎస్పీ వై.మాధవరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి కాలనీవాసుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడు హరికృష్ణ మద్యం మత్తులో సైకోగా మారిపోయి అఘాయిత్యానికి పాల్పడ్డాడని, అతను మాట్లాడే స్థితిలో కూడా లేడని స్థానికులు తెలిపారు. అతడ్ని డీఎస్పీ కూడా విచారించారు. మృతురాలు శ్రీదేవి భర్త మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉన్న శ్రీదేవి మృతదేహాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. చికిత్స పొందుతున్న వెంకటరమణను పరామర్శించారు.

23న సింహాచలంలో చందనోత్సవం

- 1.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్

మహారాణిపేట(విశాఖదక్షిణ): సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవానికి (నిజరూప దర్శనం) భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న చందనోత్సవంపై జరిపిన సమీక్ష సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది చందనోత్సవానికి 1.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, వీరి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పలు దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ చందనోత్సవం నాడు ఎలాంటి ఉచిత పాసులు లేవన్నారు. ప్రతి ఒక్కరూ టికెట్ కొనుగోలు చేసి స్వామి వారిని దర్శించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంటు కమిషనర్ హరిజవహర్‌లాల్, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఆలయ ఈవో వి.త్రినాథ్ పాల్గొన్నారు.

కరెన్సీనోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

- స్పీకర్ ఓం బిర్లాకు వైఎస్సార్‌సీపీ ఎంపీ కృష్ణయ్య వినతి


సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీనోట్లపై డాక్టర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. కరెన్సీనోట్లపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్‌తో కలిసి ఆయన మంగళవారం లోక్‌సభ స్పీకర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా కృషిచేయాలని వారిద్దరూ కోరారు.

రాజకీయాల్లో ఉంటే సీఎం జగన్‌తోనే ఉంటా

- లేదంటే నా పొలంలో ఉంటా
- పంటి శస్త్ర చికిత్స, ఇంట్లో శుభకార్యం వల్లే సీఎం సమావేశానికి హాజరుకాలేదు
- చంద్రబాబు సమావేశాలకి టీడీపీ ఎమ్మెల్యేలంతా హాజరయ్యారా?
- తప్పుడు ప్రచారం చేసి బాబును కాపాడటమే ఎల్లో మీడియా లక్ష్యం
- మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- అవినీతి నా జీవితంలో లేదు
- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: రాజకీయాల్లో ఉన్నంత కాలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని, లేదంటే తన పొలంలో ఉంటానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. తాను గతంలోనే అసెంబ్లీ సాక్షిగా ఈ విషయాన్ని చెప్పానన్నారు. ఆయన మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదని ఎల్లో మీడియా అత్యుత్సాహం ప్రదర్శించిందని, తనకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య అగాధం అంటూ అసత్య వార్తలు రాయడం సిగ్గు చేటని అన్నారు. ఎలాంటి ఆధారాలు, తన వివరణ లేకుండా వార్తలు ప్రచురించడం దుర్మార్గమన్నారు. తనకు పంటి శస్త్ర చికిత్సతో పాటు ఇంట్లో శుభకార్యం కారణంగా ఆ సమావేశానికి హాజరు కాలేకపోయానని తెలిపారు. చంద్రబాబుకు రాజకీయంగా ప్రాణం పోసేందుకు ఎల్లో మీడియా ఇలాంటి కుట్రలు ఎన్ని చేసినా ప్రయోజనం లేదన్నారు. చంద్రబాబు పెట్టిన సమావేశాలన్నింటికీ టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు అంతా హాజరయ్యారా అని నిలదీశారు. ఎల్లో మీడియాకు ఆ విషయాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. అర్హత లేకపోయినా కేవలం అధికారం ఉందనే అహంకారంతో మూడు శాఖల మంత్రిగా ఉండి, మంగళగిరి వైపు కన్నెత్తి కూడా చూడని లోకేశ్‌కు గత ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి బుద్ధి చెప్పారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మంగళగిరిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తన జీవితంలో అవినీతి అనే పదానికి చోటు లేదని, కొన్ని మీడియా సంస్థలు తనపై అవినీతి అంటూ వార్తలు రాయడం సిగ్గుచేటని అన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

స్వర్ణ రథంపై శ్రీనివాసుడు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి

తిరుమల: శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య అత్యంత వైభవంగా సాగిన స్వర్ణ రథోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొని గోవింద నామాలు జపిస్తూ రథాన్ని లాగారు. అనంతరం స్వామివారిని వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. అక్కడ అర్చకులు వసంతోత్సవ అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు మారుతి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్టుమెంట్లు నిండి ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,086 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.17 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, టికెట్లు లేని వారికి 24 గంటల్లో ఎస్‌ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- 11 మందికి గాయాలు
- ఏలూరు జిల్లా కొవ్వలి వద్ద ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేటు బస్సు



ప్రమాదంలో చేయి కోల్పోయిన అల్లూరి ధనుష్




మణికట్టు నుంచి వేరుపడిన చేయి

దెందులూరు: ఆటోను అధిగమించబోయి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 11 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు.. ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయనగరానికి బయలుదేరింది. మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలి వంతెన వద్దకు వచ్చేసరికి ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టి బస్సు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులుండగా.. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరానికి చెందిన అల్లూరి ధనుష్ కుడి చెయ్యి మణికట్టు తెగిపడిపోయింది. పార్వతీపురానికి చెందిన జమ్మల లక్ష్మి, అన్నవరానికి చెందిన గంటి శ్యామల, రాజాంకు చెందిన కెల్లా వాసు, కెల్లా వాసవి, కెల్లా లోకేశ్, అనకాపల్లికి చెందిన కులుకులూరు సంతోశ్, విజయనగరానికి చెందిన మీసాల ఆదినారాయణ, కోసూరి పైడిరాజు, కొత్తపేటకు చెందిన దాసరి హనుమంతు, ఆదిలాబాద్‌కు చెందిన క్లీనర్ రాథోడ్ వినోద్ గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న దెందులూరు ఎస్‌ఐ వీర్రాజు సిబ్బందితో కలిసి వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ధనుష్‌కు విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. బస్సును పొలుపూరి సంతోష్ హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు డ్రైవింగ్ చేశాడని.. నానేపల్లి ఫణిభూషణరావు విజయవాడ నుంచి నడుపుతుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ప్రమాద బాధితులను ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిశోర్, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య పరామర్శించారు.

క్లుప్తంగా...

ట్విట్టర్ వెబ్ వెర్షన్ లోగో మారింది

పక్షి స్థానంలో వేట కుక్క



వాషింగ్టన్: మైక్రో–బ్లాగింగ్ సైట్ ట్విట్టర్ అనగానే వెంటనే గుర్తొచ్చేది నీలిరంగు బుల్లి పిట్ట. ఇప్పుడు ఆ పిట్ట స్థానంలోకి వేట కుక్క వచ్చి చేరింది. ఈ మేరకు ట్విట్టర్ లోగోను సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) ఎలాన్ మస్క్ మార్చేశారు. వెబ్ వెర్షన్‌లో సోమవారం నుంచి ఈ మార్పు కనిపిస్తోంది. వెబ్ వెర్షన్‌లో బ్లూబర్డ్ లోగో హోం బటన్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. డాగికాయిన్ క్రిప్టోకరెన్సీ, డాగికాయిన్ బ్లాక్‌చైన్ లోగోగా ఉన్న శునకం బొమ్మను ట్విట్టర్ లోగోగా మార్చారు. ఎలాన్ మస్క్ పెంపుడు శునకమైన శిబా ఇనూను పోలి ఉంది. అయితే, ట్విట్టర్ మొబైల్ యాప్ లోగోలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

ఆస్ట్రేలియా ప్రభుత్వ పరికరాల్లో టిక్‌టాక్‌పై నిషేధం

కాన్‌బెర్రా: చైనాకు చెందిన వీడియో షేరింగ్ యాప్ టిక్‌టాక్‌పై నిషేధం విధించిన దేశాల జాబితాలో తాజాగా ఆస్ట్రేలియా కూడా చేరింది. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పరికరాల్లో టిక్‌టాక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు అటార్నీ జనరల్ మార్క్ డ్రేఫస్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిఘా, భద్రతా సంస్థల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అతిత్వరలో నిషేధం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందన్నారు. టిక్‌టాక్‌పై అమెరికా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలు ఇప్పటికే నిషేధం విధించాయి. అయితే, ఆస్ట్రేలియా ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల టిక్‌టాక్ యాజమాన్యం అసంతృప్తి వ్యక్తం చేసింది. నిజానిజాలతో సంబంధం లేకుండా కేవలం రాజకీయపరమైన కారణాలతో యాప్‌పై నిషేధం విధించారని ఆస్ట్రేలియాలోని టిక్‌టాక్ జనరల్ మేనేజ్ లీ హంటర్ ఆక్షేపించారు.

అత్యల్పానికి పాక్ రూపాయి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆర్థిక పతనం కొనసాగుతూనే ఉంది. దేశ కరెన్సీ రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే ఏకంగా 287.29కి దిగజారింది. ఒక్క రోజులోనే ఏకంగా 2.25 రూపాయల మేరకు పతనమైంది. విదేశీమారక నిల్వలు కూడా కేవలం 424 కోట్ల డాలర్లకు పడిపోయాయి.



మంగళవారం మధ్యాహ్నం న్యూయార్క్‌లో కోర్టుకు బయల్దేరే ముందు ట్రంప్ అభివాదం



కోర్టులో జడ్జి ఎదుట తన న్యాయవాదుల బృందంతో కలిసి హాజరైన ట్రంప్

నేనే నేరమూ చేయలేదు

హష్ మనీ కేసులో ట్రంప్ వాదన • మన్‌హాటన్ కోర్టులో విచారణకు హాజరు

సాంకేతికంగా పోలీసుల అదుపులోకి

- తర్వాత 34 అభియోగాలు విన్పించిన జడ్జి
- మోహరించిన మీడియా, భారీ భద్రత
- అమెరికాలో న్యాయం అడుగంటింది: ట్రంప్
- థర్డ్ వరల్డ్ కంట్రీగా మారిందంటూ ధ్వజం

న్యూయార్క్/వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో తనపై నమోదైన క్రిమినల్ నేరాభియోగాలను అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76) అంగీకరించలేదు. తాను ఏ నేరమూ చేయలేదంటూ కోర్టు ముందు వాంగ్మూలమిచ్చారు. ప్రపంచమంతటి దృష్టినీ ఆకర్షించిన ఈ సంచలనాత్మక కేసులో మంగళవారం ఆయన మన్‌హాటన్ క్రిమినల్ కోర్టు ముందు విచారణకు హాజరయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30కు కోర్టు వద్దకు చేరుకున్నారు. తన లాయర్లతో కలిసి కోర్టు ప్రాంగణంలోకి అడుగు పెట్టారు. ఆ క్షణమే ఆయన సాంకేతికంగా అరెస్టయినట్టు చెబుతున్నారు. 'మిస్టర్ ట్రంప్! యూ ఆర్ అండర్ అరెస్ట్' అని చెప్పి పోలీసులు ఆయన్ను లోనికి తీసుకెళ్లినట్టు సమాచారం. అనంతరం విచారణకు ముందు రికార్డుల నిమిత్తం ట్రంప్ వేలిముద్రలు, ఫొటో తీసుకున్నట్టు చెబుతున్నారు. మధ్యాహ్నం 2.30కు 15వ అంతస్తులో ఉన్న కోర్టు గదిలోకి ట్రంప్ ప్రవేశించారు. మామూలుగా నిందితుల మాదిరిగా బేడీలు వేయకుండానే ఆయన్ను జడ్జి ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీక్రెట్ సర్వీస్ బాడీగార్డులు ట్రంప్ వెన్నంటే ఉన్నారు. అనంతరం ట్రంప్‌పై దాఖలైన 34 అభియోగాలను జడ్జి జువాన్ మాన్యుయల్ మర్చన్ చదివి విన్పించారు. వాటిలో దేనితోనూ తనకు సంబంధం లేదని ట్రంప్ వాంగ్మూలమిచ్చారు. ప్రతి అభియోగాన్నీ చట్టపరంగా ఎదుర్కొంటారని ఆయన లాయర్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3.30 సమయంలో కోర్టు నుంచి వెనుదిరిగారు. ఆ తర్వాత ఫ్లోరిడా పయనమయ్యారు.

శృంగార చిత్రాల నటి స్టార్మీ డేనియల్స్ (44)తో అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు ఆమెకు డబ్బుల చెల్లింపు వ్యవహారం ట్రంప్ మెడకు చుట్టుకోవడం, క్రిమినల్ నేరాభియోగాలకు దారితీయడం తెలిసిందే. అమెరికా చరిత్రలో అభియోగాలు ఎదుర్కొంటున్న తొలి మాజీ అధ్యక్షునిగా ట్రంప్ నిలిచారు. ఆయన విచారణ సందర్భంగా న్యూయార్క్‌లో మన్‌హాటన్ జ్యూరీ లేన్ మొత్తం మీడియాతో కిక్కిరిసిపోయింది. ఈ నేపథ్యంలో మీడియా కంటపడకుండా ఉండేందుకు ట్రంప్ తన కాన్వాయ్‌తో కోర్టు భవనంలోకి వెనకవైపుగా ప్రవేశించారు. ట్రంప్ విజ్ఞప్తి మేరకు విచారణకు మీడియాను కోర్టు గదిలోకి జడ్జి అనుమతించలేదు. అంతేగాక విచారణ ప్రక్రియను ప్రసారం చేయరాదని సోమవారమే ఆదేశాలు జారీ చేశారు. విచారణ మొదలయ్యే ముందు ఫొటోలు తీసుకునేందుకు ఐదుగురు ఫొటోగ్రాఫర్లను మాత్రం అనుమతించారు.

భారీ భద్రత

అంతకుముందు విచారణ నిమిత్తం సోమవారం రాత్రే ట్రంప్ ఫ్లోరిడాలోని తన నివాసం నుంచి సొంత బోయింగ్ 757 విమానంలో న్యూయార్క్ చేరుకున్నారు. తన అభిమానులకు అభివాదం చేస్తూ హడావుడి చేసిన అనంతరం ట్రంప్ టవర్‌లో బస చేశారు. విచారణ నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రంప్ అధ్యక్షునిగా ఉండగానే హష్ మనీ కేసులో మన్‌హాటన్ జిల్లా అటార్నీ కార్యాలయం ఆయనపై విచారణ మొదలు పెట్టింది.



కోర్టు ఆవరణలో భారీగా మీడియా ప్రతినిధులు, ట్రంప్ మద్దతుదారులు, వ్యతిరేకులు

నేను అరెస్ట్ కాబోతున్నా.. అభిమానులకు ట్రంప్ మెయిల్

తనపై కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపేనని ట్రంప్ ఆరోపించారు. మరోసారి అధ్యక్ష పదవికి పోటీపడకుండా అడ్డుకునేందుకు దేశ చరిత్రలోనే అత్యంత దారుణ రీతిలో తననిలా కేసుల పేరిట ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారంటూ ఆయన దుయ్యబట్టారు. విచారణకు బయల్దేరే ముందు తన సోషల్ మీడియా సైట్ ట్రూత్‌లో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ''అగ్ర రాజ్యం అమెరికా నానాటికీ దిగజారుతోంది. థర్డ్ వరల్డ్ మార్క్సిస్టు దేశంగా మారుతోంది'' అంటూ అభిమానులకు పంపిన ఈ మెయిల్‌లోనూ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'అరెస్టుకు ముందు ఇది నా చివరి మెయిల్' అని అందులో పేర్కొనడం విశేషం! ''ఏ తప్పూ చేయనందుకు విపక్ష నేతను అధికార పార్టీ అరెస్టు చేస్తోంది. ఈ రోజుతో అమెరికాలో న్యాయం అడుగంటింది'' అంటూ దుయ్యబట్టారు. విచారణ సజావుగా సాగుతుందని నమ్మకం లేదని ట్రంప్‌తో పాటు ఆయన న్యాయవాది అలీనా హబ్బా కూడా అన్నారు. ట్రంప్ విచారణపై స్పందించేందుకు అధ్యక్షుడు జో బైడెన్ నిరాకరించారు. న్యూయార్క్ పోలీసు శాఖ పనితీరుపై తనకు నమ్మకముందన్నారు.

ఎగబాకుతున్న యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసుల సంఖ్య మళ్లీ క్రమంగా పెరుగుతోంది. గత 24 గంటల్లో కొత్తగా 3,038 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల్లో వెల్లడైంది. క్రియాశీలక కేసుల సంఖ్య 21,179కు పెరగడం గమనార్హం. గత 24 గంటల్లో మరో తొమ్మిది మంది కోవిడ్‌తో కన్నుమూశారు. దీంతో మొత్తం కోవిడ్ బాధితుల మరణాల సంఖ్య 5,30,901కు చేరుకుంది.

కర్ణాటకలో 25 స్థానాల్లో పోటీపై ఎంఐఎం యోచన

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 25 స్థానాల్లో అభ్యర్థుల్ని బరిలో నిలపాలని అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ ఆలోచిస్తోంది. ఈసారి ఎన్నికల్లో జనతాదళ్ (సెక్యులర్) పార్టీతో జట్టుకట్టడంపై యోచి స్తున్నట్లు ఎంఐఎం కర్ణాటక రాష్ట్ర విభాగ అధ్యక్షులు ఉస్మాన్ ఘనీ మంగళవారం వెల్లడించారు. 'ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించాం. పొత్తుకు మేం సిద్ధం. పొత్తు పెట్టుకుని ముందుకెళ్లాలా, విడిగా రంగంలోకి దూకాలా అనేది ఇంకా నిర్ణయంకాలేదు' అని ఒవైసీ పీటీఐతో వ్యాఖ్యానించారు.

పరాయి భాషలు వాడితే లక్ష యూరోల జరిమానా

రోమ్: విదేశీ భాషలను పక్కనపెట్టి, సొంత భాషకు పట్టం కట్టే దిశగా ఇటలీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు అధికార బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ కీలకమైన బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ఇంగ్లిష్ సహా ఇతర విదేశీ భాషల్లో అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఏకంగా లక్ష యూరోల దాకా జరిమానా విధిస్తారు. ఈ బిల్లుకు ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ మద్దతు ప్రకటించారు. అయితే, బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉంది. విదేశీ భాషల ఆధిపత్యం వల్ల తమ మాతృభాష అంతరించేపోయే ప్రమాదం ఉందని ఇటలీ భాషాభిమానులు చాలా ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు ఇటాలియన్ భాషపై పూర్తి పట్టు ఉండాలని, చదవడం రాయడం రావాలని కొత్త బిల్లు నిర్దేశిస్తోంది.

సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు... సునీత్ చోప్రా మృతి



న్యూఢిల్లీ: కళారంగంలో సుపరిచితుడు, ఏఐఏడబ్ల్యూయూ నాయకుడు, సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు సునీత్ చోప్రా (81) మంగళవారం గుండెపోటుతో మరణించారు. హరియాణాలోని గురుగ్రామ్ నుంచి ఢిల్లీలోని ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కార్యాలయానికి వెళ్తూ సికిందర్‌పూర్ మెట్రో స్టేషన్‌లో సెక్యూరిటీ చెకింగ్ వద్ద గుండెపోటుతో కుప్పకూలారు. భద్రతా సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించే ప్రయత్నం చేయగా అప్పటికే మరణించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఆయన మృతి పట్ల సీపీఎం, ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర వర్కింగ్ కమిటీ సంతాపం తెలిపాయి.



భూటాన్ రాజు వాంగ్‌చుక్‌తో మోదీ కరచాలనం

'డోక్లాం'పై భూటాన్‌తో టచ్‌లో ఉన్నాం

- విదేశాంగ కార్యదర్శి క్వాత్రా
- రాజు వాంగ్‌చుక్‌తో మోదీ చర్చలు
- పటిష్ట బంధానికి ఐదుసూత్రాల రోడ్ మ్యాప్

న్యూఢిల్లీ: డోక్లాం అంశానికి సంబంధించి భూటాన్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉన్నట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా తెలిపారు. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగెల్ వాంగ్‌చుక్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పలు ద్వైపాక్షిక అంశాలపై లోతుగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక బంధం బలోపేతానికి ఐదుసూత్రాల రోడ్‌మ్యాప్‌ను వాంగ్‌చుక్ ఈ సందర్భంగా ప్రతిపాదించారు. భేటీ వివరాలను క్వాత్రా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా డోక్లాంపై ప్రశ్నించగా ఆయన ఇలా స్పందించారు. భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ఇరు దేశాలు పరస్పరం సహకారం ఇచ్చిపుచ్చుకుంటున్నట్టు చెప్పారు. దీన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు భూటాన్ రాజు పర్యటన దోహదపడుతోందన్నారు. అసోంలోని కోక్రాఝార్ నుంచి భూటాన్‌లోని గెలెఫు వరకు రైల్ లింక్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఇటీవలి కాలంలో భూటాన్ క్రమంగా చైనాకు దగ్గరవుతోందన్న అభిప్రాయాల మధ్య ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. వాంగ్‌చుక్‌తో చర్చలు ఫలప్రదంగా జరిగాయంటూ మోదీ ట్వీట్ చేశారు. ఆయన గౌరవార్థం విందు ఇచ్చారు.

డోక్లాం.. అతి కీలకం

వ్యూహాత్మకంగా డోక్లాం భారత్‌కు అత్యంత కీలకం. 2017లో అక్కడ భారత, చైనా సైనికులు ఏకంగా 73 రోజుల పాటు ఎదురెదురుగా మోహరించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం తెలిసిందే. భూటాన్‌లో తమదిగా చెప్పుకుంటున్న ప్రాంతంలో రోడ్డు వేసేందుకు చైనా ప్రయత్నించడం ఘర్షణకు కారణమైంది. దాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. భూటాన్‌కు చైనాతో 400 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది.

విపత్తుల స్పందనకు సమగ్ర వ్యవస్థ: మోదీ

ప్రాకృతిక విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సమగ్రమైన సన్నద్ధత వ్యవస్థ అత్యవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఒక ప్రాంతంలో తలెత్తే విపత్తులు దానికి సుదూరంలో ఉన్న ప్రాంతాలపై కూడా భారీ ప్రభావం చూపించే ఆస్కారముందని గుర్తు చేశారు. విపత్తుల నిర్వహణ సన్నద్ధత వ్యవస్థపై జరిగిన ఐదో అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కోవలిషన్ ఫర్ డిజాస్టర్ రెజీలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ)లో ఇప్పటికే 40 దేశాలు భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. ఈ విషయమై ఒక్క తాటిపైకి వచ్చేందుకు అభివృద్ధి చెందుతున్న చిన్న, పెద్ద దేశాలకు ఈ సదస్సు చక్కని వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. విపత్తు బాధితుల్లో ప్రతి ఒక్కరినీ పూర్తి స్థాయిలో ఆదుకునేలా వ్యవస్థను అభివృద్ధి చేసుకునే దిశగా కృషి జరగాలని ప్రధాని పిలుపునిచ్చారు. విపత్తుల వేళ తక్షణ ఉపశమనంతో పాటు సాధ్యమైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొనేలా చూడటంపై దృష్టి సారించాలన్నారు. ఇందుకు రవాణా సదుపాయాలతో పాటు సామాజిక, డిజిటల్ సదుపాయాలు కూడా చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

నాటో కూటమిలోకి ఫిన్లాండ్

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగిన రష్యా తమపైనా దాడికి యత్నించవచ్చనే భయాలతో ఫిన్లాండ్ దేశం మంగళవారం నాటో కూటమిలో 31వ సభ్యదేశంగా చేరింది. దీంతో రష్యా వెంట నాటో సభ్య దేశాల సరిహద్దు భూభాగ విస్తీర్ణం రెట్టింపయింది. దీనిని యూరప్ రక్షణ ముఖచిత్రంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ ప్రయత్నించడాన్ని ప్రధాన కారణంగా చూపుతూ ఆ దేశంపై యుద్ధానికి దిగిన రష్యాకు తాజాగా ఫిన్లాండ్ రూపంలో వ్యూహాత్మక, రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. గతంలో రెండో ప్రపంచ యుద్ధంలో సోవియెట్ల చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచి ఫిన్లాండ్ తటస్థ వైఖరినే అవలంభిస్తోంది. కానీ ఉక్రెయిన్ యుద్ధం దరిమిలా రష్యాకు భయపడి ఫిన్లాండ్ నాటో రక్షణ ఛత్రం కిందకు చేరక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో గత మే నెలలోనే నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకుంది. నాటోలోని మొత్తం 30 దేశాలూ ఆమోదిస్తేనే సభ్యత్వం ఇస్తారు. గత కొద్ది నెలలుగా హంగేరీ, తుర్కియేలు ఫిన్లాండ్ దరఖాస్తుకు ఆమోదముద్రవేయలేదు. ఫిన్లాండ్‌తోపాటు స్వీడన్ సైతం దరఖాస్తు చేసుకోగా ఇంకా హంగేరీ, తుర్కియేలు పచ్చజెండా ఊపలేదు. ' ఫిన్లాండ్ సభ్యత్వం తీసుకునేలా చేయడంలో ఒక రకంగా పుతిన్‌కు కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేకపోతున్నాను' అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యంగ్యంగా అన్నారు.



నాటో ప్రధాన కేంద్రంలో ఫిన్లాండ్ జెండా ఎగరేసిన దృశ్యం. (ఇన్‌సెట్లో) మంత్రుల ఆనందం

తగిన చర్యలుంటాయ్: రష్యా

ఫిన్లాండ్ నాటో సభ్యత్వంపై రష్యా ఘాటుగా స్పందించింది. 'నాటోలో చేరడం ద్వారా ఫిన్లాండ్ నుంచి ఎదురయ్యే జాతీయ భద్రతా సవాళ్లను సైనిక, సాంకేతిక, తదితర మార్గాల్లో దీటుగా ఎదుర్కొంటాం. తగు చర్యలు తీసుకుంటాం. ఉత్తర యూరప్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సుస్థిరతకు ఫిన్లాండ్ భంగం కల్గించింది' అని రష్యా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఫిన్లాండ్ సాయం అడగనంత వరకు ఆ దేశానికి అదనపు సైన్యాన్ని పంపే యోచన లేదని నాటో ప్రధాన కార్యదర్శి జీన్స్ స్టోలెన్‌బర్గ్ చెప్పారు. ఈ పరిణామం తర్వాత రష్యా తన సైనిక వనరులను మరింతగా ఫిన్లాండ్ సరిహద్దులకు తరలించనుందా ? అనే ప్రశ్నకు ఇంకా ఎలాంటి సమాధానం లభించలేదు.

సిక్కింలో భారీ హిమపాతం

ఏడుగురు పర్యాటకుల సజీవ సమాధి • గాయపడిన పలువురు పర్యాటకులు • కొనసాగుతున్న సహాయక చర్యలు

గ్యాంగ్‌టాక్: మంచుసోయగా లు, ప్రకృతి రమణీయతను చూసేందుకు వచ్చిన పర్యాటకులను ప్రకృతి హిమపాతం రూపంలో కబళించింది. సిక్కింలోని హిమాలయ పర్వతసానువుల్లోని లోయ మార్గం నాథూ లా ప్రాంతంలో మంగళవారం సంభవించిన భారీ హిమపాతం ధాటికి ఏడుగురు పర్యాటకులు మంచులో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో ఒక మహిళ, ఒక చిన్నారి కూడా ఉన్నారు. 11 మంది గాయపడ్డారు. ఐదారు వాహనాలతోసహా దాదాపు 30 మంది మంచు దిబ్బల కింద చిక్కుకున్నారన్న అనుమానాలతో అక్కడ అన్వేషణ, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్యాంగ్‌టాక్, నాథూ లాను కలిపే జవహర్‌లాల్ నెహ్రూ మార్గంలోని 14వ నంబర్ మైలురాయి వద్ద ఉదయం 11.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

వద్దన్నా వినకుండా..

ప్రమాదం విషయం తెలియగానే సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్ఓ) సిబ్బంది, రాష్ట్ర విపత్తు స్పందన దళం, స్థానికులు అక్కడికి చేరుకుని 23 మందిని కాపాడారు. నెహ్రూ మార్గ్‌లో ఆగిపోయిన 80 వాహనాల్లోని 350 మందికిపైగా పర్యాటకులను సురక్షితంగా వెనక్కి పంపించారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా 13వ నంబర్ మైలురాయి దాటాక సాధారణంగా పర్యాటకులకు అనుమతి ఉండదు. కానీ, పర్యాటకులు ఘటనాస్థలి దాకా తీసుకెళ్లాలని టూర్ ఆపరేటర్లు, డ్రైవర్లను బలవంతపెట్టారని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం వ్యక్తంచేశారు. చైనా సరిహద్దు సమీపంలో నాథూ లా మార్గముంది. వాణిజ్య సంబంధ రాకపోకలకు భారత్, చైనాలు వినియోగిస్తున్న మూడు సరిహద్దు పోస్ట్‌లలో నాథూ లా ఒకటి. సముద్రమట్టానికి 14,450 అడుగుల ఎత్తులోని మంచుమయమైన ఈ ప్రాంతాలను చూసేందుకు ఏటా పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలిరావడం తెల్సిందే. గ్యాంగ్‌టాక్ నుంచి 55 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతముంది. ప్రమాదం జరిగాక క్షతగాత్రులను గ్యాంగ్‌టాక్‌కు పంపించి చికిత్సనందిస్తున్నారు.



పేర్లు మార్చినా నిజం మారదు

- అరుణాచల్ దేశంలో అంతర్భాగమని భారత్ పునరుద్ఘాటన
- 11 ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టుకోవడంపై భారత్ ఆగ్రహం

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాంతాలకు చైనా సొంత పేర్లు పెట్టుకోవడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. పేర్లు మార్చుకున్నంత మాత్రాన నిజం మారదని పునరుద్ఘాటించింది. సరిహద్దు రాష్ట్రం అరుణాచల్‌లోని రెండు భూభాగాలు, రెండు జనావాసాలు, ఐదు పర్వతప్రాంతాలు, రెండు నదులకు మొత్తంగా 11 ప్రాంతాలకు సొంత పేర్లు పెడుతూ ఆ జాబితాను ఆదివారం చైనా పౌర వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదలచేసింది. ఈ వివరాలను చైనా అధికారిక వార్తా సంస్థ గ్లోబల్ టైమ్స్ సోమవారం వెల్లడించింది. గతంలోనూ ఇలా రెండుసార్లు పలు ప్రాంతాలకు చైనా తమ పేర్లను పెట్టుకుంది. అరుణాచల్‌ను జాంగ్నాన్‌గా పిలుచుకుంటూ దక్షిణ టిబెట్‌లో భాగంగా చైనా చెప్పుకుంటున్న విషయం విదితమే. 'అరుణాచల్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగం. పేర్లు మార్చుకున్నంత మాత్రాన ఈ రాష్ట్రం భారత్‌లో ఉండకుండాపోదుగా. పేర్ల మార్పు.. నిజాన్ని మార్చలేదు. ఇలాంటి కథనాలు చూశాం. చైనా ఇలాంటివి చేయడం కొత్తేమీకాదు. వీటిని భారత్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఆగ్రహంగా మాట్లాడారు.

కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం

'గల్వాన్ ఘటనసహా సరిహద్దు వెంట చైనా దుశ్చర్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ఎండగట్టని ఫలితంగానే ఇలాంటి తెంపరితనానికి చైనా తెగిస్తోంది. మోదీ చైనాకు ఇచ్చిన క్లీన్‌చిట్ కారణంగానే ఆ దేశం ఇంతటి దుస్సాహసానికి దిగింది. మోదీ వైఖరి వల్ల భారత్ ఇంకా ఇలాంటి విపరిణామాలను చవిచూడాల్సి వస్తోంది' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. ' మన 2000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా లాగేసుకుంది. ఇప్పుడు ప్రాంతాల పేర్లు మారుస్తున్నారు. ప్రధాని మోదీ మాత్రం దీనిపై ఏం మాట్లాడరు. ఎందుకంత భయం?' అని రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్‌చేశారు. 'చైనా ఆగడాలపై మోదీ మౌనం వల్ల భారత్ చెల్లించుకున్న మూల్యమిది' అని జైరాం రమేశ్ అన్నారు.

రాజస్తాన్‌లో ప్రైవేట్ వైద్యుల సమ్మె విరమణ

జైపూర్: ఆరోగ్య హక్కు బిల్లుపై ప్రభుత్వంతో ఏకాభిప్రాయం కుదరడంతో ఇక సమ్మె, ఆందోళనలు, నిరసనలు విరమించాలని రాజస్తాన్‌లోని ప్రైవేట్ డాక్టర్లు నిర్ణయించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాజస్తాన్ విభాగం మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి సమ్మె నిలిపివేసినట్లు వెల్లడించింది. ఆరోగ్య హక్కు బిల్లు పరిధి నుంచి దాదాపు 98 శాతం ప్రైవేట్ ఆసుపత్రులను మినహాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఈ మేరకు అవగాహనా ఒప్పందంపై సంతకం చేశామని పేర్కొంది. నిజానికి ఆరోగ్య హక్కు బిల్లు మార్చి 28న రాజస్తాన్ అసెంబ్లీలో ఆమోదం పొందింది. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డాక్టర్లు ఆందోళనబాట పట్టారు. ఈ బిల్లు ప్రకారం.. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఎలాంటి రుసుము చెల్లించకుండానే అత్యవసర వైద్యం పొందే హక్కు ఉంటుంది. ప్రభుత్వ వైద్యశాల, ఆరోగ్య కేంద్రం, గుర్తింపు పొందిన ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో రుసుము వసూలు చేయకుండానే అత్యవసర వైద్యం అందించాలి. ఐఎంఏ సభ్యులు మంగళవారం రాజస్తాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో, ముఖ్య కార్యదర్శులతో సమావేశమయ్యారు. బిల్లుపై చర్చించారు.

గ్యాంగ్‌స్టర్ దీపక్ బాక్సర్ మెక్సికోలో అరెస్ట్

న్యూఢిల్లీ: దాదాపు పది కేసుల్లో ప్రధాన నిందితుడు, భారత్‌లో మోస్ట్ వాంటెడ్ నేరగాళ్ల జాబితాలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దీపక్ బాక్సర్‌ను పోలీసులు ఎట్టకేలకు మెక్సికోలో అరెస్ట్‌చేశారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ, విదేశాల్లో భారత నిఘా బృందాలు సహకారంతో పోలీసులు మెక్సికోకు వెళ్లి అతడిని అరెస్ట్‌చేశారు. విదేశాల్లో భారత పోలీసులు ఒక గ్యాంగ్‌స్టర్‌ను అరెస్ట్‌చేసి తీసుకురావడం ఇదే తొలిసారి. గతంలో జాతీయస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ గెల్చుకున్న దీపక్ పహల్ ఆ తర్వాత నేరాలు చేస్తూ దీపక్ బాక్సర్‌గా పోలీసు రికార్డులకెక్కాడు. 2021లో ఢిల్లీలోని రోహిణి కోర్టు కాంప్లెక్స్‌లో మరో గ్యాంగ్‌స్టర్ జితేంద్ర మాన్ అలియాస్ గోగిని హత్య చేయించి అతడి గ్యాంగ్‌కు బాస్‌గా మారాడు.

తూత్తుకుడిలో కరోనాతో వ్యక్తి మృతి

సాక్షి, చెన్నై: కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్రంలోనూ ఓ మరణం కేసు నమోదైంది. మంగళవారం తూత్తుకుడిలో చికిత్స పొందుతున 52 ఏళ్ల వ్యక్తి మరణించాడు. వివరాలు.. రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా చెన్నై, శివారు జిల్లాలు, కోయంబత్తూరు, సేలంలో రోజు వారీ కేసుల సంఖ్య రెండంకెలుగా ఉన్నాయి. ఈ సమయంలో పొరుగున ఉన్న కేంద్ర పాలిత ప్రాంతంపుదుచ్చేరి పరిధిలోని కారైక్కాల్‌లో కరోనాకు చికిత్స పొందుతూ వచ్చిన మహిళ ఒకరు సోమవారం మరణించారు. దీంతో అక్కడ కరోనా ఆంక్షలను కఠినతరం చేశారు. ఈపరిస్థితులలో తూత్తుకుడిలో కరోనా మరణం సంభవించడం కలకలం రేపుతోంది. ఈ వ్యక్తి ఊపిరితిత్తుల సమస్యకు చికిత్స పొందుతున్న సమయంలోనే కరోనా బారిన పడడంతో పరిస్థితి విషమించి మరణించినట్లు వైద్యులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

పోలీసు బ్రదర్స్‌పై సస్పెన్షన్ వేటు

సాక్షి,చెన్నై: ఆన్‌లైన్ వర్తకంలో పెట్టుబడుల పేరిట మోసానికి పాల్పడిన పోలీసు బ్రదర్స్‌ను సస్పెండ్ చేస్తూ కాంచీపురం ఎస్పీ సుధాకర్ మంగళవారం ఆదేశించారు. వివరాలు.. కాంచీపురానికి చెందిన పోలీసు బ్రదర్స్ ఆరోగ్య అరుణ్, సహాయ భారత్, వీరి మరో సోదరుడు, విద్యాశాఖ అధికారి ఇదయరాజ్‌తోపాటు కుటుంబం అంతా ఆన్‌లైన్ వర్తకంలో పెట్టుబడుల పేరిట రూ. 40 కోట్ల మేరకు వసూలు చేసింది. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు మోసానికి పాల్పడిన వ్యవహారం ఆదివారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ కుటుంబంలోని 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారాన్ని కాంచీపురం ఎస్పీ సుధాకర్ తీవ్రంగా పరిగణించారు. ఆ పోలీస్ బ్రదర్స్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఇద్దరు స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలకు చెక్

సాక్షి, చెన్నై: కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు సమీపంలోని మాత్తూరు పంచాయతీ అధ్యక్షుడు గోపీ, ఉపాధ్యక్షుడు ఆర్ముగం అధికారాలకు చెక్ పెడుతూ కలెక్టర్ ఆర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇద్దరూ పంచాయతీలో నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్డు సభ్యుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

11 నుంచి పాఠశాలల్లో వార్షిక పరీక్షలు

కొరుక్కుపేట: రాష్ట్రంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్ణయించిన సమయం కంటే ముందస్తుగానే నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వివరాలు.. తమిళనాడులో పనిచేస్తున్న 32 వేల ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు కోటి మంది విద్యార్థులు చదువుతున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులే కాకుండా, 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏటా ఏప్రిల్ నెలాఖరున వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ప్లస్-2, ప్లస్-1 పరీక్షలు పూర్తయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక ఉన్నత పాఠశాలలు, లైఫ్ స్కూల్స్, మెట్రిక్యులేషన్ పాఠశాలల్లోని 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 11 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇక పరీక్షలు ముగిసిన వెంటనే వేసవి సెలవులను ప్రకటిస్తామని విద్యాశాఖ వెల్లడించింది.

పుష్కర కాలం తర్వాత తెరుచుకున్న వీకే పార్క్

– ప్రారంభించిన సీఎం స్టాలిన్

కొరుక్కుపేట: రంగురంగుల మ్యూజికల్ పాయింట్‌లతో కూడిన వీకే పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌ను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. అదేవిధంగా యోగా, ధ్యాన శిక్షణ కేంద్రం, పురుషులకు, మహిళలకు వేర్వేరుగా బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బీచ్ వాలీబాల్ కోర్టులను కూడా సందర్శకులకు అందుబాటులోకి తెచ్చారు. వివరాలు.. చెన్నైలోని పురాతన పార్కుల్లో ఒకటైన శ్రీ వి.కె. పార్క్ 12 సంవత్సరాల తర్వాత తెరుచుకుంది. షేనాయినగర్‌లో రూ.18 కోట్లతో పునర్‌నిర్మించిన ఈ పార్కును ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ పార్కులో ఆధునిక సౌకర్యాలు వివిధ క్రీడా పరికరాలను అమర్చారు. 8.8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కును మెట్రో రైలు పనుల కారణంగా 2011లో మూసివేశారు. దీన్ని తిరిగి ప్రారంభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అన్నాడీఎంకే కార్యదర్శుల భేటీ రద్దు

సాక్షి, చెన్నై: ఈనెల 7వ తేదీన జరగాల్సిన అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శులు, జిల్లాల కార్యదర్శుల సమావేశం రద్దయ్యింది. దీనికి గల కారణాలను అన్నాడీఎంకే వర్గాలు రహస్యంగా ఉంచాయి. వివరాలు.. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడపాడి కె. పళనిస్వామి గత వారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన నేతృత్వంలో ఈనెల 7న పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, జిల్లాల కార్యదర్శుల సమావేశం నిర్వహించాలని పళనిస్వామి నిర్ణయించారు. ఇది ఆయన నేతృత్వంలో అధికారికంగా తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ సమావేశాన్ని హఠాత్తుగా రద్దు చేస్తూ పళని స్వామి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ వ్యవహారం కోర్టులో ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహణపై పళని వెనక్కి తగ్గి ఉండవచ్చు అనే చర్చ జోరందుకుంది. అయితే సమావేశం రద్దుపై అన్నాడీఎంకే ఇప్పటి వరకు స్పందించ లేదు. ఇక ముందుగా నిర్ణయించిన ప్రకారం బుధవారం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా, పళని స్వామికి పోటీగా ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరం బలాన్ని చాటే ప్రయత్నాలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా తిరుచ్చి వేదికగా ఈనెల 23న భారీ మహానాడు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

కావేరి డెల్టాలో

'కోల్' కల్లోలం




నైవేలి బొగ్గ గనులు (ఇన్‌సెట్) కావేరి నదీ తీరం

ఏడాదికి మూడు పంటలతో కళకళలాడే డెల్టా జిలాల్లో కల్లోలం రేగుతోంది. నిత్యం పచ్చదనంతో ఉండే సురక్షిత వ్యవసాయ క్షేత్రంలో నేలబొగ్గు తవ్వకాలకు కేంద్రం అనుమతించ్చిందనే సమాచారంతో అక్కడి రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వివిధ రాజకీయ పార్టీలు పోరుబాట పట్టాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ మంత్రి సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టే నిర్ణయాలను పునఃసమీక్షించి వెనక్కి తీసుకోవాలని సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాయడం గమనార్హం.

రైతుల బతుకు బుగ్గేనా..?

- సురక్షిత వ్యవసాయ క్షేత్రంలో బొగ్గు తవ్వకాలకు కేంద్రం యత్నాలు
- 11 చోట్ల పరిశోధనలకు మినిస్టరీ ఆఫ్ కోల్ నోటిఫికేషన్ జారీ
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డెల్టా రైతులు
- ఆందోళన వద్దని వ్యవసాయ శాఖ మంత్రి భరోసా
- ప్రధానికి లేఖ రాసిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: కావేరి డెల్టా పరిధిలోని సురక్షిత వ్యవసాయ క్షేత్రంలో నేల బొగ్గు తవ్వకాలకు కేంద్రం అనుమతించిందనే సమాచారంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఏకంగా ఆరు చోట్ల నేల బొగ్గు సొరంగాలు, 11 చోట్ల పరిశోధనలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మినిస్టరీ ఆఫ్ కోల్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వీటికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాలని పీఎంకే నేత అన్బుమణి రాందాసు డిమాండ్ చేశారు. సురక్షిత క్షేత్రంలో కేంద్రం నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ డిమాండ్ చేశారు.

నేపథ్యం ఇదీ..

రాష్ట్రంలో పచ్చటి పంట పొలాలతో నిండిన జిల్లాలుగా తిరువారూర్, తంజావూరు, పుదుకోట్టై, పెరంబలూరు, అరియలూరు, నాగపట్నం, కడలూరు, తిరుచ్చికి పేరుంది. ఇక్కడ లక్షలాది ఎకరాలల్లో వరి పంట, వేలాది ఎకరాలలో ఇతర పంటలు సాగవుతున్నాయి. అలాగే పెద్దఎత్తున కొబ్బరి సాగవుతోంది. కావేరినది నీటి ఆధారంగానే ఇక్కడ పంటలు పండుతున్నాయి. గత కొన్నేళ్లుగా వరుణుడి కరుణ, కావేరి పరవళ్లతో ఇక్కడి అన్నదాతల్లో ఆనందం తాండవిస్తోంది. అయితే డెల్టా జిల్లాల్లోని భూగర్భంలో ఉన్న ఇంధనం, హైడ్రో కార్బన్, గ్యాస్, నేల బొగ్గు వంటి నిక్షేపాలను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం గత కొంతగాలంగా ప్రయత్నాలు చేస్తోంది. గతంలో కేంద్రం ఇచ్చిన అనేక ఉత్తర్వులకు వ్యతిరేకంగా డెల్టాలో మహోద్యమాలు జరిగాయి. కేంద్రం వ్యూహాలకు చెక్ పెట్టే విధంగా, రైతుల్లో నెలకొన్న ఆందోళనను పోగొట్టే రీతిలో గత అన్నాడీఎంకే ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా కీలక తీర్మానం చేసింది. డెల్టా జిల్లాలను సురక్షిత వ్యవసాయ క్షేత్రంగా ప్రకటిస్తూ చట్టం తీసుకొచ్చింది. ఈ క్షేత్రంలో వ్యవసాయం మాత్రమే చేపట్టాలని, ఇతర పరిశ్రమలు, తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేసింది. అలాగే గతంలో జారీ చేసిన ఇతర పరిశ్రమలకు సంబంధించిన అనుమతులను రద్దు చేశారు. దీంతో డెల్టా సురక్షిత వ్యవసాయ క్షేత్రంగా మారింది. అదే సమయంలో రాష్ట్రంలో అధికార మార్పు తర్వాత.. ప్రస్తుతం కేంద్రం మళ్లీ చాప కింద నీరులా డెల్టాపై కన్నేసి వ్యూహాలకు పదును పెట్టడం మంగళవారం అక్కడి రైతుల్లో ఆందోళన రేకెత్తించింది.

నైవేలి తరహాలో..

కడలూరు జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఆ జిల్లాను పూర్తిగా తన గుప్పెట్లోకి తీసుకునే విధంగా దూకుడు ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. నైవేలి పరిసరాల్లో నేల బొగ్గు తవ్వకాల పేరిట గ్రామాలను తమ ఆధీనంలోకి తీసుకోవడం వివాదానికి దారి తీసింది. దీనికి వ్యతిరేకంగా ఓ ఉద్యమమే ప్రారంభమైంది. అలాగే వీరాణ్ణం రిజర్వాయర్ పరిధిలో నేల బొగ్గు తవ్వకాలకు పరిశోధనలు చేయడం వెలుగులోకి రావడంతో కళ్లెం వేయడానికి ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమయంలో డెల్టాలో ప్రధాన జిల్లాగా ఉన్న తంజావూరు ఒరత్తనాడు పరిధిలో ఆరు చోట్ల నేల బొగ్గు తవ్వకాలకు సొరంగాలపై కేంద్రం దృష్టి పెట్టడం వివాదానికి దారి తీసింది. తిరువారూర్– తంజావూరు జిల్లాల పరిధిలో ఆరు చోట్ల నేల బొగ్గు తవ్వకాలకు సంబంధించిన సొరంగాలు, పరిశోధనలకు కేంద్రం అనుమతి ఇవ్వడం వెలుగు చూసింది. ఈ సమాచారం అన్నదాతల్లో ఆగ్రహాన్ని రేపింది. సురక్షిత క్షేత్రాన్ని చిన్నాభిన్నం చేసే కుట్రలు జరుగుతున్నాయంటూ రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం స్పందించకుంటే మరో ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించాయి.

అడ్డుకట్ట వేసేందుకు..

కావేరి డెల్టాలోని లక్షా 25 వేల ఎకరాల పంట పొలాలను సర్వనాశనం చేయడానికి కేంద్రం సిద్ధమైందని పీఎంకే నేత అన్బుమణి రాందాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వద్ద ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని వివరించారు. తంజావూరు జిల్లా పరిధిలో 11 చోట్ల పరిశోధనలు, ఆరు చోట్ల సొరంగాల తవ్వకాలకు కేంద్రం కార్యాచరణ సిద్ధం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా కేంద్రం ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకోవడం తగదని హితవుపలికారు. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తక్షణం స్పందించాలని, అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేయాలని పట్టుబట్టారు. బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. సురక్షిత వ్యవసాయం క్షేత్రంలో పరిశోధనలకు కేంద్రం అనుమతులు ఇస్తున్న నేపథ్యంలో ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ వ్యాఖ్యలు చేశారు. రైతులతో కలిసి పెద్దఎత్తున పోరాటాలకు తాము సిద్ధం అని ప్రకటించారు.



పచ్చదనం నిండిన డెల్టా ప్రాంతం



గతంలో చమురు తవ్వకాల కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ (ఫైల్)

ఆందోళన వద్దు..

కేంద్రం అనుమతులు ఇచ్చినంత మాత్రాన అవన్నీ అమల్లోకి వచ్చే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం స్పష్టం చేశారు. తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న స్థలాల్లో, తమ అనుమతి లేకుండా కేంద్రం ఎలా తవ్వకాలపై దృష్టి పెడుతుందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడిస్తారన్నారు. తిరువారూర్, తంజావూరు పర్యటనలో ఉన్న క్రీడల శాఖమంత్రి ఉదయ నిధి స్టాలిన్ మాట్లాడుతూ, కేంద్రం చర్యలను ఆదిలోనే కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా డెల్టాలో ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో సీఎం స్టాలిన్ స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం లేఖ రాశారు. సురక్షిత వ్యవసాయ క్షేత్రాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వివరించారు. తక్షణం కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

పీఎం పర్యటన ఏర్పాట్లపై ఎస్పీజీ దృష్టి

- చెన్నైలో పలుచోట్ల పరిశీలన

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ భద్రతా ఏర్పాట్లపై ఎస్పీజీ బృందం దృష్టి పెట్టింది. పీఎం పర్యటన జరిగే ప్రాంతాలలో మంగళవారం పరిశీలన చేపట్టింది. వివరాలు.. ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 8వ తేదీన చెన్నైకు రానున్న విషయం తెలిసిందే. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీ నుంచి ఆయన చెన్నై విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఎయిర్‌పోర్టులో కొత్తగా నిర్మించిన టెర్మినల్‌ను వీక్షించనున్నారు. అనంతరం అక్కడి నుంచి అడయార్‌లోని ఐఎన్ఎస్ హెలీప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో వెళ్తారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. ఇక్కడి ప్రత్యేక వేదికపై నుంచి చెన్నై – కోయంబత్తూరు వందే భారత్‌రైలు సేవలకు జెండా ఊపుతారు. తర్వాత మైలాపూర్ రామకృష్ణ మఠంలో జరిగే కార్యక్రమానికి ప్రధాని హాజరు అవుతారు. ఈ పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో పల్లావరం ఆర్మీ శిక్షణ కేంద్రానికి చేరుకుంటారు. ఇక్కడి జైన్ కళాశాల వేదికగా జరిగే విమానాశ్రయం టెర్మినల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు.



నరేంద్రమోదీ

రాత్రి 8.45 గంటలకు చెన్నై పర్యటన ముగించుకుని కర్ణాటక రాష్ట్రం మైసూరుకు బయలు దేరి వెళ్తారు.


భద్రతపై దృష్టి..

ప్రధాని పర్యటన దృష్ట్యా, భద్రతా ఏర్పాట్లపై కేంద్రానికి చెందిన ఎస్పీజీ బృందం రంగంలోకి దిగింది. ఎస్పీజీ ఐజీ నేతృత్వంలో ఈ బృందం మంగళవారం రాత్రి చెన్నైకు చేరుకుంది. విమానాశ్రయం పరిసరాలలో ఈ బృందంలోని సభ్యులు విస్తృతంగా పర్యటించింది. ప్రధాని పర్యటన జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. బుధవారం విమానాశ్రయంలో జరిగే సమావేశంలో భద్రత ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. ఈ సమావేశానికి విమానాశ్రయ వర్గాలు, డీజీపీ, చెన్నై పోలీసు కమిషన్ తదితర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

పుదుచ్చేరిలో విద్యుత్ చార్జీల వడ్డన

- ఈనెల నుంచే అమల్లోకి..
- ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం

సాక్షి, చెన్నై: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పెంచింది. చార్జీలను అమాంతం పెంచుతూ విద్యుత్ రెగ్యులేటరి కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో గృహ, వర్తక ఉపయోగ విద్యుత్ కనెక్షన్లకు చార్జీలను పెంచుతూ రెగ్యులేటరీ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని అమల్లోకి తెస్తూ విద్యుత్ బోర్డు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు గృహ ఉపయోగానికి ఇది వరకు 100 యూనిట్ల వరకు, యూనిట్‌కు రూ.1.90 వసూలు చేసే వారు. దీనిని ప్రస్తుతం రూ. 2.25కు పెంచారు. 101 నుంచి 200 యూనిట్ల వరకు యూనిట్‌కు గతంలో రూ. 2.90 ఉంటగా.. దాన్ని రూ.3.25కు పెంచారు. ఇక 201 నుంచి 300 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ. 5.40, మూడు వందల యూనిట్లకు పైన ఉపయోగించే వారికి రూ. 6.80గా చార్జీలను కొత్తగా వసూలు చేయనున్నారు. అలాగే కుటీర పరిశ్రమలకు సైతం ఇదే చార్జీలను నిర్ణయించారు. వ్యాపారులకు 100 యూనిట్లలోపు ఉంటే యూనిట్‌కు రూ. ఆరు, 101–250 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ. 7.05. రెండువందల యాభై యూనిట్లకు పైగా వాడే వారికి యూనిట్‌కు రూ. 7.80 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ పెంపు ఈనెల నుంచే అమల్లోకి వస్తుందని అధికారులు ప్రకటించారు. కాగా విద్యుత్ చార్జీల పెంపును కాంగ్రెస్, డీఎంకే తదితర ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కరోనా మిగిల్చిన కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే పుదుచ్చేరి వాసులు గట్టెక్కుతున్న నేపథ్యంలో విద్యుత్ చార్జీల వడ్డనతో మరింత భారం మోపడం తగదని ప్రభుత్వానికి హితవు పలికారు.



• గజ వాహనంపై సీతాపతి

శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం సీతారాములు గజ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఇక కన్యకా పరమేశ్వరి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నేత్రపర్వంగా సాగాయి. లలిత సహస్ర నామ పారాయణ బృందం భక్తి గీతాలను ఆలపించి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది.

– కొరుక్కుపేట



రూ. 35 లక్షల పన్ను చెల్లించాల్సిందే!

- రేస్ క్లబ్‌కు హైకోర్టు ఆదేశాలు
- నాలుగు వారాల గడువు

సాక్షి, చెన్నై : చెన్నై కార్పొరేషన్‌కు ఆస్తిపన్నుగా రూ. 35 లక్షలు చెల్లించాల్సిందేనని మద్రాసు రేస్ క్లబ్‌కు హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాలు గడువు విధించింది. వివరాలు.. ఆస్తిపన్ను చెల్లించని సంస్థలు, కార్యాలయాలు, భవన యజమానుల భరతం పట్టే విధంగా చెన్నై కార్పొరేషన్ వర్గాలు పరుగులు తీస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మద్రాసు రేస్ క్లబ్ కూడా ఉంది. 1998 నుంచి 2018 వరకు 20 సంవత్సరాలకుగాను ఆస్తి పన్నుగా రూ. 3 కోట్ల 60 లక్షలు చెల్లించాలని రేస్ క్లబ్ కార్పొరేషన్ నోటీసులు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ రేస్ క్లబ్ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. 1837 నుంచి తమక్లబ్ సేవలు గిండి వేదికగా జరుగుతున్నాయని పిటిషన్‌లో వివరించారు. గుర్రపు పందేలా నిర్వహణ, గుర్రాలకు శిక్షణ, అతిథి గృహాలు అంటూ ఈ క్లబ్‌లో అన్ని ఏర్పాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే 1998 నుంచి 2018 వరకు తమ క్లబ్‌కు అన్ని రకాల జరిమానాతో రూ. 3 కోట్ల 60 లక్షల 41 వేల 163 పన్ను చెల్లించాలని 2020లో నోటీసులు జారీ చేశారని వివరించారు. ఆస్తిపన్ను చెల్లింపు విషయంగా తమకు లోక్ అదాలత్‌లో సమస్య పరిష్కారమైందని గుర్తు చేశారు. అయినా ఆస్తి పన్ను చెల్లించాలని కోరుతున్నారని, ఈమేరకు కార్పొరేషన్ నోటీసులను రద్దు చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి అనితా సుమంత్ నేతృత్వంలోని బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. చెన్నై కార్పొరేషన్ తరఫున హాజరైన న్యాయవాది రాహుల్ తన వాదనలో నిబంధనలకు అనుగుణంగానే అన్ని నోటీసులు జారీ చేశామని వివరించారు. వాదన అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ ఆస్తిపన్నుగా రూ. 35 లక్షలు నాలుగు వారాల్లోపు చెల్లించాలని రేస్ క్లబ్‌ను ఆదేశించారు. ఆ తదుపరి కొత్త ఆస్తిపన్ను చెల్లింపునకు సంబంధించిన లెక్కింపు, ఇందుకోసం కొంత సమయం గడువు కేటాయిస్తూ నోటీసులు ఇవ్వాలని సూచించారు.



హైకోర్టు

ఒకే విశ్వవిద్యాలయం నుంచి 18 డిగ్రీలు

ప్రొఫెసర్ కలై పునీతన్ ప్రపంచ రికార్డు

కొరుక్కుపేట: అన్నాడీఎంకే అధికార ప్రతినిధి ప్రొఫెసర్ ఎస్. కలై పునీతన్ ఒకే యూనివర్సిటీ నుంచి 18 డిగ్రీలు సాధించి ప్రపంచ రికార్డు సృష్టించారు. వివరాలు.. ప్రొఫెసర్ కలైపునితన్ కన్యాకుమారి జిల్లాలో నాటక రంగ పితామహుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ శామ్యూల్ ఇరానియల్ కుమారుడు. ప్రస్తుతం చెన్నైలో నివసిస్తున్న ఆయన అన్నాడీఎంకేలో పనిచేస్తున్నారు. నాటక రచయిత, పరిశోధకుడు, కవి, సాహితీవేత్తగా బహుముఖ కనబరుస్తున్నారు. 130 కి పైగా ఆయన పుస్తకాలు రాశారు. ఈయన మదురై కామరాజర్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో ఏకంగా 18 డిగ్రీలను పొందారు. వీటిని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి ధ్రువీకరణ పత్రం అందజేసింది.



విచారణకు 'కళాక్షేత్ర' ప్రత్యేక బృందం

- జస్టిస్ కన్నన్, మాజీ డీజీపీ లతికకు చోటు

సాక్షి, చెన్నై: లైంగిక వేధింపుల ఆరోపణలపై కళాక్షేత్రంలో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటైంది. ఇందులో రిటైర్డ్ న్యాయమూర్తి కన్నన్, మాజీ డీజీపీ లతికా చరణ్ తదితరులు ఉన్నారు. ఇక ఈ వ్యవహారంలో అధ్యాపకుడు హరి పద్మన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని కళాక్షేత్ర యాజమాన్యం సైతం తీవ్రంగా పరిగణించింది. హరిపద్మన్‌ను డిస్మిస్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు అధ్యాపకులు సంజీత్ లాల్, సాయి కృష్ణ, శ్రీనాథ్‌ను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంపై విచారణకు కళాక్షేత్ర యాజమాన్యం ప్రత్యేక కమిటీని మంగళవారం నియమించింది. ఇందులో రిటైర్డ్ న్యాయమూర్తి కన్నన్, మాజీ డీజీపీ లతికా చరణ్, డాక్టర్ శోభవర్ధన ఉన్నారు. ఈ కమిటీ సభ్యులు విద్యార్థినుల వద్ద, కళాక్షేత్ర నిర్వాహకుల వద్ద విచారణ నిర్వహించనుంది. విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. సాయంత్రం ఈ కమిటీ విద్యార్థినుల వద్ద నుంచి అనేక అంశాలపై వివరాలను సేకరించింది. విద్యార్థినుల భద్రతకు పూర్తిస్థాయిలో భరోసా కల్పిస్తున్నామని, అందరికీ రక్షణ ఉంటుందని, ప్రతిఒక్కరూపరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధం కావాలని కళాక్షేత్ర యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.



కళా క్షేత్ర

విజయవంతంగా డీప్‌బ్రెయిన్ స్టిమ్యులేషన్ చికిత్స

సాక్షి, చెన్నై: పార్కిన్సన్స్ వ్యాధితో బాధ పడుతున్న రోగులపై డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ ఇంప్లాంటేషన్ చికిత్సను విజయవంతం చేశామని సిమ్స్ వైద్య బృందం ప్రకటించింది. మంగళవారం వడపళనిలోని సిమ్స్ ఆవరణలో జరిగిన సమావేశంలో న్యూరోఫిజీషియన్ డాక్టర్ యు. మీనాక్షి సుందరం మాట్లాడుతూ, ఈ శస్త్ర చికిత్స విధానం గురించి వివరించారు. 9 నుంచి 75 ఏళ్ల వయస్సు ఉన్న రోగులకు ఈ అధునాత ఇంటర్వెన్షనల్ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. పార్కిన్సన్స్(పీడీ)వ్యాధితో బాధ పడుతున్న ముగ్గురురోగులపై ఈ విధానాన్ని విజయవంతం చేశామన్నారు. ఇందులో 63 ఏళ్ల సీనియర్ సిటిజన్,40 ఏళ్ల ఐటీ ప్రొఫెషన్ కూడా ఉన్నట్లు వివరించారు. డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ అనేది ప్రత్యేక శస్త్ర చికిత్స విధానమని, ఇందులో కొన్ని ఎలక్ట్రోడ్‌లను మెదడులోని కొన్ని భాగాల్లో అమర్చడం జరుగుతుందన్నారు. ఇది న్యూరాలజిస్ట్, న్యూరో సర్జన్ల బృందం నేతృత్వంలో చేపట్టినట్లు వివరించారు. ఈ అరుదైన న్యూరో మాడ్యులేషన్ శస్త్ర చికిత్సను విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. సిమ్స్ చైర్మన్ రవి పచ్చముత్తు మాట్లాడుతూ, శిక్షణ పొందిన, ఆరోగ్య సంరక్షణ నిపుణులతో పాటు ప్రత్యేక బృందాలు కలిసి కట్టుగా ఈ విధానాన్ని విజయవంతం చేసి, పార్కిన్సన్స్ వ్యాధితో బాధ పడుతున్న రోగుల జీవితాలలో ఆనందాన్ని నింపారని కొనియాడారు. ప్రస్తుతం శస్త్ర చికిత్స చేసుకున్న వారందరూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు.



చికిత్స పొందిన రోగులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

గర్భిణి అనుమానాస్పద మృతి

అన్నానగర్: నీలగిరి జిల్లా కొత్తగిరికి చెందిన మల్లిక కుమార్తె విద్య (21). ఈమె ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ఈమె కోయంబత్తూరులోని శరవణంపట్టి ప్రాంతంలోని మహిళా హాస్టల్‌లో ఉంటూ బీపీజీ కాలేజీలో బీఈడీ చదువుతోంది. ఈక్రమంలో మంగళవారం హాస్టల్‌లో ఉంటున్న విద్యకు కడుపునొప్పి రావడంతో ఆమె స్నేహితురాలు కురుంబపాళయంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ విద్యను పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ మేరకు శరవణం పట్టి పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

అన్నానగర్: బావూరు చత్రం సమీపంలోని కీళ పావూరులో మంగళవారం వృద్ధ దంపతులు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా బావూరు చత్రం సమీపంలోని కీళ పావూరులోని వాణీ బార్ గాంధీ విగ్రహాల వీధికి చెందిన ధనుషోౖటి అలియాస్ తంగయ్య (81). ఇతని భార్య కృష్ణమ్మాళ్ (74). ఈ వృద్ధ దంపతులు ఒంటరిగా నివసిస్తున్నారు. తంగయ్య ఇంటి దగ్గర పెట్టెల దుకాణం నడిపేవాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ముగ్గురూ వివాహమై విడివిడిగా నివసిస్తున్నారు. తంగయ్య, అతని భార్య కృష్ణమ్మలు గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం తంగయ్య కుమారుడు రామచంద్రన్ సెల్‌ఫోన్‌లో తల్లిదండ్రులను కాల్ చేశాడు. అయితే వారు ఫోన్ ఎత్తలేదు. అనుమానం వచ్చి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. అక్కడ తంగయ్య, కృష్ణమ్మాళ్ ఇంటిలో ఉరి వేసుకుని శవాలుగా ఉండడంతో బావూరు చత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్లు అనుకుని రసాయనం తాగిన కార్మికుడి మృతి

అన్నానగర్: తిరుచ్చి సమీపంలో నీరుగా భావించి కెమికల్‌ను తాగిన కార్మికుడు మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. వరగనేరికి చెందిన మణి (58) టెంట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతడు రెండు రోజుల క్రితం టెంట్ వేసే సమయంలో దాహం వేయడంతో బాటిల్‌లోని టిన్నర్ అనే రసాయనాన్ని నీళ్లు అనుకుని తాగేశాడు. స్పృహతప్పి పడిపోవడంతో చికిత్స నిమిత్తం అతడిని సహచక కార్మికులు తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మణి మృతి చెందాడు. ఈ మేరకు గాంధీమార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వాయర్లలో తగ్గిన నీటి మట్టం

- అయినా వేసవిలో చెన్నైకు నీటి కొరత ఉండదంటున్న అధికారులు


పూండీ రిజర్వాయర్

తిరువళ్లూరు: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే ప్రధాన రిజర్వాయర్‌ల నీటి మట్టం వేగంగా తగ్గుతున్నా.. వేసవిలో నీటి కొరత వచ్చే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు. వివరాలు.. చెన్నై ప్రజలకు తాగునీటి అవసరలాలను పూండి, పుళల్, చెమరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట-తేరువాయి కండ్రిగ తదితర ఐదు రిజర్వాయర్లు తీరుస్తున్నాయి. ఈ ఐదు రిజర్వాయర్‌ల్లో 11.75 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. పూండీ రిజర్వాయర్ నుంచి మిగిలిన నాలుగు రిజర్వాయర్‌లకు నీటిని తరలించి అక్కడ నుంచి అవసరం మేరకు పంపింగ్ స్టేషన్‌లకు సరఫరా చేస్తారు. అక్కడ శుద్ధీకరణ చేసిన తరువాత చెన్నై ప్రజల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. నాలుగు నెలల క్రితం వరకు కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్‌ల నీటి మట్టం పూర్తిస్థాయిలో చేరింది. అయితే ప్రస్తుతం వేసవి మొదలైన నేపథ్యంలో రిజర్వాయర్‌ల నీటి మట్టం వేగంగా తగ్గుతూవస్తోంది. ప్రస్తుతం ఐదు రిజర్వాయర్లలో 8.56 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అయితే ఈ నీరు మరో 8 నెలలకు సరిపోతుందని, వేసవిలో తాగునీటి సరఫరాలో కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

త్వరలో కృష్ణాజలాలు విడుదల..

ఆంధ్ర తమిళనాడు రెండు రాష్ట్రాల మధ్య జరిగిన జల ఒప్పందంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా 12 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో త్వరలోనే పూండీకి కృష్ణాజలాలు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వివరించారు. కాగా పూండీ రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 3.23 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. చోళవరం రిజర్వాయర్ సామర్థ్యం 1.08 టీఎంసీలు కాగా ప్రస్తుతం 818 మిలియన్ ఘనపరిమాణం నీరు మాత్రమే నిల్వ ఉంది. పుళల్ రిజర్వాయర్ సామర్థ్యంయ 3.30 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.40 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. అలాగే చెమరంబాక్కం సామర్థ్యం 3.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.133 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కన్నన్‌కోట-తేరువాయి కండ్రిగ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 0.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల మేళాకు స్పందన

సాక్షి, చెన్నై : నగర వాసుల ముంగిట ఆర్గానిక్‌కి ఉత్పత్తులను తీసుకొచ్చే విధంగా ఎస్పీఆర్ సిటీలో భారీ మేళా ఏర్పాటైంది. పద్మశ్రీ మునుస్వామి ఈ మేళాను ప్రారంభించారు. ఈ మేళ గురించి మంగళవారం నిర్వాహకులు వివరిస్తూ.. సేంద్రియ ఉత్పత్తులు, అందుకు అనుగుణమైన వస్తువులతో 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 30 వరకు ఫుడ్ స్టాల్స్ కూడా కొలువు దీర్చారు. తమిళనాడు , కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్ నుంచి తీసుకొచ్చిన ఆర్గానిక్ ఫుడ్, లైఫ్ స్టైల్ వస్తువులు, గోనేటివ్, గో ఆర్గానిక్, గో నేచురల్ అనే నినాదంతో ఇక్కడ మరెన్నో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన కళాకారుడు విక్రమ్ హజ్రా నేతృత్వంలో ప్రత్యేక ప్రదర్శనలు, హిప్నోటిజం, వర్మథెరపీ, నాడి చికిత్స, రిథమిక్‌యోగా, వంటి అంశాలను గురించి వివరించే విధంగా వర్క్ షాపు, నిపుణుల చర్చ కార్యక్రమాలకు చర్యలు తీసుకున్నారు.

మహావీరుడి శిల్పం లభ్యం

అన్నానగర్: పుదుకోట్టై జిల్లా సరిహద్దుల్లో మంగళవారం మహావీరుని శిల్పం లభ్యమైంది. వివరాలు.. ఆవుడయార్ కోవిల్ సమీపంలోని శివగంగై జిల్లా సిరుగనూర్ గ్రామంలో పుదుకోట్టై ఆర్కియోలాజికల్ సొసైటీ మంగళవారం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించింది. ఆ సమయంలో మహావీరుని జైన శిల్పం లభ్యమైంది. పుదుకోట్టై ఆర్కియాలజికల్ సర్వే వ్యవస్థాపకుడు మణికంఠన్ మాట్లాడుతూ.. ముకుడై రాయి మధ్యలో కనిపించే తలపాగా నమూనా జైనమతానికి సంబంధించిన మూడు కాలాలను సూచించే పవిత్ర చిహ్నమని పేర్కొన్నారు. దానికి ఇరువైపులా దీపస్తంభం చెక్కబడి ఉందని, ఇది 12వ శతాబ్దానికి చెదినదిగా భావిస్తున్నట్లు తెలిపారు.


12వ శాతబ్దానికి చెందిన మహావీరుడి శిల్పం

కుమార్తెలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

- ఇద్దరు బిడ్డలు మృతి

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని కస్బా ప్రాంతానికి చెందిన మహేష్‌కుమార్ బోర్‌వెల్ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఇతని భార్య జమున(33). ఈ దంపతులకు యాగిత(4), యాసిక(18) నెలల వయసున్న కుమార్తెలున్నారు. మహేష్‌కుమార్ వృత్తి రీత్యా బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లి వచ్చేవాడు. కస్బా ప్రాంతంలోని మహేష్‌కుమార్ ఇళ్లు మరమ్మతులకు గురవడంతో అక్కడ ఉండేందుకు జమున నిరాకరించేంది. దీంతో ఇద్దరి మధ్య తరచూ ఘర్షణ చోటు చేసుకునేది. ఈ క్రమంలో జమున గత మూడు సంవత్సరాలుగా పెరియంకుప్పంలోని అమ్మగారింటిలో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటోంది. మూడు రోజుల క్రితం మరోసారి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనో వేదనకు గురైన జమున సోమవారం సాయంత్రం వరకు తలుపులు తెరవక పోవడంతో కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో జమునతో పాటు ఇద్దరు కుమార్తెలు స్పృహ తప్పి పడి ఉండడంతో స్థానికులు ఆంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు ఇద్దరు కుమార్తెలు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. జమున పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆంబూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.


ఇద్దరు చిన్నారులతో తల్లి జమున(ఫైల్)

భిక్షాటనతో వచ్చిన రూ.10 వేలు..

- ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం

అన్నానగర్: ఓ వృద్ధుడు భిక్షాటన ద్వారా వచ్చిన రూ.10 వేలును మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం ఇచ్చాడు. వివరాలు.. పెరంబలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మంగళవారం తూత్తుకుడి జిల్లా సాత్తాంగుళం తాలూకా అలంగినారు ప్రాంతానికి చెందిన భూల్ పాండియన్ (73) వచ్చాడు. తన భిక్షాటన ద్వారా తనకు వచ్చిన రూ.10 వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందించాలని కలెక్టర్ కార్యాలయ అధికారుల వద్దకు వెళ్లాడు. తరువాత వాటిని బ్యాంకుల ద్వారా ప్రభుత్వ నిధుల్లోకి జమ చేయమని సూచించారు. దీంతో బ్యాంకుకు వెళ్లి తన పొదుపు సొమ్ము రూ.10 వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించారు.


రూ.10 వేలు విరాళం ఇచ్చిన భూల్ పాండియన్

ఘనంగా మహావీర్ జయంతి

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని మహావీర్ జయంతిని పురస్కరించుకొని వేలూరు బీఎస్ఎస్ ఆలయ వీధిలోని జైన్ సంఘానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. అనంతరం జైన్ మతస్తులు స్వామివారిని వాహనంపై ఉంచి మేళ తాళాల నడుమ నృత్యం చేస్తూ ఊరేగించారు. ఆ సమయంలో జైన్ వ్యాపారులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వారికి పుష్పాభిషేకం చేశారు. అదే విధంగా వాలాజలోని ధన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో భగవాన్ మహావీర్ సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు.


మహావీర్ చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

విషజ్వరంతో రెండు నెలల చిన్నారి మృతి

అన్నానగర్: మదురైలోని జైహింద్‌పురం చోలైయాళగుపురానికి చెందిన వినోద్‌కుమార్ (32)కు రెండు నెలల ముందు మగబిడ్డ జన్మించాడు. మంగళవారం చిన్నారికి విషజ్వరం సోకడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. జైహింద్‌పురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేలా ఆస్పత్రిలో అరుదైన చికిత్స

సాక్షి, చెన్నై : ఊపిరితిత్తుల్లో తీవ్రమైన క్షయ వ్యాధి కారణంగా 54 కిలోల బరువుతున్న ఓ మహిళ 37 కిలోల బరువుకు చేరింది. ఏడాది కాలంగా ఆమె పడుతున్న ఈ రుగ్మత నుంచి విముక్తి కల్పించే విధంగా రేలా వైద్యులు చికిత్స అందించారు. మంగళవారం స్థానికంగా రేలా ఆసుపత్రి డాక్టర్ జీమ్మీ ప్రభాకరన్ మాట్లాడుతూ, చెన్నై నంగనల్లూరుకు చెందిన కన్నమ్మాల్(53) గత ఏడాది కాలంగా తీవ్రమైన క్షయ వ్యాధి కారణంగా క్రమంగా బరువు తగ్గుతూ వచ్చారన్నారు. సరిగ్గా ఆహారం తీసుకోని కారణంగా శరీరంలో 3.5 శాతంగా ఉండాల్సిన ప్రోటీన్‌స్థాయి 1.3 శాతానికి పడిపోయిందన్నారు. బరువు భారీగా తగ్గుతూ రావడంతో శరీరంలో ప్రోటీన్ స్థాయి మెరుగుపరచడంతో పాటుగా హిమోగ్లోబిన్ స్థాయి, విటమిన్ బీ12 స్థాయి పెంపునకు , ఊపిరితిత్తులలోని తీవ్ర క్షయ తగ్గింపునకు ఆధునిక పద్ధతులను అనుసరించి చికిత్స చేశామన్నారు. ఈబీయూఎస్-టీబీఎన్ఏ , సెమీ ఇన్వాసివ్ ప్రక్రియ, యాంటీ ట్యూబర్ క్యూలోసిస్ ట్రీట్ మెంట్ ద్వారా ఆమె బరువు 54 కేజీలకు తిరిగి పెంచామని తెలిపారు. క్షయ వ్యాధికి సైతం పూర్తి స్థాయిలో చికిత్స అందించినట్లు వివరించారు.

చెపాక్‌లో ఎల్‌జీఎం చిత్ర యూనిట్ సందడి

తమిళ సినిమా: క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోని తొలి సారిగా చిత్రం నిర్మాణ రంగంలోకి ప్రవేశించి ధోనీ ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై తొలి ప్రయత్నంగా తమిళంలో ఎల్‌జీఎం అనే చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో నటుడు హరీష్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. నదియా, నటుడు బాబు తదితరులు ప్రధాని పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం ద్వారా రమేష్ తమిళ్ మణి దర్శకుడిగా పరిచయం అవుతూ ఆయనే సంగీతాన్ని అందిస్తున్నారు. ధోని సతీమణి సాక్షి ధోని నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఇటీవల ప్రారంభమై శరవేగంగా జరుపుకుంటోంది. మంచి ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో కూడిన వైవిధ్యభరిత ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఔట్ పుట్‌పై నిర్మాత సాక్షి ధోని సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, ధోని సారథ్యంలో సీఎస్‌కే క్రికెట్ (చెన్నై సూపర్ కింగ్స్) జట్టు సోమవారం చెన్నైలో జరిగిన ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. కాగా ఈ పోటీలను ప్రత్యక్షంగా తిలకించడానికి నటి కీర్తీ సురేష్, నటుడు శివకార్తికేయన్ తదితర సినీ ప్రముఖులు విచ్చేశారు. అదే విధంగా ఎల్‌జీఎం చిత్ర యూనిట్‌కు అనుమతి లభించింది. దీంతో వారు మ్యాచ్ సమయంలో సందడి చేశారు.


ఐపీఎల్‌లో ఎల్‌జీఎం చిత్ర యూనిట్

కోలీవుడ్ టాక్స్


నటి కృతి శెట్టి

సంజయ్ హీరోగా ఉప్పెన?


విజయ్ కొడుకు సంజయ్

తమిళ సినిమా: తెలుగు చిత్రం ఉప్పెన పేరుకు తగ్గట్టుగానే అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. కొత్త దర్శకుడు, కొత్త హీరో, కొత్త హీరోయిన్. అయినా చిత్రం సంచలన విజయం సాధించింది. వర్ధమాన నటుడు వైష్ణవ తేజ్ కథానాయకుడిగా పరిచయమైన ఈ చిత్రంలో నటి కృతి శెట్టి నైతిక ఎంట్రీ ఇచ్చింది. నటుడు విజయ్ సేతుపతి ప్రతినాయకుడు పాత్రలో నటించిన ఈ చిత్రానికి బుచ్చిబాబు దర్శకుడు. కాగా తాజాగా ఈ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో నటుడు విజయ్ వారసుడు సంజయ్‌ను హీరోగా నటింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ బాల నటుడిగా కొన్ని చిత్రాల్లో నటించినా, ప్రస్తుతం దర్శకత్వంపై మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. విదేశాల్లో దర్శకత్వ శాఖలో శిక్షణ పొందిన ఈయన ఇప్పటికే షార్ట్ ఫిలిమ్స్ రూపొందిస్తున్నాడు. త్వరలో ఓ చిత్రానికి దర్శకత్వం వహించే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఉప్పెన చిత్ర రీమేక్‌లో సంజయ్‌ని హీరోగా నటింప చేయడానికి ఓ ప్రముఖ నిర్మాత ప్రయత్నిస్తున్నట్లు తాజా సమాచారం. ఆ చిత్రంలో నటించిన కృతి శెట్టినే తమిళంలోనూ ఎంపిక చేయాలని భావిస్తున్నారని సమాచారం. ఈమె ఇప్పటికే ది వారియర్ చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చింది. అదేవిధంగా టాలీవుడ్ నటుడు నాగచైతన్య నటిస్తున్న ద్విభాషా చిత్రం కస్టడీలో కూడా ఈమెనే నాయకి. ఇకపోతే ఉప్పెన చిత్ర రీమేక్‌లో నటించడానికి సంజయ్ ఊ అంటాడా? ఊహూ అంటాడా? అన్నది తెలియాల్సి ఉంది. దీనిపై స్పష్టత రావాలంటే మరి కొద్ది రోజులు ఆగాల్సిందే.

తైవాన్‌లో ఇండియన్ -2 షూటింగ్

తమిళ సినిమా: కమలహాసన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ఇండియన్ -2. శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ కలిసి నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ఇది. నటి కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సిద్ధార్థ్, సముద్రఖని, బాబిసింహా ఢిల్లి గణేష్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా కాళిదాసు జయరాం ఇండియన్ -2 చిత్రంలో వచ్చి చేరారు. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఇటీవల చెన్నైలో నిర్వహించారు. తాజాగా ఇండియన్- 2 చిత్రం యూనిట్ తైవాన్‌కు చేరుకుంది. అక్కడ చిత్ర టైటిల్‌తో కూడిన భారీ బెలూన్ ఎగురవేస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాగా తైవాన్‌లో ఇండియన్ -2 చిత్రానికి సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను 8 రోజుల పాటు చిత్రీకరించనున్నట్లు సమాచారం. అనంతరం చిత్ర యూనిట్ దక్షిణాఫ్రికాకు వెళ్లనున్నట్లు, అదే ఇండియన్ 2 చిత్ర చివరి షెడ్యూల్ అని సమాచారం. తదుపరి చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్‌లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇండియన్ చిత్రం సంచలన విజయం సాధించడంతో ఇండియన్ -2 చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే విధంగా చిత్ర షూటింగ్ లేటైనా శంకర్ లేటెస్ట్‌గా తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.


తైవాన్ విమానాశ్రయంలో కమల్

త్వరలో వస్తున్నా!

తమిళ సినిమా: పేరుకు తగ్గట్టుగానే అందాల నిధి నటి నిధి అగర్వాల్. మొదట్లో అందాల పోటీల్లో కిరీటాన్ని గెలుచుకుని ఆ తరువాత నటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. అది ఈమె బాలీవుడ్‌లో మున్నా మైఖేల్ అనే చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో అవకాశాలు వరించాయి. తెలుగులో ఇస్మార్ట్ శంకర్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రంతో నటించారు. ఇక తమిళంలో హీరోయిన్లు లక్కీ హీరోగా పేరొందిన జయం రవి సరసన భూమి చిత్రం ద్వారా పరిచయమయ్యారు. ఆ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నా, ఓటీటీలో విడుదల కావడం నిధి అగర్వాల్‌ను నిరాశపరిచే అంశమే. దాన్ని అధిగమించి సంచల నటుడు శింబు సరసన ఈశ్వరన్ చిత్రంలో గ్రామీణ యువతిగా నటించి మెప్పించారు. ఇటీవల నటుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు జంటగా కలగతలైవన్ చిత్రంలో నటించారు. ఇందులో ఒక ప్రేమికురాలిగా నటనకు అవకాశం ఉన్న పాత్రలో చక్కగా నటించి ప్రశంసలు అందుకున్నారు. అయినప్పటికీ నటి నిధి అగర్వాల్ రావాల్సిన ఫేమ్, నేమ్ రాలేదనే చెప్పాలి. మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. అందుకోసం దైవానుగ్రహం కోసం ఇటీవల దేవాలయాలను దర్శించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాను రాణిస్తున్నారు. అచంచలమైన విశ్వాసాన్ని మాత్రం నిధి అగర్వాల్ కోల్పోలేదు. త్వరలోనే మళ్లీ వస్తున్నా అని తాజాగా ట్విట్టర్లో పోస్ట్ చేశారు. తెలుగులో పవన్ కల్యాణ్ సరసన నటిస్తున్న హరి హర వీరమల్లు అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తరువాత నిధి అగర్వాల్ మరో స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.


నటి నిధి అగర్వాల్

దర్బార్ ఫ్లాప్‌కు కారణం అదే..!

తమిళ సినిమా: కోలీవుడ్ టాప్ దర్శకుల్లో ఏఆర్ మురుగదాస్ ఒకరు. అజిత్ కథానాయకుడిగా దీనా చిత్రంతో తన ప్రయాణాన్ని ప్రారంభించి ఆయన వరుసగా పలు చిత్రాలతో విజయపథంలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఏఆర్ మురుగదాస్‌ను ఒకసారిగా డౌన్ ఫాల్ చేసిన చిత్రం దర్బార్. ఆ చిత్ర కథానాయకుడు రజనీకాంత్. భారీ అంచనాల మధ్య విడుదలైన దర్బార్ చిత్రం ప్రేక్షకులను పూర్తిగా నిరాశపరిచింది. దీంతో మూడేళ్లుగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ మెగా ఫోన్‌కు దూరంగా ఉండాల్సిన పరిస్థితి. దర్బార్ దెబ్బతో తదుపరి విజయ్ హీరోగా చేయాల్సిన చిత్రం వెనక్కి వెళ్లిపోయింది. కాగా ఇటీవల ఓ భేటీలో రజనీకాంత్ తో చేసిన దర్బార్ చిత్రం ఫ్లాప్ కావడానికి కారణాన్ని సుమారు మూడేళ్ల తర్వాత ఏఆర్ మురుగదాస్ బయటపెట్టారు. రజనీకాంత్‌ను డైరెక్ట్ చేసే అవకాశం తనకు ఫిబ్రవరి నెలలో వచ్చిందనీ, జూన్ నెల ముంబాయిలో వర్షాల సీజన్ కావడంతో అలా చిత్ర షూటింగును హడావుడిగా పూర్తి చేయాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. ఎందుకంటే ఆగస్టులో రజనీకాంత్ రాజకీయ పార్టీని ప్రారంభించనున్నట్లు చెప్పారన్నారు. తాను రజనీకాంత్‌కు వీరాభిమానిని. దీంతో ఆయనతో చిత్రాలు చేసే అవకాశాన్ని ఏ కారణంగానూ వదులుకోకూడదని భావించానన్నారు. రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధమవడంతో ఆ సమయంలో దర్బారే ఆయన చివరి చిత్రం అనే ప్రచారం జరిగిందన్నారు. దీంతో ఫిబ్రవరిలో రజనీకాంత్ చిత్రాన్ని దర్శకత్వం వహించే అవకాశం రావడం మార్చి నెలలో షూటింగ్ ప్రారంభించి జూన్ నెలకంతా చిత్రాన్ని పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో ఎలాగైనా రజనీకాంత్ చిత్రం చేసి హిట్ కొట్టాలని భావించానని, అయితే సరైన ప్రణాళిక లేకపోవడంతో దర్బార్ చిత్రం ఫ్లాప్ అయ్యిందని చెప్పారు. సాధారణంగా షూటింగ్‌కు ముందు ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలకు చాలా సమయం అవసరం అవుతుందన్నారు. అది దర్బార్ చిత్రానికి లేకపోయిందని మురుగదాస్ పేర్కొన్నారు.


రజనీకాంత్‌తో దర్శకుడు ఏఆర్ మురుగదాస్

క్లుప్తంగా

ఉరి వేసుకుని నర్సు ఆత్మహత్య

అన్నానగర్: అన్నూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం ఒక నర్సు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శివగంగై జిల్లాలోని నటరాజన్ కోట ప్రాంతానికి చెందిన మారియప్పన్ కుమార్తె కావ్య (24) బీఎస్సీ నర్సింగ్ చదివింది. ఈమె అన్నూరు – కోయంబత్తూరు రోడ్డులోని ఎన్ఎం ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఆసుపత్రికి చెందిన హాస్టల్‌లో ఉంటోంది. మంగళవారం ఆమె ఆసుపత్రి ఆవరణలోని డెలివరీ వార్డులో ఉరి వేసుకుని మృతి చెందింది. గమనించిన సహోద్యోగులు అన్నూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రైవేటు ఆసుపత్రి సిబ్బందిని విచారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రియుడితో వెళ్లిన వివాహిత బలవన్మరణం

వేలూరు: భర్త, పిల్లలను వదిలి ప్రియుడితో వెళ్లిన మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపత్తూరు సమీపంలోని అత్తికుప్పం గ్రామానికి చెందిన కూలీ కార్మికుడి భార్య ఇందుమది(40)కి కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఆమె భవన నిర్మాణ పనులకు వెళ్లే సమయంలో రఘు (35) అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరిద్దరూ కుటుంబ సభ్యులను వదిలి పెట్టి కోవైలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. ఇద్దరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తిరుపత్తూరు పోలీసులు గాలించి గత వారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం పోలీసులు చర్చలు జరపగా రఘు భార్యతో కలిసి వెళ్లాడు. ఇందుమది పుట్టింటికి వెళ్లింది. సోమవారం ఉదయం నుంచి ఇందుమది కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమె మంగళవారం ఉదయం సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహంగా కనిపించింది. పిల్లలు, ప్రేమగా చూసుకున్న భర్తను వదిలి పెట్టి వెళ్లినా ప్రియుడు భార్యతో కలిసి ఉండడానికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

వాలాజలో బైకును ఢీకొన్న లారీ దగ్ధం

– యువకుడి మృతి



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేలూరు: చెన్నై నుంచి బెంగళూరు వైపునకు వెళుతున్న లారీ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రాణిపేట జిల్లా వాలాజ వద్ద జాతీయ రహదారిలో బైకును ఢీకొంది. బైకు నుంచి మంటలు రావడంతో లారీ ముందు భాగం అంటుకుని దగ్ధమైంది. వాహనదారులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ వీలుకాలేదు. బైకులో వెళుతున్న యువకుడు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. అతని వివరాలు తెలియరాలేదు. రాణిపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కావేరి పాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుపరాడ్‌తో కొట్టి ఆటో డ్రైవర్ హత్య

– కారు డ్రైవర్ అరెస్టు

అన్నానగర్: ఇనుప రాడ్‌తో కొట్టి ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని సెమ్మంజేరి సునామి క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన బాలు (50) ఆటో డ్రైవర్. ఇతని పక్కింటిలో నివసిస్తున్న తనిగైవేల్ (38) కారు డ్రైవర్. మద్యం మత్తులో ఇద్దరూ తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన తనిగైవేల్ ఇంటిలో పడి వున్న ఇనుప రాడ్‌ను తీసుకుని వచ్చి బాలుపై దాడి చేశాడు. బాలు తలకు బలమైన గాయమై రక్తపు మడుగులో పడిపోయాడు. ఇరుగుపొరుగు వారు బాలును రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతను మంగళవారం మృతి చెందాడు. సెమ్మంజేరి పోలీసులు హత్య కేసు నమోదు చేసి తనిగైవేల్‌ను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసుకుని వృద్ధుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: కరూర్ మండలంలో భార్య మృతి చెందిన దుఃఖంతో వృద్ధుడు గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరూర్ వయాపురి నగర్‌కు చెందిన రామలింగం (73) భార్య కొన్ని నెలల క్రితం మృతి చెందారు. దీంతో రామలింగం ఆవేదన చెందాడు. ఈ క్రమంలో గత 30వ తేదీ ఇంటిలో ఎక్కువ మోతాదులో నిద్ర మాత్రలను తిని బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్పృహతప్పి పడిన అతన్ని బంధువులు కరూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్సకు చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కరూర్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తిరుత్తణిలో కావళ్ల సందడి

- పంగుని ఉత్తరం కోలాహలం
- మురుగన్‌కు పాలాభిషేకం



తిరుత్తణి కొండ ఆలయంలో నెమలి కావళ్ల సందడి

తిరుత్తణి: పంగుని ఉత్తరం ఉత్సవం సందర్భంగా తిరుత్తణి ఆలయంలో మంగళవారం నెమలి కావళ్ల సందడి నెలకొంది. భక్తులు తీసుకొచ్చిన పాలతో ఉత్సవర్లకు అభిషేకం చేశారు. భక్తుల హారోంహర నామస్మరణతో తిరుత్తణి ఆలయం దద్దరిల్లింది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పంగుని ఉత్తరం ఉత్సవం సందర్భంగా మంగళవారం వేకువజామున మూలవర్లకు విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష పూజలు చేపట్టి బంగారు, వజ్రాభరణాలతో అలంకరించారు. చెన్నైలోని మన్నడి, తిరువెట్రియూరు, ఆవడి, అంబత్తూరు, గిండి తదితర ప్రాంతాలకు చెందిన మురుగన్ ఆధ్యాత్మిక బృందం సభ్యులు నెమలి కావళ్లు, పాల బిందెలతో పాదయాత్రగా తిరుత్తణి చేరుకుని శరవణ పుష్కరిణి వద్ద తొలి మెట్టుకు పూజలు చేపట్టి కొండ ఆలయం చేరుకున్నారు. మురుగన్ ఆధ్మాత్మిక పాటలు, నెమలి కావళ్ల సందడి చేశారు. మహిళలు పాల బిందెల ఊరేగింపుతో కొండ ఆలయం పులకించింది. సర్వదర్శనం, రూ.100 క్యూలైన్లు నిండాయి. మూడు నుంచి ఐదు గంటలు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. అదే సమయంలో మహిళలు తీసుకొచ్చిన పాలతో ఉత్సవర్లకు అభిషేకం చేశారు. కావడి మండపంలో కొలువుదీరిన ఉత్సవర్లకు విభూది, తాటిబెల్లం, పంచామృతంతో అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారు వెండి నెమలి వాహనంలో కొలువై మాడ వీధుల్లో విహరించారు. ఆలయ జాయింట్ కమిషనర్ విజయ ఆధ్వర్యంలో ఉత్సవ వేడుకల ఏర్పాట్లను విజయవంతంగా చేపట్టారు.



సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు పాలాభిషేకం



కావళ్లతో నాట్యం చేస్తున్న భక్తులు



పాలబిందెలతో కొండ ఆలయానికి చేరుకుంటున్న మహిళలు



భక్తజనం

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కలెక్టర్‌కు వినతి

తిరువళ్లూరు: జిల్లా కేంద్రమైన తిరువళ్లూరులో అదనపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రయాణికుల సంఘం నేతలు కోరారు. వారు మంగళవారం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తిరువళ్లూరు రైల్వేస్టేషన్ నుంచి రోజుకు సుమారు లక్ష మంది ప్రయాణికులు వేర్వేరు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఇక్కడి నుంచి రోజుకు 180 రైలు సర్వీసులు, 22 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ రైలు కోసం అరక్కోణం లేదా చెన్నై సెంట్రల్‌కు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో వ్యయప్రయాసలతోపాటు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. తిరువళ్లూరులో అన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని ఏళ్ల తరబడి ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకునే నాథుడులేడన్నారు. తిరువళ్లూరులో కనీసం మరో 9 ఎక్స్‌ప్రెస్‌లు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించడానికి వచ్చిన సంఘం నేతలు

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

తిరుత్తణి: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా డీఎంకే ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పేర్కొన్నారు. సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకల్లో భాగంగా తిరువలంగాడు వెస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో చివ్వాడ, నెమలి, నెడుంబరం, రామాపురం గ్రామాల్లో డీఎంకే సభలు నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి రాజేంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు స్టాలిన్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ వక్త పొన్నేరి శివ, నిర్వాహకులు యువరాజ్, మాజీ చైర్మన్ ఏలుమలై పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

విద్యార్థులను పరిశోధనల్లో ప్రోత్సహించాలి

కొరుక్కుపేట: విద్యార్థులు పరిశోధనలు చేసేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ ముత్తమిళ్ సెల్వన్ తెలిపారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీతో ఆస్ట్రేలియాకి చెందిన లా ట్రోబ్ విశ్వవిద్యాలయం మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన, విద్యా వ్యూహాన్ని మరింత పటిష్టం చేసేందుకు వీలుగా చేపట్టిన ఒప్పందంపై ఎస్ఆర్ఎం వైస్ చాన్సులర్ ముత్తమిళ్ సెల్వన్, లా ట్రోబ్ యూనివర్సిటీ వైస్-చాన్సలర్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జాన్ దేవార్ సంతకాలు చేసి మార్చుకున్నారు. ప్రొఫెసర్ జాన్ దేవార్ మాట్లాడుతూ ఎస్ఆర్ఎంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెండు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని స్థాపించి విద్యార్థులను పరిశోధనల్లో ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ ముత్తమిళ్ సెల్వన్ మాట్లాడుతూ ప్రపంచంలో నెంబర్ వన్ విశ్వవిద్యాలయమైన లా ట్రోబ్ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేసే అవకాశం కలిగినందుకు ధన్యవాదాలు తెలిపారు.



ఎస్ఆర్ఎంతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఆస్ట్రేలియా వర్సిటీ ప్రతినిధులు

తుంబురుతీర్థ ముక్కోటిపై సమీక్ష

తిరుమల: తిరుమలలో బుధ, గురువారాల్లో తుంబురుతీర్థ ముక్కోటిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఏర్పాట్లపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పీఏసీ 4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం టీటీడీ విజిలెన్స్, తిరుమల పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- తుంబురుతీర్థానికి బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గురువారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు భక్తులను అనుమతిస్తారు.
- తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉన్న నేపథ్యంలో గుండె సమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించరు.
- భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదు.
- పాప వినాశనం వద్ద పార్కింగ్ సౌకర్యం లేదు. అందువల్ల ప్రైవే ట్ ట్యాక్సీలు, వాహనాలను అనుమతించరు. ఆర్టీసీ బస్సుల్లో మా త్రమే భక్తులను అనుమతిస్తారు.
- పోలీసు, అటవీశాఖలు, టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు సమన్వయంతో పాపవినాశనం నుంచి తుంబురు తీర్థం వరకు అక్కడక్క డా భద్రతా సిబ్బందిని నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మునిరామయ్య, వీజీవో బాలిరెడ్డి, ఇతర విజిలెన్స్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శుకబ్రహ్మాశ్రమంలో 25వ ఆరాధనోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం ఘనంగా 25వ ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో కళాశాలను స్థాపించి ఎంతోమందికి విద్యాప్రకాశనందగిరిస్వామి ఎంతోమందికి విద్యాదాత అయ్యారన్నారు. ఆయనను ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపనందగిరిస్వామి మాట్లాడుతూ సకల లోకానికి గీతా మకరందాన్ని అందించి జీవుడికి భగవంతుని చేరుకునే మార్గాన్ని ఉపదేశించిన మహనీయుడు విద్యాప్రకాశనందగిరి స్వామి అని అన్నారు. ఆశ్రమ ఉత్తరాధికారి సంపూర్ణనందగిరిస్వామి, ఆర్డీఓ రామారావు, పాలకమండలి సభ్యులు సునీత, రమాప్రభ, సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, చింతామణి పాండు, అజయ్‌కుమార్, రత్నంరెడ్డి పాల్గొన్నారు.

మద్యం, మాంసం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, మాంసం

తిరువళ్లూరు: మహావీర్ జయంతి సందర్భంగా అక్రమంగా నిల్వ వుంచి విక్రయిస్తున్న మద్యం, మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మహావీర్ జయంతి సందర్భంగా తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, మాంసం విక్రయాలను నిలిపివేయాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ఆదేశించారు. తిరువళ్లూరు పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో మాంసం, మద్యం విక్రయిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజ్యలక్ష్మి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు సమాచారం అందింది. వారు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రెండు దుకాణాలకు సీజ్ చేసి మద్యం, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా అగ్నిగుండం ఉత్సవాలు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలో ప్రసిద్ధి చెందిన బన్నారి అమ్మన్ ఆలయంలో మంగళవారం అగ్నిగుండం ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. బన్నారి మారియమ్మన్ ఆలయంలో ప్రతి ఏటా పంగుని నెలలో అగ్నిగుండం ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఈ ఏడాది గత నెల 20 తేదీన పూల చాటింపుతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సత్యమంగళం పరిసర గ్రామాల్లో వారం రోజులుగా బన్నారి అమ్మన్‌ను ఊరేగిస్తున్నారు. 28న పందిరి గుంజ పాతే కార్యక్రమం చేపట్టారు. ఆ రోజు రాత్రి భక్తులు కంబ నృత్యం చేశారు. ఈ వేడుకల్లో ముఖ్య ఉత్సవమైన అగ్నిగుండం మహోత్సవం మంగళవారం తెల్లవారిజామున ప్రారంభమైంది. తెల్లవారుజామున 2.50 గంటలకు బన్నారి అమ్మవారిని అలంకరించి మేళ, తాళాలతో ఊరేగించారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పూజలు చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు వేల సంఖ్యలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమైన అగ్నిగుండ ప్రవేశం మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. రైతులు తమతో పాటు జంతువులను కూడా గుండంలో తోలుకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం ఐజీ మురుగన్, భవాని సాగర్ ఎమ్మెల్యే బాన్నారి, డాక్టర్ కృష్ణమూర్తి తదితర ప్రముఖులు మొక్కులు తీర్చుకున్నారు.

రాయపేటలో కళాశాల విద్యార్థుల మధ్య ఘర్షణ

తిరువొత్తియూరు: చెన్నై రాయపేటలో కళాశాలలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. చెన్నై రాయపేట న్యూ కళేజీ విద్యార్థుల సంఘం అధ్యక్షుడి పదవిలో వున్న ఒకరిపై 10 మంది విద్యార్థులు కలిసి దాడి చేశారు. ఆ సమయంలో వారిలో కొందరిని పట్టుకుని కళాశాల ప్రిన్సిపాల్ వద్ద అప్పగించారు. దీని గురించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కళాశాల విద్యార్థుల సంఘం నాయకుడి పదవికి పోటీ చేయడానికి సంబంధించి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్టు తెలిసింది. పోలీసులు ముగ్గురు విద్యార్థులను పట్టుకుని పోలీసులు విచారణ చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న కెమెరాలలోని దృశ్యాల ఆధారంగా విచారణ చేస్తున్నారు. ముగ్గురు విద్యార్థులను అరెస్టు చేసి వారిలో ఇద్దరిని జువైనల్ హోమ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

తండ్రి మృతి చెందినా పరీక్షకు హాజరైన ప్లస్-2 విద్యార్థిని

అన్నానగర్: కడలూరులో సోమవారం తన తండ్రి మృతి చెందాడన్న బాధను సైతం లెక్కచేయకుండా విద్యార్థిని ప్లస్-2 పరీక్ష రాసింది. గత నెల 13న ప్లస్-2 విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. చివరి రోజైన సోమవారం కెమిస్ట్రీ, అకౌంట్స్, జాగ్రఫీ సబ్జెక్టులకు పరీక్ష జరిగింది. కడలూరుకు చెందిన ఒక విద్యార్థిని తన తండ్రి మరణించిన బాధను సైతం లెక్కచేయకుండా పరీక్ష రాసింది.

కడలూరు పాత వండిపాళెనికి చెందిన జ్ఞానవేల్ (45) బొమ్మల తయారీదారుడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. 2వ కుమార్తె గిరిజ (17) కడలూరులోని తిరుపత్తిరి పులియూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్-2 చదువుతోంది. ప్రస్తుతం పబ్లిక్ పరీక్ష రాసిన గిరిజ సోమవారం జరగాల్సిన కెమిస్ట్రీ పరీక్షకు చదువుతోంది. సోమవారం ఉదయం జ్ఞానవేల్ అనారోగ్యానికి గురికావడంతో బంధువులు కడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతను మృతిచెందాడు. విషయం విన్న గిరిజ తట్టుకోలేకపోయింది. చివరి పరీక్ష ఉండడంతో తాను వచ్చే వరకు తండ్రికి అంత్యక్రియలు జరపవద్దని బంధువులను కోరింది. బంధువులు మంగళవారం ఉదయం గిరిజనుల తిరుపతిరిపులియూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లారు. అక్కడ కెమిస్ట్రీ పరీక్ష రాసిన అనంతరం జ్ఞానవేల్ మృతదేహాన్ని పూడ్చి పెట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో

వేలూరు: ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో తాగునీటి సమస్య నెలకొందని, వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపంలోని సాలైకడు గ్రామస్తులు మంగళవారం రాస్తారోకో చేశారు. గ్రామంలో సుమారు వందకు పైగా కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ 20 రోజుల క్రితం కాలిపోయింది. దానికి మరమ్మతులు చేయించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోలేదు. నీరు లేక పంటలు ఎండిపోవడంతో పాటు తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు మంగళవారం ఉదయం వందవాసి –మేల్ మరవత్తూరు రోడ్డులో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న వందవాసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు.



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

శాటిలైట్ ఫోన్‌తో పట్టుబడిన యువకుడు

అన్నానగర్: రామనాథపురం జిల్లా తీర ప్రాంతంలో శాటిలైట్ ఫోన్‌ను వాడుతున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. తీర ప్రాంతంలో సోమవారం శాటిలైట్ ఫోన్ సిగ్నల్ నమోదుకావడంతో పోలీసు ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. రామేశ్వరం సమీపంలోని పాంబన్ ప్రాంతం నుంచి సిగ్నల్ వస్తున్నట్లు గుర్తించి పాంబన్ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి సిగ్నల్ వచ్చిన పాంబన్ సమీపంలోని కల్మడం ప్రాంతానికి వెళ్లి తనిఖీలు చేశారు. అప్పుడు ఆ ప్రాంతంలో నివాసం వుంటున్న జాన్‌పాల్ (24) శాటిలైట్ ఫోన్‌తో పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి శాటిలైట్ ఫోన్ స్వాధీనం చేసుకుని పాంబన్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేపట్టారు. శ్రీలంక కొలంబో, ముగత్తువారం, 70/9ఎ రాక్ హౌస్ లైన్ చిరునామాలో సుందర సెల్వం కనిమల్ (33) పేరుతో శాటిలైట్ ఫోన్ కొనుగోలు చేసినట్లు తెలిసింది. పోలీసులు శాటిలైట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని జాన్‌పాల్‌ను విచారణ కొనసాగిస్తున్నారు.

పళణిలో ఘనంగా రథోత్సవం

తిరువొత్తియూరు: దిండుగల్ జిల్లా పళణి ఆలయంలో మంగళవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామికి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్న వెండి రథంపై వేపండితులు సుబ్రహ్మణ్య స్వామిని అధిష్టింపచేసి నాలుగు మాడ విధుల్లో ఊరేగించారు. స్థానికుల పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

తెప్పపై రామచంద్రమూర్తి అభయం



తెప్పపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు రెండో రోజైన మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి వారు రామచంద్ర పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్ర నామార్చన చేపట్టారు. 8 నుంచి 9.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు సీతారామలక్ష్మణులు ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకున్నారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పను సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి అధిరోహించి భక్తులు రామనామస్మరణలు చేస్తుండగా పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు అందించి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మారుతి ప్రసాద్, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

11న రాష్ట్ర స్థాయిలో పూలే జయంతి నిర్వహణ

సాక్షి, అమరావతి: మహాత్మా జ్యోతిబా పూలే 197 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ సంచాలకుడు పి.అర్జునరావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోను స్థానికంగా అధికార కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్‌లను ఆదేశించారు.

శరవేగంగా సీఆర్‌డీఏ ప్లాట్ల రిజిస్ట్రేషన్

- మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సీఆర్‌డీఏ కమిషనర్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములిచ్చిన రైతుల కోసం కేటాయించిన 63,462 ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేస్తున్నట్టు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ చెప్పారు. మార్చి 22 నాటికి 42,524 ప్లాట్లను రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి అప్పగించినట్టు తెలిపారు. ఇంకా 20,938 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం యూనిట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని.. రైతులు ఇందుకోసం మధ్యవర్తులను ఆశ్రయించవద్దని కోరారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన వారు సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అంశంలో ఎవరైనా ఇబ్బంది పెడితే ఉద్యోగి పేరుతో సహా సీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే.. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో యజమాని తన భూమికి సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. ఒకవేళ పత్రాలను పోగొట్టుకున్నట్లయితే చట్టంలో పేర్కొన్న నిబంధనల మేరకు అఫిడవిట్ సమర్పించాలని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ల కోసం నియమితులైన అధికారులు

పి.సాయిబాబు: కృష్ణాయపాలెం, నవులూరు-1, 2, కురగల్లు-1, 2 (నీరుకొండ), నిడమర్రు-1, 2

వి. శైలజ: ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, మల్కాపురం, గన్నవరం

ఎస్.విజయలక్ష్మి: అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, నెక్కల్లు, నేలపాడు, తుళ్లూరు-1, 2, అనంతవరం

సాయి శ్రీనివాస నాయక్: ఐనవోలు, శాఖమూరు, వెలగపూడి, వెంకటపాలెం, మందడం-1, 2

కె.స్వర్ణమేరి: రాయపూడి-1, 2, కొండమరాజుపాలెం

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

అధికారులకు మరిన్ని సూచనలు జారీచేసిన ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్



సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి మంగళవారం అధికారులకు పలు సూచనలు జారీచేశారు. పరీక్ష కేంద్రాల్లో అక్రమాలు, అవకతవకలు జరిగితే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, సి-సెంటర్ కస్టోడియన్‌లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

- పరీక్ష కేంద్రాలన్నీ నో మొబైల్ జోన్లుగా ప్రకటించిన నేపథ్యంలో పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ మొబైల్ ఫోన్ ఇంట్లోనే ఉంచి రావాలి. లేదా సెంటర్‌లో పోలీస్ పికెట్ వద్ద అప్పగించాలి.
- ఒకసారి పరీక్ష కేంద్రంలోకి వచ్చిన సిబ్బంది పరీక్ష ముగిసేవరకు బయటికి రాకూడదు. అటెండర్లు, ఇతర సహాయకులు కూడా టీ, శీతల పానీయాలు వంటి అవసరాలకు కూడా బయటకు రాకూడదు.
- పరీక్ష విధులు లేని ఉపాధ్యాయులు పరీక్ష జరిగే సమయంలో ఆ పరిసరాల్లో ఉండకూడదు.
- పరీక్ష కేంద్రాలుగా ఉన్న కె.జి.బి.వి., రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులు పరీక్ష విధులు లేకపోతే ఆ సమయంలో పాఠశాలలో ఉండకూడదు.
- పరీక్ష కేంద్రంలో ప్రైవేట్ వ్యక్తులు ఎవరు ఉండకూడదు.
- ప్రశ్నపత్రాలు, వాటిపై వదంతులు వాట్సాప్ గ్రూప్‌లలోగానీ, సామాజిక మాధ్యమాల్లోగానీ ప్రచారం చేయకూడదు.
- చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షకు హాజరుకాని అభ్యర్థుల ప్రశ్నపత్రాలను, మిగిలిన ప్రశ్నపత్రాలను ఉదయం 10 గంటలలోపు అకౌంట్ రాసి సీల్ చేయాలి.
- ఈ నిబంధనలు అతిక్రమించిన వారికి పరీక్షల చట్టం 25/97 ప్రకారం ఏడేళ్ల వరకు జైలుశిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. అవకతవకలు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఇంటర్ బోర్డు ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. మార్చి 15న ప్రారంభమైన ఈ పరీక్షలకు మొదటి, రెండు సంవత్సరాలకు సంబంధించి మొత్తం 10,04,301 మంది హాజరయ్యారని, మార్చి 20 నుంచి మూల్యాంకనం కూడా ప్రారంభమైనదని బోర్డు కార్యదర్శి ఎం. వి.శేషగిరిబాబు తెలిపారు.

పరీక్షల్లో 11 మంది డిబార్

సాక్షి, అమరావతి: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో తొలిరోజు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 11 మందిని డిబార్ చేసినట్లు ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. పదో తరగతి తెలుగు పరీక్ష రాస్తుండగా తూర్పు గోదావరి జిల్లాలో ఆరుగురు, ఇంటర్ తెలుగు పరీక్ష రాస్తూ మచిలీపట్నంలో ఒకరు, శ్రీకాకుళంలో ఒకరు, పల్నాడు జిల్లాలో ముగ్గురిని డిబార్ చేసినట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రామోజీ అతీతుడా!?

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమాలు వెలుగుచూస్తున్నాయన్నారు. మార్గదర్శిని రామోజీ ఇష్టమొచ్చినట్లు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇక మార్గదర్శిలో తప్పు జరిగిందని ఎవరైనా ఫిర్యాదు ఇచ్చారా అని ప్రశ్నిస్తున్నారని.. ఆర్థిక నేరాల్లో ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా చర్యలుంటాయన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ గోపాలకృష్ణారెడ్డి పదవిలో ఉండగానే మార్గదర్శి వ్యవహారాన్ని తప్పుబట్టారన్నారు. అందులో జరిగే అక్రమాలపై కర్ణాటక నుంచి ఫిర్యాదు వచ్చిందని తన ఆత్మకథలో ఆయన పేర్కొన్నట్లు గుర్తుచేశారు.

సీఏలు నన్ను దూషించడం తగదు

'మార్గదర్శి కేసులో బ్రహ్మయ్య అండ్ కో కంపెనీకి చెందిన ఓ సీఏను అరెస్టుచేస్తే అందుకు నేను బాధ్యుడినా? అది అందరు సీఏలపై దాడి ఎలా అవుతుంది? అరెస్టులకు సంబంధించి విజయవాడలో సీఏలు సమావేశం పెట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటంలేదని దూషించడం తగదు'.. అని ఉండవల్లి అన్నారు. సీఏలు ప్రభుత్వానికి ప్రతినిధుల్లాంటి వారని, వాళ్లు తప్పుచేస్తే శిక్షలు ఉంటాయని గుర్తుచేశారు. సత్యం రామలింగరాజు కేసులో సీఏలను అరెస్టుచేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ, అప్పట్లో సీఏలు ఇలా మీటింగ్ పెట్టి విమర్శించిన దాఖలాల్లేవన్నారు. సీఏలు మీటింగ్ పెట్టి ఆహ్వానిస్తే వెళ్లి రామోజీ తప్పుచేశారన్న తన వాదన నిజమో? కాదో అని వివరిస్తానన్నారు.

నా కేసు తప్పని జస్టిస్ రమణతో చెప్పించండి

ఇక మార్గదర్శిపై తాను వేసిన కేసు తప్పని సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రమణతో చెప్పిస్తే చాలని ఉండవల్లి అన్నారు. రామోజీరావు చేసింది తప్పాకాదా? అని మాత్రమే సమాధానమివ్వాలన్నారు. తప్పని తేలితే రూపాయి ఫైన్ వేసినా సంతోషమేనని, మిగిలిన చిట్‌ఫండ్‌లకు భయం ఉంటుందన్నారు. సెక్షన్ 477-ఏ ప్రకారం అకౌంట్స్ తారుమారు చేస్తే శిక్ష తప్పదని.. రామోజీరావుకు డిపాజిటర్ల పేర్లు విడుదల చేయాలని ఉండవల్లి డిమాండ్ చేశారు. అవినీతిని ప్రశ్నిస్తే రామోజీరావు పత్రికా స్వేచ్ఛపై దాడిగా చెప్పుకుంటారని.. అలాంటప్పుడు చట్టసభల్లో పత్రికాధిపతికి చట్టాలు వర్తించవని చట్టం తీసుకురావాలని సలహా ఇచ్చారు.

జగన్‌ను విమర్శిస్తే విశ్వాస ఘాతకుడినే..

తనకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ రెండు సమానమేనని ఆయనన్నారు. రాష్ట్ర విభజన అంశంపై కోర్టులో కేసు వేయాలని టీడీపీ ప్రభుత్వ హయాంలో అడిగితే పట్టించుకోలేదని.. అదే విషయమై ఇప్పుడు కోరితే తనను సపోర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన కేసులో ఇంప్లీడ్ అవుతూ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఎవరూ చేయలేని పని జగన్ చేశారని.. అలాంటప్పుడు కేసు తేలేవరకైనా కృతజ్ఞత లేకుండా ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు విమర్శించాలని ఆయన ప్రశ్నించారు. అలా చేస్తే తాను విశ్వాస ఘాతకుడినవుతానన్నారు.

రాష్ట్ర వృద్ధి, అప్పులపై విషప్రచారం

మార్చి 31, 2023 నాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,64,725 కోట్లే

- ప్రతిపక్షాల ప్రకటనలు, కొన్ని పత్రికల్లోని కథనాలు పచ్చి అబద్ధాలు: 'బుగ్గన' ఫైర్



సాక్షి, అమరావతి: రాష్ట్ర వృద్ధి, అప్పులపై ప్రతిపక్షాల పత్రికా ప్రకటనలు, కొన్ని పత్రికల్లో రాస్తున్న కథనాలన్నీ పచ్చి అబద్ధాలేనని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కొట్టిపారేశారు. టీడీపీ నేతలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సరైన అవగాహనలేక నోటికొచ్చినట్లు అసత్యాలు వల్లించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. దుష్ప్రచారాలతో ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కన్నా టీడీపీ హయాంలోనే అప్పులు రెండింతలు పెరిగాయని బుగ్గన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

టీడీపీ హయాంలోనే అప్పులు ఎక్కువ

నిజానికి.. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.2,71,797 కోట్లు. మార్చి 31, 2023 నాటికి రాష్ట్రం అప్పు రూ.4,36,522 కోట్లు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,64,725 కోట్లు మాత్రమే. అలాగే, అప్పు పెరుగుదలని పోల్చిచూస్తే, గత ప్రభుత్వ హయాం 2014–19లో కేంద్ర ప్రభుత్వ అప్పు సగటు వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 9.89 శాతం పెరిగినప్పుడు, మన రాష్ట్ర అప్పు 19.02 శాతం పెరిగింది. అంటే, టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం రెండింతల అప్పులు చేసింది. అదే వైఎస్సార్‌సీపీ హయాంలో కేంద్రం అప్పు సగటు వార్షిక వృద్ధిరేటు 14.37శాతం పెరిగినప్పటికీ రాష్ట్ర అప్పు మాత్రం సగటు వార్షిక వృద్ధి 13.55 శాతమే పెరిగింది. పైగా రాష్ట్ర ప్రభుత్వం కరోనాను ఎదుర్కొంటూ సంక్షేమ పథకాలు కొనసాగించడానికే చేసింది.

తలసరి అప్పులపై యనమల తప్పుడు లెక్కలు

ఇక తలసరి అప్పు రూ.5.5 లక్షలని, అప్పులపై సంవత్సరానికి రూ.లక్ష కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని యనమల చెప్పేవి తప్పుడు లెక్కలు. 2011 జనాభా లెక్కల ప్రకారం తలసరి అప్పు రూ.88,008 మాత్రమే. అప్పులపై వడ్డీ 2022–23 నాటికి రూ.25,754 కోట్లు మాత్రమే. ఒక మాజీ ఆర్థిక మంత్రి ఇలా మాట్లాడడం పూర్తిగా బాధ్యతారాహిత్యం. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో భయాందోళన రేకెత్తించి తిరిగి అధికారంలోకి రావాలని టీడీపీ దుష్టపన్నాగం కాక మరేమిటి?

తలసరిలో వెనుకబాటు బాబు నిర్వాకమే..

చంద్రబాబు 2022–23లో ఏపీ తలసరి ఆదాయం తెలంగాణతో పోలిస్తే చాల వెనుకబడి ఉందంటున్నారు. మరి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో తెలంగాణ తలసారి ఆదాయం రూ.2,09,848లు ఉంటే ఏపీ తలసరి ఆదాయం రూ.1,54,031లే ఎందుకు ఉంది. అప్పుడు ఇప్పుడు తక్కువ తలసరి ఆదాయానికి కారణం చంద్రబాబు నిర్వాకమే. ఓటుకు కోట్లు కేసు, ఇబ్బడి ముబ్బడిగా అప్పులు, వడ్డీలతో ఆర్థిక విధ్వంసం.. ఇవే ఏపీ వెనకబాటుకు కారణం. ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,19,518లు (2022–23). దేశ తలసరి ఆదాయం రూ.1,72,000లు (2022–23). అంటే 2022–23లో రాష్ట్ర తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే 27.6శాతం ఎక్కువ. తలసరి ఆదాయంలో ఏపీ 4వ స్థానంలో ఉంది.

పేదలకు రూ.2,05,109 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చుచేసే ప్రతి రూపాయికి లెక్క ఉంది. అవినీతిలేకుండా ప్రతి పైసా ప్రజలకు వారి ఖాతాల్లో జమ అయింది. ఇలా 26 సంక్షేమ పథకాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద, మధ్యతరగతి ప్రజలకు నేరుగా సుమారు రూ.2,05,109 కోట్లను డీబీటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జమచేసింది. ప్రతిపక్షాలు కడుపుమంటతో అర్థంలేని విమర్శలు చేయడం శోచనీయం. యనమల, చంద్రబాబు ప్రకటనల్లో రాసే ప్రతి అక్షరం అబద్ధమే. ప్రభుత్వ ప్రతిష్టను అప్రతిష్టపాల్జేయడమే వీరి లక్ష్యం.

ఇక మన ఇంటికే డాక్టర్

- 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యవిధానం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని



చిలకలూరిపేట: ప్రభుత్వ వైద్యులే మన ఇంటికి వచ్చి ఉచితంగా వైద్యసేవలు అందించే రోజులు వచ్చేశాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం రేపు (గురువారం) ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఆమె చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న ఆశా వర్కర్లకు తోడుగా ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లను ఈ హెల్త్ క్లినిక్‌లలో నియమించామన్నారు. 104 వ్యవస్థను జగనన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు అనుసంధానం చేశారని తెలిపారు. నెలకు రెండుసార్లు ఆయా విలేజ్ క్లినిక్‌ల పరిధిలో మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) పర్యటిస్తుందని చెప్పారు. ఎంఎంయూలో మెడికల్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారన్నారు. అందుకోసం ఏకంగా 48 వేల నియామకాలను ఒక్క వైద్య ఆరోగ్యశాఖలోనే జగనన్న నాలుగేళ్ల పరిపాలన కాలంలో చేపట్టారని పేర్కొన్నారు. సమీపంలోని పీహెచ్‌సీలో నియమించిన ఇద్దరు డాక్టర్లలో ఒకరు ఈ ఎంఎంయూతో పాటు ఆయా విలేజ్ క్లినిక్‌లలో వైద్యసేవలు అందిస్తారని వివరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రతి గ్రామానికి కనీసం ఇద్దరు వైద్యులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ వైద్యులు క్రమం తప్పకుండా అక్కడి రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఇస్తారని చెప్పారు. మంచం నుంచి కదలలేని రోగులను వారి ఇంటివద్దే వైద్యులు పరీక్షించి వైద్యం చేస్తారని తెలిపారు. దీనికే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అని పేరు పెట్టారన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో ఇప్పటికే ఏపీలోని దాదాపు 3.5 కోట్ల మందికి స్క్రీనింగ్ నిర్వహించామని, ఈ విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ డేటా ఆధారంగా వైద్యసేవలు సులభంగా అందుతాయని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు కిట్లు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. యూరప్ తరహాలో వైద్యం అందించే ఆలోచనతో ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభిస్తున్నట్లు ఆమె చెప్పారు.

లోపాలు సరి.. సాగుకు ఊపిరి

- ఆక్వా జోన్‌పై కొత్త గెజిట్
- కోల్పోయిన సర్వీసులకు విద్యుత్ రాయితీ పునరుద్ధరణ
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెరిగిన రాయితీ సర్వీసులు



ఆక్వా చెరువులలో ఏరియేటర్లు

సాక్షి అమలాపురం: ఆక్వా సంక్షోభంలో ఉన్నా రైతులు ధైర్యంగా సాగు చేస్తోంది విద్యుత్ రాయితీ ఉందనే నమ్మకంతోనే. కాని ఈ ఫిష్ సర్వేలో లోపాల కారణంగా సగం సర్వీసులకు రాయితీ విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ఆక్వా రైతులు ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం స్పందించి లోపాలను సరిచేయాలని ఆదేశించింది. దీనితో అధికారులు మరోసారి సర్వే చేసి పొరపాట్లు సరిదిద్దడంతో గతం కన్నా రాయితీ సర్వీసులు రెట్టింపు కానున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో వెనామీ సాగు జరుగుతోందని అంచనా. గత టీడీపీ హయాంలో విద్యుత్ రాయితీ యూనిట్‌కు రూ.2.50 ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్‌కు రూ.1.50 చేసింది. దీనివల్ల రైతులకు నెలకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడిని ఆదా చేసుకున్నారు. అయితే ఇటీవల మత్స్యశాఖ చేపట్టిన ఈ ఫిష్ సర్వేలో చోటు చేసుకున్న లోపాల వల్ల పలు సర్వీసులకు విద్యుత్ రాయితీలో కోత పడింది. సర్వేకు 2018 గెజిట్ నోటిఫికేషన్ పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఆ తరువాత కొత్తగా సాగు ఆరంభించిన చెరువులకు, ఆక్వాజోన్ పరిధిలో వచ్చిన చెరువులకు విద్యుత్ రాయితీ లేకుండా పోయింది. అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లలేదు సరికదా, కొబ్బరి చెట్లు ఉంటే వాటిని ఉద్యాన పంటగా చూపించారు. భూముల క్రయ విక్రయాల వల్ల సబ్ డివిజన్ చేసిన చెరువుల సర్వే నంబరు మారితే దానిని నాన్ ఆక్వా జోన్‌గా చూపించారు.



ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా

ఇలా రైతులు సగానికి పైగా సర్వీసులకు రాయితీని కోల్పోయారు. దీనివల్ల తమపై విద్యుత్ భారం పడుతోందని ఆక్వా రైతులు ఆందోళనకు దిగారు. దీనికి స్పందించిన ప్రభుత్వం లోపాలు సదిదిద్దాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. తొలుత గ్రామసభలు, తరువాత మండల లెవెల్ కమిటీ (ఎంఎల్‌సీ) సిఫారసు మేరకు డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ (డీఎల్‌సీ)ల ద్వారా ఆక్వాజోన్‌ను గెజిట్ చేసి హై లెవెల్ కమిటీ (హెచ్‌ఎల్‌సీ)కి పంపించారు. వారు ఇందుకు అంగీకరించి కొత్తగా విద్యుత్ రాయితీ ఇచ్చే సర్వీసుల జాబితాను ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్‌కు పంపుతూ ఫిషరీష్ కమిషనర్ కె.కన్నబాబు గత నెల 31న లేఖలు రాశారు.

రెట్టింపు సర్వీసులకు రాయితీ విద్యుత్

ఉమ్మడి జిల్లాలో గతంలో రాయితీ పొందిన సర్వీసులు కేవలం 3,440 సర్వీసులు కాగా, రాయితీ పొందని సర్వీసులు 5,141 కాగా, మొత్తం 8,581 సర్వీసులుగా గుర్తించారు. పొరపాట్లు సరిదిద్దిన తరువాత రాయితీ పొందే సర్వీసుల సంఖ్య 7,049కి పెరగగా, రాయితీ పొందని సర్వీసులు 1,729కు తగ్గాయి. మొత్తం మీద విద్యుత్ సర్వీసులు 8,775గా గుర్తించారు. ఈ- ఫిష్ సర్వే లోపాలను సరిదిద్దిన తరువాత తూర్పు గోదావరి జిల్లాలో 125, కాకినాడ జిల్లాలో 1,037, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,447 సర్వీసులకు అదనంగా రాయితీలు అందనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతం కన్నా అధిక సర్వీసులకు రాయితీ



ఈ-ఫిష్ సర్వే సమయంలో విద్యుత్ రాయితీ కోల్పోయిన సర్వీసుల కన్నా... రీ సర్వే చేసిన తరువాత రాయితీ పొందే సర్వీసులు పెరిగాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల 98 శాతం మాకు మేలు జరిగింది. కొంతవరకు రాంగ్ మ్యాపింగ్ జరిగింది. దీనిని కూడా సరిదిద్దుతామని మత్స్యశాఖ అధికారులు చెప్పారు. ప్రభుత్వానికి ఆక్వా రైతుల తరపున ధన్యవాదాలు.

– త్సవటపల్లి నాగభూషణం, కోనసీమ ఆక్వారైతు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు, చెయ్యేరు. కాట్రేనికోన మండలం.

జిల్లా	గతంలో రాయితీకి అర్హత ఉన్న కనెక్షన్లు	లేని కనెక్షన్లు	మొత్తం కనెక్షన్లు	తాజాగా రాయితీకి అర్హత ఉన్న కనెక్షన్లు	తాజాగా రాయితీకి అర్హత లేని కనెక్షన్లు	మొత్తం కనెక్షన్లు	అదనంగా రాయితీ పొందనున్న కనెక్షన్లు
తూర్పు గోదావరి	47	178	225	172	87	259	125
కాకినాడ	1,232	1,364	2,596	2,269	366	2,635	1,037
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	2,161	3,599	5,760	4608	1,276	5,884	2,447
మొత్తం	3,440	5141	8,581	7,049	1,729	8,775	3,609

మెట్లదారి భక్తులకు శీఘ్రదర్శనం

- అన్నవరం ధర్మకర్తల మండలి ఆమోదం
- మే 1 నుంచి అమలుకు సన్నాహాలు
- ఇప్పటికీ తేలని మెట్లదారి షెల్టర్ నిర్మాణం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధికి మెట్లదారిన వచ్చే భక్తులకు ఉచితంగా శీఘ్రదర్శనం కల్పించనున్నారు. ఇందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతనెల 27 డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఒక భక్తుడు మెట్లదారి భక్తులకు ఉచిత శీఘ్ర దర్శనం కల్పించేలా కూపన్లు ఇవ్వాలని కోరాడు. దీనిపై ఈఓ సానుకూలంగా స్పందించారు. అదే రోజు సాయంత్రం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రతిపాదించారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మే 1న జరగనున్న దివ్యకల్యాణ మహోత్సవం నాటికి శీఘ్రదర్శనానికి అనుమతించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మెట్లదారిలో షెడ్డు నిర్మాణానికి గ్రహణం

మెట్లదారిలో నీడ లేదు. ఈమార్గాన షెల్టర్ నిర్మించేందుకు మూడేళ్ల క్రితమే టెండర్లు పిలిచి ఓకే చేసినా పనులు ప్రారంభం కాలేదు. భక్తులు ఎండకు ఎండి వానకు తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈఓ వీ త్రినాథరావు హయంగాలో షెడ్డుకు బదులు అలిపిరి-తిరుమల వెళ్లే మెట్లదారి తరహాలో తా షెడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. షెడ్డులో మంచినీటి సదుపాయం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. టెండర్ కూడా పిలిచారు. 2019లో రూ.32 లక్షలతో టెండర్ పిలవగా 26 శాతం తక్కువకు టెండర్ ఖరారైంది. దీనికి దేవదాయశాఖ కమిషనర్ 2020 ఏప్రిల్‌లో అనుమతి మంజూరు చేశారు. కోవిడ్-19 నిబంధనల కారణంగా దేవస్థానానికి భక్తులను అనుమతించలేదు. ఆ సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ పని చేయడానికి ముందుకు వచ్చినా కోవిడ్ నిబంధనలు అడ్డంకిగా నిలిచాయి. మళ్లీ ఈ ఏడాది కూడా ఎండాకాలం వచ్చేసింది. షెల్టరు నిర్మాణం పనులపై స్పష్టత లేదు.



రత్నగిరి మెట్లదారి

ఎంతో ప్రయోజనం



నా పేరు కే గంగయ్య. తొట్టంబేడు మండలం, బోనుపల్లి గ్రామం. 2.5 ఎకరాల్లో పుచ్చతోట సాగుచేశా. ఈ క్రమంలో రూ.51,838 విలువ చేసే డ్రిప్ పరికరాలు తీసుకున్నా. నాకు రూ.42,952 సబ్సిడీ వచ్చింది. కేవలం రూ.11,996 చెల్లించా. నీటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగుచేస్తున్నా. సంతోషంగా ఉంది.

భారీగా సబ్సిడీ వచ్చింది



నా పేరు కే.వినోద్. మాది పాండూరు గ్రామం, వరదయ్యపాళెం మండలం. 1.77 ఎకరాల్లో పుచ్చ తోట సాగుచేశాను. డ్రిప్ (బిందు) పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.2,38,098 విలువైన పరికరాలు పొందాను. అందులో రూ.2,06,672 రాయితీ వచ్చింది. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

'డ్రిప్'తో సాగుదాం!

రాయితీ డ్రిప్ అండ్ స్ప్రింక్లర్లు పొందిన రైతులు - 1,452 మంది

2023-24లో సాగు విస్తీర్ణ లక్ష్యం - 1,500 హెక్టార్లు



సతీష్, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి

బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- ఈ ఏడాది రూ.10 కోట్ల సబ్సిడీ
- 1,452 మంది రైతులకు లబ్ధి
- లక్ష్యానికి మించి స్ప్రింక్లర్ల పంపిణీ

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఎక్కడా సెంటు భూమి కూడా నీరులేక ఎండిపోకూడదని భావిస్తోంది. ఇందులో భాగంగానే మెట్టప్రాంత రైతులకు బిందు సేద్య పరికరాలను భారీ రాయితీతో అందిస్తోంది. దీంతో పంట దిగుబడి పెరుగుతోంది. పంటల నాణ్యత మరింత వృద్ధి చెందుతోంది. ఎరువులు, కరెంట్ ఖర్చు తగ్గిపోతోంది. జిల్లాలో సాగువిస్తీర్ణం అంతకంతకూ పెరుగుతోంది. మొత్తం 1632.43 హెక్టార్లలో బిందు సేద్యం చేయడానికి అధికారులు పరికరాలు అందజేయగా.. ఇప్పటికే 1,278 హెక్టార్లలో పరికరాలు ఏర్పాటు చేసుకున్నారు. మరో 354.43 హెక్టార్లలో ఏప్రిల్ చివరికల్లా పరికరాలు అమర్చేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఉపయోగాలు

నీరు, విద్యుత్‌శక్తి, ఎరువులు ఆదా. పంట ఉత్పాదకత, దిగుబడి పెరుగుతుంది. మొక్క పెరుగుదల చక్కగా సాగుతుంది. పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. అంతరసేద్యం ఎక్కువగ అవసరం ఉండదు. కలుపు మొక్కల బెడద తగ్గుతుంది.

పంటలు.. రాయితీ

ప్రధానంగా బిందు(డ్రిప్) సేద్యం ద్వారా పుచ్చకాయలు, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయాలు, మిరప, ఆయిల్ పామ్, చెరుకు, మల్బరీ పంటలు పండిస్తారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ లభిస్తుంది. గరిష్టంగా ఒక్కో రైతు రూ.2.18 లక్షల మేర రాయితీ పొందవచ్చు. 5 ఎకరాలు పైన 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 70 శాతం రాయితీ ఇస్తున్నారు. గరిష్టంగా రూ.3.46 లక్షల రాయితీ పొందవచ్చు. వేరుశనగ, మినుము పంటలు కూడా పండించేందుకు దోహదపడుతున్నాయి. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, 5 ఎకరాలు పైన 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 45 శాతం రాయితీ ఉంటుంది.

దరఖాస్తు చేసుకునే విధానం


రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పొందడానికి ఆధార్, తహసీల్దార్ నుంచి భూయాజమాన్య ధ్రువీకరణ పత్రం.. లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొబైల్ నంబర్‌ను దరఖాస్తులో పొందుపరచాలి. సబ్సిడీ వివరాలు మెసేజ్ రూపంలో మొబైల్‌కు వస్తాయి.

దరఖాస్తు చేసుకోండి

బిందు సేద్యం చేసుకునే రైతులకు ఈ పథకం ఓ వరం. ప్రభుత్వం ఈ ఏడాదికి రూ.10కోట్ల మేరకు సబ్సిడీ అందిస్తోంది. లక్ష్యాలకు మించి పరికరాలను పంపిణీ చేశాం. అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటివరకు 1,452 మంది రైతు కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. –సతీష్, జిల్లా సూక్ష్మసేద్య అధికారి

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
బుధవారం ॥ 5-4-2023

న్యూస్‌మేకర్



నీల్ ఆమ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టినప్పుడు 'మానవాళి ముందంజ' అని అభివర్ణించారు. కాని మానవాళి నిజమైన ముందంజ ఇకపై పడనుంది. వచ్చే సంవత్సరం చంద్రుణ్ణి చుట్టి రావడానికి వెళ్లనున్న నలుగురు వ్యోమగాముల్లో ఒక మహిళా వ్యోమగామిని ఎంపిక చేసింది నాసా. ఆ విధంగా చంద్రుని దాకా వెళ్లనున్న తొలి మహిళగా వ్యోమగామి క్రిస్టినా కోచ్ చరిత్ర సృష్టించనుంది.

చంద్రుడి దాకా తొలి మహిళ



50 ఏళ్ల క్రితం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి మీద అడుగు మోపినప్పుడు సమస్త మానవాళి అబ్బురపడింది. పులకించింది. మానవ చరిత్రలో శాస్త్ర, సాంకేతిక రంగాలు సాధించిన అపూర్వ ఘటనగా లిఖించుకుంది. భూమ్మీద నుంచి నిత్యం కనపడే, వెన్నెల కురిపించే, వేల ఏళ్లుగా ఎన్నో కథలకూ గాథలకూ ఆలవాలమైన చంద్రుడిపై అడుగుపెట్టడం అంటే సామాన్యమా మరి. ఈ చంద్రుణ్ణి అందుకోవడానికి అమెరికా నాసా ద్వారా 1968 నుంచి 72 మధ్య 'అపోలో' ద్వారా 24 మంది వ్యోమగాములను పంపితే 12 మంది చంద్రుడిపై దిగగలిగారు. అయితే వారంతా పురుషులు. ఇప్పటివరకూ ఒక్క స్త్రీ కూడా చంద్రుడిని తాకలేదు. కాని త్వరలో తాకబోతోంది. 'ఆర్టిమిస్-2' పేరుతో నాసా వచ్చే సంవత్సరం నిర్వహించనున్న చంద్రుని ప్రదక్షిణకు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఒక మహిళ ఎంపికైంది. ఆమే క్రిస్టినా కోచ్. ఆ విధంగా చంద్రుడి వరకూ వెళ్లగలిగిన తొలి మహిళగా ఈమె చరిత్ర సృష్టించనుంది. చంద్రుడికి వీలైనంత దగ్గరగా వెళ్లి దాని చుట్టూ తిరిగి వచ్చే ఈ యాత్ర విజయవంతమైతే 2025లో జరిగే చంద్రయానంలో ఒక స్త్రీని పంపాలని నాసా నిర్ణయం. ఆ అసలు యాత్రకు కావలసిన ధైర్యం క్రిస్టినా ఇవ్వనుంది.

ఆర్టిమిస్-2 అంటే?

ఆర్టిమిస్-2 ప్రయోగంలో వ్యోమగాములు చంద్రుడి మీద కాలు పెట్టరు. చంద్రుడికి దగ్గరగా ఉన్న కక్ష్యలోనూ తిరుగాడరు. చంద్రుడికి కొంత దూరం నుంచి ప్రయాణిస్తారు. దీన్నే ఫ్లై బై అని పిలుస్తారు. చంద్రునిపై రోబోలు, మనుషులతో పరిశోధనలు చేపట్టేందుకు నాసా చేపట్టిన కార్యక్రమమే ఆర్టిమిస్. గత ఏడాది ఆర్టిమిస్-1 పేరుతో వ్యోమగాములు లేకుండా ఒరాయెన్ అనే స్పేస్ క్యాప్సూల్‌ను చంద్రుని చుట్టూ తిప్పారు. వచ్చే ఏడాది ఆర్టిమిస్-2 పేరుతో ఒరాయెన్ స్పేస్ క్యాప్సూల్‌లో నలుగురు వ్యోమగాములు ప్రయాణిస్తారు. ఈ నలుగురిలోనే క్రిస్టినా ఉంది. దాదాపు 10 రోజుల కాలంలో వీరంతా చంద్రుణ్ణి చుట్టి నేరుగా భూమిపైకి వస్తారు. ఒరాయెన్ క్యాప్సూల్‌లో వ్యోమగాముల కోసం చేసిన ఏర్పాట్లు, లైఫ్ సపోర్ట్ వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఇది విజయవంతమైతే 2025లో ఆర్టిమిస్-3 ద్వారా వ్యోమగాములు, రోబోలు చంద్రుడిపైకి చేరి ప్రయోగాలు, పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది. ఆర్టిమిస్-3లో పాల్గొనబోయే స్త్రీ వ్యోమగామి మళ్లీ క్రిస్టినాయే కావచ్చు.

ఎవరీ క్రిస్టినా కోచ్?

చంద్రుణ్ణి చుట్టి రావడానికి నలుగురు వ్యోమగాముల బృందంలో ఎంపికైన క్రిస్టినా కోచ్ ఆర్టిమిస్-2 యాత్రలో మిషన్ స్పెషలిస్ట్‌గా పని చేయనుంది. ఈమెతోపాటు మరో ముగ్గురు- జెరెమి హాన్సన్, విక్టర్ గ్లోవర్, రీడ్ వైజ్‌మెన్ ఈ యాత్రలో పాల్గొంటారు. వీరిలో విక్టర్ గ్లోవర్ చంద్రుడి దాకా వెళ్లనున్న తొలి నల్ల జాతీయుడిగా చరిత్ర నమోదు చేయనున్నాడు. నార్త్ కరోలినాలో పుట్టి పెరిగిన క్రిస్టినా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసింది. 2013లో నాసాలో చేరి స్పేస్ సైన్స్ ఇన్‌స్ట్రుమెంట్‌ల తయారీలో నైపుణ్యం సంపాదించింది. అంతే కాదు అంతరిక్షంలో ఒక్కరుగా గడిపే సమయంలో ఏర్పడే వొత్తిడి, రేడియేషన్ ప్రభావం, మొక్కల పెంపకం లాంటి అంశాల మీద పరిశోధనలు చేసింది. అందుకే 2019 మార్చి 14 నుంచి 2020 ఫిబ్రవరి 6 వరకూ ఐ.ఎస్.ఎస్ (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్)లో గడిపి సుదీర్ఘకాలం అంటే 328 రోజులు అంతరిక్షంలో గడిపిన తొలి మహిళగా రికార్డు స్థాపించింది. ఇంకా విశేషం ఏమిటంటే 2019 అక్టోబర్ 18న మరో మహిళా వ్యోమగామి జెస్సికా మెయర్‌తో కలిసి ఐ.ఎస్.ఎస్ నుంచి బయటకు వచ్చి దాని వెలుపల ఉండే ఒక భాగాన్ని రీప్లేస్ చేసింది. ఫలితంగా ఆల్ విమెన్ స్పేస్‌వాక్ చేసిన రికార్డు వీరిరువురూ నమోదు చేశారు.

సొంత నేలపై ప్రేమ

క్రిస్టినా కోచ్‌కు ఫొటోలు తీయడం ఇష్టం. తరచూ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడుతుంది. కాని అంతరిక్షం నుంచి ఆమె తీసిన ఒక ఫోటో మాత్రం ఆమె మరువలేదు. అది తను పుట్టి పెరిగిన నార్త్ కరోలినా ప్రాంతం ఫొటో. అంతరిక్షం నుంచి నార్త్ కరోలినాను మొదటిసారి చూసినప్పుడు ఆమె ఉద్వేగంతో ఊగిపోయింది. ఈ గడ్డలోనే కదా నేను ఇంతదాన్నయ్యాను అనుకుందామె. ఇటువంటి అనుభూతే ఆమెకు చంద్రుణ్ణి సమీపించినప్పుడు కలగవచ్చు. ఎందుకంటే చంద్రుడికి అతి దగ్గరగా వెళ్లిన తొలి మహిళ కదా.



మన చేనేత మన ఘనత... మన చారిత్రక సంప్రదాయం.
మన అద్దకంలోని ముగ్ధత్వం... సప్తవర్ణ శోభితం.
లోహానికి జీవం పోసే నైపుణ్యం... సృష్టికి ప్రతి రూపం.
తెలుగు నేల పురుడుపోసిన కళలే... యాభైకి పైగా ఉన్నాయి.
ఈ విరచిత గ్రంథాలన్నీ అక్షరబద్ధం కావాలి... శాస్త్రబద్ధత పొందాలి.
కళ నిలవాలి... కళాకారులు మనగలగాలని దీక్షబూనారు రాజేశ్వరి.

చేనేత సప్తవర్ణశోభితం

రాజేశ్వరి మావూరి

'ఎల్లువొచ్చి గోదారమ్మ... ఎల్లాకిల్లా పడ్డాదమ్మా...' పాట గుర్తుందా? ఆ పాటలో ఇత్తడి బిందెలు గుర్తు వచ్చాయా? బోర్లించిన బిందెల మీద శ్రీదేవి సుతారంగా అడుగులు వేస్తూండగా పాట మొదలవుతుంది. ఇన్ని బిందెలు తయారైందెక్కడో అనే సందేహం అప్పుడు వచ్చినా రాక పోయినా ఇప్పుడు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతరించిపోతున్న కళను బతికించుకోవడానికి మనవంతు ప్రయత్నం చేయాల్సిన అవసరమూ ఉంది. ఈ బిందెలు తయారైన గ్రామం పేరు అజ్జరం, తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. ఆ ఊర్లో తయారు కాని ఇత్తడి పాత్ర ఉండదంటే అతిశయోక్తి కాదు. అలాగే శ్రీకాకుళం జిల్లా బుడితి గ్రామం కూడా. ఇత్తడి, కంచులో జీవం పోసుకునే రూపాలు కలకాలం నిలిచి ఉంటాయి. కానీ ఆ కళ కలకాలం నిలిచి ఉండే పరిస్థితులున్నాయా? సమాధానం చెప్పలేం. కళాకారులకు ఆదరణ తగ్గినప్పుడు కళ దానంతట అదే కనుమరుగయిపోతుంది. అలా కనుమరుగు కాకూడదనే సంకల్పంతో పని చేస్తోంది రాజేశ్వరి మావూరి. తెలుగు రాష్ట్రాల నలుమూలలూ పర్యటించిందామె. యాభైకి పైగా ఉన్న చేనేతలు, హస్తకళాకృతులను అధ్యయనం చేసింది. ఈ కళలు మనుగడ సాగించాలంటే వీటి ఔన్నత్యాన్ని విదేశీ వేదికల మీద ప్రదర్శించాలనుకుంది రాజేశ్వరి. ఇటీవల పారిస్‌లో మన చేనేతలను ప్రదర్శించిన రాజేశ్వరి తన హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ జర్నీని సాక్షితో పంచుకున్నారు.

వస్త్రలేఖనాలు

"నేను పుట్టి పెరిగింది చేనేతల్లోనే. దుస్తులంటే దేహాన్ని కప్పుకునే సాధనాలుగానే చూస్తాం. కానీ ఆ ప్రధాన అవసరం నుంచి అంతకుమించి అవి మన జీవితంలో చోటు చేసుకున్నాయి. దారం తయారీ నుంచి దారాలకు వస్త్రరూపాన్నివ్వడానికి కళాకారులు జీవితాన్ని అంకితం చేస్తుంటారు. ఒక చిత్రలేఖనాన్ని కొనేటప్పుడు ఆ చిత్రకారులను ప్రధానంగా గుర్తిస్తాం. కానీ హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ విషయంలో వాటి వెనుక శ్రమ ఎవరిదనే ఆలోచన కూడా రాదు. పైగా హస్తకళాకృతుల తయారీదారులను కారిగార్స్ అంటున్నాం కానీ కళాకారులు అనడానికి కూడా నోరు రావడం లేదు. అది ఎవరి తప్పూ కాదు. కళాకారుడిని గుర్తించడం మనకు అలవాటు చేయలేదు. నేను ఆ వెలితిని పూరించాలనుకున్నాను. ఒక డ్రస్‌లో డిజైనర్ సృజనతోపాటు, చేనేతకారుని సృజనను కూడా తెలియచేస్తుంటాను. మనసు పెట్టి చూస్తే ప్రతి హ్యాండ్‌లూమ్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ వెనుక ఒక కథ ఉండి తీరుతుంది. ఆ కళకు ఉన్న చరిత్ర అది. శ్రీకాళహస్తి కలంకారీలో ప్రతిదీ ఒక చిత్రలేఖనమే. మచిలీపట్నం, పెడన కలంకారీ కూడా కేవలం అద్దకం మాత్రమే కాదు. ఒక పువ్వు రేకులో కొంత భాగంలో చిక్కదనం, మరికొంత భాగంలో తేలికదనం వ్యక్తం అవుతుంటుంది. ఆ నైపుణ్యాన్ని కొలిచే కొలమానం లేదు. అంతేకాదు, శాస్త్రబద్ధం చేయడానికి సరైన డాక్యుమెంటేషన్ కూడా ఉండడం లేదు. చేనేత విషయానికి వస్తే... పారిస్ ఎగ్జిబిషన్‌లో నా స్టాల్‌లో మల్‌మల్ (మజ్లిన్)ను చూసి ఒక వస్త్ర ప్రేమికురాలు చాలా ఉద్వేగానికి లోనవుతూ... 'ఒక్కసారి తాకవచ్చా' అని అడిగింది. తాకి చూస్తూ ఏడ్చేసింది. మల్‌మల్ నేత గొప్పదనం గురించి అప్పటికే పుస్తకాల్లో చదివిందట, ఎప్పటికైనా చూడాలనే కోరిక ఉండేదట. టూ హండ్రెడ్ కౌంట్‌లో ఉండే మృదుత్వాన్ని స్వయంగా ఆస్వాదించాల్సిందే తప్ప మాటల్లో వర్ణించలేం. నా దగ్గర మల్‌మల్ ఇరవై మీటర్ల క్లాత్ ఉంది, నా పర్సులో ఇమిడిపోతుంది. గత వారం మల్‌మల్ డ్రెస్‌లు యూరప్‌కి అరవై పీస్‌లు పంపించాను, వాటి అన్నింటి బరువు నాలుగు కిలోల లోపే. బెంగాల్‌లో విస్తరించిన కళాత్మక చేనేతకారులు ఇప్పుడు రెండు వందలకంటే లేరు. ఆ కుటుంబాల నుంచి మరో తరం వచ్చేలా ప్రోత్సాహమివ్వడం లేదా ఆసక్తి ఉన్న కొత్తతరం శ్రద్ధ చూపించే వాతావరణం కల్పించాలి. ఐదు వందల కౌంట్ నేసే కళాకారుల్లో ఒక్క పెద్దాయన మాత్రమే మిగిలారు. ఇవన్నీ మనదేశ గౌరవాలు. విదేశాల్లో సగౌరవంగా ప్రదర్శించగలిగిన విశేషాలు. ఇక సాహిత్యం విషయానికి వస్తే నేను రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లోని పాత్రలతో ఉత్తేజం పొంది ఉండడంతో ఈ బెంగాలీ చేనేతకు ఫ్యాషన్ రూపం తీసుకురావడంలో ఆ పాత్రలనే దృష్టిలో పెట్టుకుంటాను. బినోదిని, లోలీత, మృణ్మయి, చారులత, కాదంబని వంటి పాత్రలు ఈ రోజుల్లో అయితే ఎలాంటి డిజైన్‌లను ఇష్టపడతారనే కోణంలో డిజైన్ చేస్తాను. నా బ్రాండ్ కూడా విదేశీయులు సరళంగా పలకగలిగేటట్లు, నా పేరు, ఇంటి పేరు, నాన్న, భర్త పేర్లు కలిసి వచ్చేటట్లు 'లేబుల్ రామా' అని పెట్టాను.



కలంకారీ నైపుణ్యాన్ని చూపిస్తూ...



పారిస్ ఎగ్జిబిషన్‌లో విదేశీయులకు మన వస్త్రకళను వివరిస్తూ...

మన కళ విదేశీ పుస్తకాల్లో

మన హస్తకళల సమాచారం మనదేశంలో కంటే విదేశీ పుస్తకాల్లో బాగా దొరుకుతోంది. చైనాతోపాటు అనేక దేశాల పర్యాటకులు ఇక్కడి కళాత్మకతను గ్రంథస్థం చేశారు. ఇంగ్లిష్ రచయిత్రి జేన్ ఆస్టిన్‌కి ఈ క్లాత్ చాలా ఇష్టం. మల్ మల్ ఫ్యాబ్రిక్ కోసం డబ్బు కూడబెట్టుకుని మరీ కొనేదాన్నని ఆమె చెప్పుకున్నది. అంతటి ప్రాశస్త్యం కలిగిన కళ మనవాళ్ల చేతిలో ఉంది. కానీ ఈ కళ ఇంకా ప్రాచుర్యంలోకి రావాలి. మన కళాకారుల మనుగడకు తగిన మార్కెట్‌ను విదేశాల్లో విస్తరించగలిగితే కచ్చితంగా మన కళాత్మకత కలకాలం నిలుస్తుంది. కళాత్మకతతో మనదేశంతోపాటు భారతీయులుగా మనకు కూడా ప్రత్యేకమైన గౌరవం దక్కుతుంది. అలాగే హస్తకళాకారులు తాము రూపుదిద్దిన కళాఖండానికి తమ పేరు పెట్టుకోగలిగిన రోజు రావాలి. అజ్జరం, బుడితి, పెడన, గద్వాల్, చేర్యాల, ఆదిలాబాద్‌లోని ఆదివాసీ కళాకారులను స్వయంగా కలిశాను. వాళ్లు ఇత్తడితో చేసే ఢోకా బొమ్మలు హరప్పా, మొహెంజోదారోల మూలాలను కొనసాగిస్తున్నాయి. నా అధ్యయనంలో మధ్య అమెరికా, ఈజిప్ట్, చైనాలతోపాటు మనదేశంలో వెస్ట్ బెంగాల్, ఒడిషా, చత్తీస్‌ఘడ్, తెలంగాణల్లో ఈ లాస్ట్ వాక్స్ టెక్నిక్‌తో బొమ్మలు చేసేవాళ్లు. మట్టి తర్వాత మనిషి లోహంతో బొమ్మలు చేయడం నేర్చుకున్న నాటి విధానం అది. కొత్త ఒరవడిలో పడిపోయి ప్రాచీన శాస్త్రీయతను కోల్పోతున్నామనేది నా ఆవేదన. నేను పుస్తకాలు చదివి తెలుసుకున్న విషయాలు, స్వయంగా ఫీల్డ్ స్టడీలో గమనించిన వివరాలను కలుపుతూ కొన్ని వ్యాసాలు రాశాను. మిగతా అన్ని వివరాలనూ పూసగుచ్చినట్లు గ్రంథస్థం చేస్తాను'' అని హస్తకళాకృతులు, కళాకారుల పట్ల తన మక్కువను తెలియచేశారు రాజేశ్వరి మావూరి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

అవ్వ మెడల్స్ తెచ్చింది



భగవాని దేవి



ఒకటి కాదు రెండు కాదు... పరుగుల అవ్వగా పేరు గడించిన 95 ఏళ్ల భగవాని దేవి డాగర్ మూడు పతకాలు సాధించి మరోసారి మన దేశానికి కీర్తి తెచ్చింది. ఫిన్లాండ్‌లో జరిగిన 'వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'కు భగవాని దేవి వెళ్లనుందని 'సాక్షి ఫ్యామిలీ'లో కథనం అందించాం. ఆమె అక్కడ పాల్గొని మూడు పతకాలతో దేశానికి తిరిగి వచ్చింది. 90–94 ఏళ్ల వయసు కేటగిరిలో 100 మీటర్ల పరుగును అందరి కంటే ముందు పూర్తి చేసి గోల్డ్ సాధించింది. షాట్‌పుట్, డిస్కస్ త్రోలో కూడా చెరి ఒక గోల్డ్ మెడల్ గెలిచింది. మూడు బంగారు పతకాలతో తిరిగి వచ్చిన భగవాని దేవికి గురువారం ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. ఏ వయసులోనైనా గొప్ప పనులు చేసి చూపించవచ్చని ఆమె మెడలోని పసిడి వర్ణాలు ఎలుగెత్తి చాటుతున్నాయి.

బ్యూటిప్స్

సమ్మర్ కూల్ ప్యాక్స్

మండిపోయే ఎండల నుంచి సున్నితమైన ముఖ చర్మాన్ని కాపాడుకోవడానికి సమ్మర్ కూల్ ప్యాక్స్ ఎంతో మేలు చేస్తాయి. ఇంట్లో దొరికే సహజసిద్ధమైన పదార్థాలతో సులభంగా తయారు చేసుకోగల కూల్ ఫేస్ ప్యాక్స్ మీకోసం...



- గుప్పెడు పుదీనా ఆకులు తీసుకుని, చిటికెడు పసుపు వేసి మెత్తగా పేస్టులాగా రుబ్బుకోవాలి. ఈ పేస్టును ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- కీరదోసకాయ ఒకటి తీసుకుని చెక్కుతీసి సన్నగా తురుముకోవాలి, ఈ తురుములో అప్పుడే తీసిన అలోవెర జెల్‌ను వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తరువాత నీటితో కడుక్కోవాలి.
- స్పూను తేనె, స్పూను నిమ్మరసం తీసుకుని రెండింటి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఆరిన తరువాత కడగాలి.
- శనగపిండి, పెరుగును సమపాళ్లలో తీసుకుని పేస్టులా కలుపుకోవాలి. ఈపేస్టును ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- ఒక గుడ్డును తీసుకుని దానిలో తెల్లసొనను మాత్రమే ఒక గిన్నెలో తీసుకోవాలి. ఈ సొనకు స్పూను తేనె కలిపి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి.
- పండిన అరటిపండును తీసుకుని దానిలో సగభాగాన్ని తొక్కతీసేసి గుజ్జులా చేసుకోవాలి. దీనిలో స్పూను తేనె వేసి బాగా కలిపి ముఖానికి రాసి గంట తరువాత కడగాలి.
- గంధం పొడిలో కొద్దిగా రోజ్ వాటర్ కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. వారానికి ఒకసారి మాత్రమే ఈ ఫేస్‌ప్యాక్ వేసుకోవాలి.
- బాగా పండిన టమోటా గుజ్జును తీసుకుని దానిలో కొద్దిగా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి గంట తరువాత కడిగేయాలి.

సూపర్ ఛార్జర్ టూల్స్



ఈ జెనరేషన్‌లో ఏఐ ఆర్ట్ జెనరేటర్స్ సంఖ్య పెరుగుతోంది.

యూత్ పల్స్

విస్తృత సాంకేతిక ప్రపంచంలో యువతరం ప్రతి టూల్‌లోనూ ఒక విద్యాలయాన్ని చూస్తోంది. కొత్త విషయాలు నేర్చుకోవడానికి, తమను తాము మెరుగుపరుచుకోవడానికి ఏఐ పవర్డ్ టూల్స్‌ను ఉపయోగించుకుంటోంది. క్షణక్షణం యువతరం జపిస్తున్న సృజన మంత్రం ఏఐ సాంకేతికత. ఇటీవలి కాలంలో యూత్ మనసు దోచుకున్న, వారి క్రియేటివిటీకి సూపర్ ఛార్జర్‌గా ఉపయోగపడుతున్న కొన్ని ఏఐ టూల్స్....

'రిప్లై ఇవ్వడానికి బోర్‌గా ఫీలవుతున్నారా? ప్రైవసీ కావాలా? డెడ్ హెడ్ సెట్ బ్యాటరీ భయపెడుతుందా? ఎయిర్ పాడ్స్ పోగొట్టుకున్నారా? వినికిడి సమస్య ఉందా?'... అని అడుగుతూ యూత్ దగ్గరకు వచ్చేసింది విష్పర్‌బాట్. ఇది ఏఐ వాట్సాప్ అసిస్టెంట్. జస్ట్... వాయిస్ ఫార్వర్డ్ చేస్తే చాలు... దాన్ని పదాల్లోకి మార్చేస్తుంది. 57 భాషలలో ఏ భాషలోనైనా మాట్లాడవచ్చు. వేగంగా మాటలను పదాలలోకి తీసుకురావడం దీని ప్రత్యేకత. 'విష్పర్ బాట్' కోసం అదనపు సాఫ్ట్‌వేర్, యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోనక్కర్లేదు.

ప్రైవసీ, డాటా సెక్యూర్ విషయంలో భయం అక్కర్లేదు. నిర్ణీత వ్యవధి తరువాత ఆడియో ఫైల్ (వాయిస్ మెసేజ్) డిలిట్ అవుతుంది. ఏఐ పవర్డ్ ట్రాన్స్‌క్రిప్షన్ టెక్నాలజీతో పనిచేసే 'విష్పర్‌బాట్' ప్రస్తుతం వాట్సాప్‌కే పరిమితం. భవిష్యత్‌లో ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు విస్తరించే అవకాశం ఉంది.

టెక్స్ట్‌ను సింపుల్‌గా రీరైట్ చేయడానికి, సంక్షిప్తంగా, సృజనాత్మకంగా మలచడానికి, గ్రామర్, స్పెలింగ్ మిస్టేక్స్‌ను చెక్ చేసుకోవడానికి, తప్పుల నుంచి నేర్చుకొని ఇంగ్లీష్‌ను మరింత ఇంప్రూవ్ చేసుకోవడానికి 'క్విల్‌బాట్' టూల్‌ను ఉపయోగించుకుంటున్నారు.

ఒక టాపిక్‌కు సంబంధించి ప్రెజెంటేషన్ ఇవ్వాలి. డెడ్ లైన్ దగ్గర పడగానే అయోమయం ఆవరిస్తుంది. టెన్షన్‌తో తప్పులు దొర్లుతుంటాయి. దీన్ని నివారించడానికి యువతరం చేతిలోని అస్త్రం స్లైడ్స్‌జీపీటీ. టైమ్ ఎంత మాత్రం వృథా కాకుండా త్వరగా ప్రెజెంటేషన్‌కు రూపకల్పన చేస్తుంది. 'వాట్స్‌ది టాపిక్ ఆఫ్ యువర్ ప్రెజెంటేషన్' అని అడుగుతుంది. జస్ట్... మనకు అవసరమైన టాపిక్‌ను ఎంటర్ చేస్తే చాలు, ఏదో మ్యాజిక్ చేసినట్లుగా మనకు కావాల్సిన ప్రెజెంటేషన్ అందుబాటులోకి వస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుంచి సైన్స్ విషయాల వరకు కాలేజి స్టూడెంట్స్‌కు ఈ టూల్ ఉపయోగపడుతుంది.

> అంకుల్ ర్యాబిట్ నుంచి టెక్స్ట్-టు-ర్యాప్ వరకు ఎన్నో ఏఐ టూల్స్ యువతరానికి ఆత్మీయనేస్తాలు, సూపర్‌ఛార్జర్స్ అయ్యాయి.

కోడింగ్ విషయంలో ఔత్సాహిక ప్రోగ్రామర్స్‌కు ఉపయోగపడుతున్న ఏఐ పవర్డ్ టూల్ కోడ్‌ట్యూటర్. లెంగ్తీ కోర్స్ మాడ్యూల్స్‌తో సైనప్ కానవసరం లేకుండా ఆసక్తికరంగా, తక్కువ టైమ్‌లో కోడింగ్ పాఠాలు నేర్చుకోవచ్చు. దీనిలో స్టూడెంట్స్ కోసం ఇంటరాక్టివ్-లెసన్స్, కోడింగ్-ఛాలెంజెస్ ఉంటాయి.

చిత్రాభిమానులైన యువతరానికి విజువల్ ఆర్ట్‌కు సంబంధించి ఏఐ టూల్స్ ఉపయోగపడుతున్నాయి. కుంచె పట్టుకొని కసరత్తులు చేయాల్సిన అవసరం లేకుండా సింపుల్ సెంటెన్స్, ప్రాంప్ట్‌నెస్‌తో అందరూ మెచ్చే సుందరచిత్రాన్ని సృష్టిస్తున్నారు. దీనికి ఉదాహరణ డాల్-ఇ2. ఓపెన్ ఏఐ 'డాల్-ఇ'కి కొనసాగింపుగా వచ్చిన 'డాల్-ఇ2' కాన్సెప్ట్స్, స్టైల్స్, క్వాలిటీల కలబోత. ఇన్‌పుట్‌లో టైప్ చేస్తే చాలు ఔట్‌పుట్‌లో మనకు కావాల్సిన చిత్రం ప్రత్యక్షమవుతుంది.

ఏఐ టూల్స్ పుణ్యమా అని ఆర్ట్ గురించి అంతంత మాత్రమే తెలిసిన వారు కూడా పికాసో స్టైల్లో బొమ్మలు వేస్తున్నారు. పాప్ ఆర్ట్, ఇంప్రెషనిజమ్, స్ట్రీట్ ఆర్ట్.... ఒక్కటనేమిటీ రకరకాల ఆర్ట్‌ఫామ్‌లతో ఔరా అనిపిస్తున్నారు. ఈ జెనరేషన్‌లో ఏఐ ఆర్ట్ జెనరేటర్స్ సంఖ్య పెరుగుతోంది. ఎంత ఏఐ అయినా దానికంటూ కొన్ని పరిమితులు ఉంటాయి కదా! వాటిని అధిగమించడానికి 'డాల్-ఇ2' కమ్యూనిటీలోని యూజర్స్ ఒకరికొకరు సహాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. 'ప్రాంప్టింగ్ క్రాఫ్ట్' మెరుగుపరుచుకోవడానికి రకరకాల మార్గాలు వెదుకుతున్నారు.

ఇక 'ర్యాప్‌జామ్' అనే టూల్ సాధారణ వాక్యాలను కూడా 'రైమ్స్'గా మారుస్తుంది.ఈ జీపీటీ-4 ఆధారిత టూల్ టెక్స్ట్ ప్రాంప్ట్‌ను ర్యాప్ సాంగ్‌గా మార్చి అలరిస్తుంది.

అంకుల్ ర్యాబిట్ నుంచి టెక్స్ట్-టు-ర్యాప్ వరకు ఎన్నో ఏఐ టూల్స్ యువతరానికి ఆత్మీయనేస్తాలు, సూపర్‌ఛార్జర్స్ అయ్యాయి.



ఐపీఎల్, డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అయ్యర్ దూరం

భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ టోర్నీ మొత్తానికి, జూన్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూరమయ్యాడు. అయ్యర్ వెన్ను గాయానికి శస్త్ర చికిత్స విదేశంలో జరగనుందని... అతను కోలుకోవడానికి కనీసం ఐదారు నెలలు పడుతుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీకి కూడా అయ్యర్ అందుబాటులో ఉంటాడో లేదో ఇప్పుడే చెప్పలేమని బీసీసీఐ వర్గాలు వివరించాయి.

రజత్ పటిదార్ కూడా అవుట్...

గత ఏడాది ఐపీఎల్ టోర్నీలో 333 పరుగులతో విశేషంగా రాణించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) బ్యాటర్ రజత్ పటిదార్ ఈ సీజన్‌లో మాత్రం బరిలోకి దిగడంలేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన 29 ఏళ్ల పటిదార్ మడమ గాయంతో బాధపడుతున్నాడు. ఇప్పట్లో అతను గాయం నుంచి కోలుకునే అవకాశం లేకపోవడంతో ఐపీఎల్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడని ఆర్‌సీబీ వర్గాలు తెలిపాయి.





హంపి, హారిక పదో రౌండ్ గేమ్‌లు 'డ్రా'

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక ఖాతాలో మరో 'డ్రా' చేరింది. మంగళవారం నినో బత్సియాష్‌విలి (జార్జియా)తో జరిగిన పదో రౌండ్ గేమ్‌ను హంపి 44 ఎత్తుల్లో... కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌ను హారిక 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. భారత్‌కే చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలి నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. జు జినెర్ (చైనా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 31 ఎత్తుల్లో ఓడిపోయింది. పదో రౌండ్ తర్వాత హంపి నాలుగు పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో, హారిక 3.5 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో ఉన్నారు. 5.5 పాయింట్లతో అలెక్సాండ్రా గొర్యాక్చినా (రష్యా), జు జినెర్, బిబిసారా (కజకిస్తాన్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

ఐర్లాండ్ 214 ఆలౌట్



తైజుల్

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్‌ను బంగ్లాదేశ్ ఎడం చేతి వాటం స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (5/53), మీడియం పేసర్ ఇబాదత్ హుస్సేన్ (2/54), స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ (2/43) దెబ్బ కొట్టారు. ఐర్లాండ్ జట్టులో హ్యారీ టెక్టర్ (50; 6 ఫోర్లు, 1 సిక్స్), లొర్కాన్ టకెర్ (37; 3 ఫోర్లు), క్యాంఫెర్ (34; 6 ఫోర్లు) రాణించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 10 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 34 పరుగులు సాధించింది.

టైటాన్స్ ఆడుతూ పాడుతూ...

గుజరాత్ టైటాన్స్... దాదాపు తొలి మ్యాచ్ తరహాలోనే... ఎలాంటి హంగామా, వ్యక్తిగతంగా మెరుపు ప్రదర్శనలు లేవు... విధ్వంసక ఆట లేదు... అంతా సమష్టి తత్వం, అటు బౌలర్లు, ఇటు బ్యాటర్లు తలా ఓ చేయి వేశారు... ముందుగా చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థి కట్టడి, ఆపై ప్రశాంతంగా లక్ష్య ఛేదన...డిఫెండింగ్ చాంపియన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సత్తా చాటింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ సొంత మైదానంలో ఆడుతున్న ప్రయోజనాన్ని ఏమాత్రం ఉపయోగించుకోలేక చతికిలపడింది. ఫలితమే వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది.

- గుజరాత్‌కు వరుసగా రెండో విజయం
- గెలిపించిన రషీద్, సుదర్శన్
- 6 వికెట్ల తేడాతో ఓడిన ఢిల్లీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ కొత్త సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో విజయంతో తమ స్థాయిని ప్రదర్శించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (32 బంతుల్లో 37; 7 ఫోర్లు), అక్షర్ పటేల్ (22 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), సర్ఫరాజ్ ఖాన్ (34 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు.



రషీద్, షమీ



సాయి సుదర్శన్

రషీద్ ఖాన్, షమీ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం గుజరాత్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 163 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (48 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, మిల్లర్ (16 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 29 బంతుల్లోనే 56 పరుగులు జోడించారు.

సమష్టి వైఫల్యం...

తొలి మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి కూడా ఢిల్లీ బ్యాటింగ్ ఏమాత్రం మెరుగుపడలేదు. పృథ్వీ షా, మిచెల్ మార్ష్ మళ్లీ విఫలం కాగా, వార్నర్ మరోసారి తన శైలికి భిన్నంగా దాదాపు అదే తరహాలో 115 స్ట్రయిక్‌రేట్‌తో ఆడాడు. టైటాన్స్ బౌలర్లు ఆరంభం నుంచి ప్రత్యర్థిని కట్టి పడేశారు. తన వరుస రెండు ఓవర్లలో పృథ్వీ షా (7), మార్ష్ (4)లను షమీ వెనక్కి పంపగా, వార్నర్ చేసిన పరుగులతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 52/2కు చేరింది. అనంతరం వరుస బంతుల్లో వార్నర్, రోసో (0)లను అవుట్ చేసి జోసెఫ్ ఢిల్లీని దెబ్బ కొట్టాడు. మరో ఎండ్‌లో సర్ఫరాజ్ నిలబడినా, అతనూ వేగంగా ఆడలేకపోయాడు. 13 పరుగుల వద్ద జోష్ లిటిల్ క్యాచ్ వదిలేసి మరో అవకాశం దక్కినా అతను దానిని ఉపయోగించుకోలేదు. అభిషేక్ పోరెల్ (11 బంతుల్లో 20; 2 సిక్స్‌లు) ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా అది ఎక్కువసేపు సాగలేదు. అయితే 101/5 వద్ద క్రీజ్‌లోకి వచ్చిన అక్షర్ కీలక పరుగులు సాధించాడు. చివర్లో అతను కొట్టిన మూడు సిక్సర్లతోనే ఢిల్లీ చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగింది.

కీలక భాగస్వామ్యం...

ఖలీల్ వేసిన తొలి ఓవర్లోనే 2 ఫోర్లు, సిక్స్ కొట్టి వృద్ధిమాన్ సాహా (14) జోరుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టగా, ముకేశ్ వేసిన తర్వాతి ఓవర్లో శుబ్‌మన్ గిల్ (14) రెండు ఫోర్లు కొట్టాడు. అయితే అద్భుత బంతులతో నోర్జే వీరిద్దరిని క్లీన్‌బౌల్డ్ చేశాడు. హార్దిక్ పాండ్యా (5) కూడా విఫలమయ్యాడు. ఇలాంటి దశలో సుదర్శన్, విజయ్ శంకర్ (23 బంతుల్లో 29; 3 ఫోర్లు) కీలక భాగస్వామ్యంతో టైటాన్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఎలాంటి సాహసాలకు పోకుండా వీరిద్దరు జాగ్రత్తగా ఆడుతూ లక్ష్యం దిశగా నడిపించారు. ఈ క్రమంలో కొన్ని చక్కటి షాట్లతో సుదర్శన్ ఆకట్టుకున్నాడు. నాలుగో వికెట్‌కు 44 బంతుల్లో 53 పరుగులు జోడించిన అనంతరం శంకర్‌ను అవుట్ చేసి ఈ జోడీని విడదీశాడు. అయితే వచ్చీ రాగానే మిల్లర్ తన దూకుడును ప్రదర్శించాడు. ముకేశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాది టైటాన్స్ పని సులువు చేశాడు. 44 బంతుల్లో సుదర్శన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, మరో 11 బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ విజయాన్నందుకుంది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి) జోసెఫ్ 37; పృథ్వీ షా (సి) జోసెఫ్ (బి) షమీ 7; మార్ష్ (బి) షమీ 4; సర్ఫరాజ్ (సి) లిటిల్ (బి) రషీద్ 30; రోసో (సి) తెవాటియా (బి) జోసెఫ్ 0; పోరెల్ (బి) రషీద్ 20; అక్షర్ (సి) మిల్లర్ (బి) షమీ 36; అమన్ ఖాన్ (సి) పాండ్యా (బి) రషీద్ 8; కుల్దీప్ (నాటౌట్) 1; నోర్జే (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-29, 2-37, 3-67, 4-67, 5-101, 6-130, 7-148, 8-158. **బౌలింగ్:** షమీ 4-0-41-3, లిటిల్ 4-0-27-0, పాండ్యా 3-0-18-0, జోసెఫ్ 4-0-29-2, యష్ దయాల్ 1-0-12-0, రషీద్ ఖాన్ 4-0-31-3.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (బి) నోర్జే 14; గిల్ (బి) నోర్జే 14; సుదర్శన్ (నాటౌట్) 62; పాండ్యా (సి) పోరెల్ (బి) ఖలీల్ 5; విజయ్ శంకర్ (ఎల్బీ) (బి) మార్ష్ 29; మిల్లర్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1-22, 2-36, 3-54, 4-107. **బౌలింగ్:** ఖలీల్ 4-0-38-1, ముకేశ్ 4-0-42-0, నోర్జే 4-0-39-2, మార్ష్ 3.1-0-24-1, కుల్దీప్ 3-0-18-0.



ఢిల్లీ, గుజరాత్ మ్యాచ్‌ను వీక్షించేందుకు స్టేడియానికి వచ్చిన రిషభ్ పంత్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
రాజస్తాన్	1	1	0	2	3.600
బెంగళూరు	1	1	0	2	1.981
లక్నో	2	1	1	2	0.950
పంజాబ్	1	1	0	2	0.438
చెన్నై	2	1	1	2	0.036
కోల్‌కతా	1	0	1	0	-0.438
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

విలియమ్సన్ స్థానంలో షనక

మోకాలి గాయంతో ఐపీఎల్‌కు దూరమైన స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ స్థానంలో శ్రీలంక జట్టు కెప్టెన్ దాసున్ షనకను గుజరాత్ టైటాన్స్ జట్టు తీసుకుంది. గత ఐపీఎల్ వేలంలో షనకను ఎవరూ కొనుగోలు చేయలేదు. ఇప్పుడు విలియమ్సన్ స్థానంలో షనకతో అతని కనీస ధర రూ. 50 లక్షలకు గుజరాత్ టైటాన్స్ ఒప్పందం చేసుకుంది.

వెయిట్‌లిఫ్టర్ సంజితపై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: డోపింగ్ పరీక్షలో విఫలమైన భారత వెయిట్‌లిఫ్టర్ సంజిత చానుపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నాలుగేళ్ల నిషేధం విధించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల సందర్భంగా సంజిత చాను నుంచి డోపింగ్ శాంపిల్స్ సేకరించారు. ఆమె శాంపిల్స్‌ను పరీక్షించగా ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధిత ఉత్ప్రేరకాల జాబితాలో ఉన్న డ్రోస్టానోలోన్ మెటాబోలైట్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దాంతో సంజితపై 'నాడా' క్రమశిక్షణ ప్యానెల్ నాలుగేళ్ల నిషేధం విధించింది. మణిపూర్‌కు చెందిన 29 ఏళ్ల సంజిత పలు మెగా ఈవెంట్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. సంజిత 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో 48 కేజీల విభాగంలో... 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో 53 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది.

కిర్గిజ్ రిపబ్లిక్‌పై భారత్ ఘనవిజయం



సౌమ్య గుగులోత్

బిష్కెక్: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ రౌండ్-1లో భారత జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'జి'లో భాగంగా మంగళవారం కిర్గిజ్ రిపబ్లిక్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ విశేషంగా రాణించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సౌమ్య ఈ మ్యాచ్‌లో ఒక గోల్ చేయడంతో పాటు సహచరిణి అంజు తమాంగ్ రెండు గోల్స్ చేయడంలో సహాయం చేసింది. భారత జట్టుకు అంజు తమాంగ్ (6వ, 42వ ని.లో) రెండు గోల్స్ అందించగా... సౌమ్య గుగులోత్ (45+3వ ని.లో), షిల్కీ దేవి (61వ ని.లో), రేణు (63వ ని.లో) ఒక్కో గోల్ సాధించి పెట్టారు. శుక్రవారం కిర్గిజ్ రిపబ్లిక్ జట్టుతోనే భారత్ రెండో లీగ్ మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ 'జి'లోని మూడో జట్టు తుర్క్‌మెనిస్తాన్ టోర్నీ నుంచి వైదొలిగింది.

సినిమా



రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, వెంకటేశ్

ఏంటమ్మా అదుర్స్...

'ఏంటమ్మా.. ఏంటమ్మా...' అంటూ లుంగీ డ్యాన్స్‌తో ఇరగదీశారు హీరోలు వెంకటేశ్, సల్మాన్ ఖాన్, రామ్‌చరణ్. ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్, పూజా హెగ్డే జంటగా వెంకటేశ్ కీలక పాత్రలో నటించిన హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం రంజాన్ సందర్భంగా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'ఏంటమ్మా.. ఏంటమ్మా...' అంటూ సాగే పాటలో సల్మాన్, వెంకటేశ్, పూజా హెగ్డేలతో కలిసి రామ్‌చరణ్ డ్యాన్స్ చేశారు. ఈ మాస్ పాటను చిత్రయూనిట్ మంగళవారం విడుదల చేసింది. ''ఇద్దరు లెజెండ్స్‌తో (సల్మాన్ ఖాన్, వెంకటేశ్) స్టెప్పులేయడం మర్చిపోలేని అనుభూతి. వెండితెరపై మర్చిపోలేని క్షణాల్లో ఇవి కూడా ఉన్నాయి.. లవ్ యూ భాయ్' అంటూ ట్వీట్ చేశారు రామ్‌చరణ్.

ఇలాంటి కథ తెలుగులో రాలేదు

- సుధీర్ వర్మ



''రవితేజగారితో ఫలానా జానర్ సినిమా చేయాలని ముందుగా అనుకోలేదు. రైటర్ శ్రీకాంత్ చెప్పిన కథ రవితేజగారికి నచ్చ డంతో దర్శకునిగా నేనైతే బావుంటుందని నా వద్దకు పంపించారు. థ్రిల్లర్ జానర్‌లో 'రావణాసుర' వంద శాతం కొత్త మూవీ. ఇలాంటి కథ ఇప్పటివరకూ తెలుగులో రాలేదు'' అని డైరెక్టర్ సుధీర్ వర్మ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సుధీర్ వర్మ మాట్లాడుతూ– ''రావణాసుర'లో థ్రిల్స్, షాకింగ్, సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అందులో ఏది ముందు చెప్పినా సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు ఆ థ్రిల్ ఉండదు.. వారికి ఆ అనుభూతిని ఇవ్వడానికే కథ గురించి చెప్పడం లేదు. అయితే సినిమా చూసిన తర్వాత మన భావోద్వేగాలు మిస్సయిన ఫీలింగ్ ఆడియన్స్‌కి రాదని నా నమ్మకం. 'రావణాసుర' పూర్తిగా రవితేజగారి సినిమా. నటన పరంగా ఆయన సినిమాల్లో టాప్ త్రీలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతోనే రవితేజగారు ఓ నిర్మాతగా వ్యవహరించారు. అభిషేక్‌గారితో నేను చేసిన రెండో సినిమా 'రావణాసుర'. నాపై నమ్మకంతో ఆయన సెట్స్‌కే రారు. 'సుధీర్ ఏం అడిగితే అది ఇచ్చేయండి' అని యూనిట్‌కి చెబుతారు. 'అంతం' మూవీలో నాగార్జునగారి, 'సత్య'లో జేడీ చక్రవర్తిగారి పాత్రల్లో గ్రే షేడ్స్ ఉంటాయి. అయితే హీరోలని గ్రే షేడ్స్‌లో చూపించడం ఈ మధ్య ఎక్కువ అయింది. మణిరత్నంగారి 'రావణ్' సినిమాకి, మా 'రావణాసుర'కి ఎలాంటి సంబంధం లేదు. 'రావణాసుర'ని హిందీ, తమిళ్‌లో విడుదల చేయాలనుకున్నాం కానీ కుదరలేదు. తెలుగులో విడుదలైన రెండో వారం నుంచి హిందీలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం నిఖిల్ హీరోగా నా దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారి కథతో పవన్ కల్యాణ్‌గారితో నేను ఓ సినిమా చేసే అవకాశం ఉంది'' అన్నారు.



అల్లు అర్జున్

బర్త్ డే ట్రీట్

ఫ్యాన్స్‌కు బర్త్ డే ట్రీట్‌ను సిద్ధం చేస్తున్నారు అల్లు అర్జున్. 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. రెండు భాగాల ఈ చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండో భాగం 'పుష్ప: ది రూల్' సెట్స్‌పై ఉంది. త్వరలోనే ఈ సినిమా విదేశీ షెడ్యూల్ ఆరంభం కానుంది. థాయ్‌లాండ్, శ్రీలంక లొకేషన్స్‌లో షూటింగ్‌ను ప్లాన్ చేశారట. కాగా ఈ నెల 8న అల్లు అర్జున్ బర్త్‌డే. ఈ సందర్భంగా 'పుష్ప: ది రూల్' కాన్సెప్ట్ టీజర్‌ను 7న, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 8న రిలీజ్ చేసేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిందని తెలిసింది. రష్మికా మందన్నా హీరోయిన్‌గా, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ అవుతుంది.

సినిమా బాగుంటే థియేటర్లలోనే చూస్తారు

- చెర్రీ



''కథ పరంగా 'మీటర్' సినిమా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. మంచి కథని ప్రయోగాత్మకంగా చెప్పొచ్చు.. కమర్షియల్‌గా కూడా చూపించొచ్చు. డైరెక్టర్లు బాబీ, గోపీచంద్ మలినేని వద్ద పని చేసిన అనుభవంతో దర్శకుడు రమేష్ 'మీటర్'ని కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా చక్కగా తీశాడు'' అని నిర్మాత చిరంజీవి (చెర్రీ) అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వం వహించిన చిత్రం 'మీటర్'. నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిరంజీవి (చెర్రీ) మాట్లాడుతూ– ''మా క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో 'ఒక్కడున్నాడు, మత్తు వదలరా, హ్యాపీ బర్త్ డే' వంటి ప్రయోగాత్మక చిత్రాలు తీశాం. తొలిసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్ చేస్తే బాగుంటుందని 'మీటర్' చేశాం. చాలా బలమైన కథతో రమేష్ ఈ సినిమాని తీశాడు. 'ఎస్‌ఆర్ కళ్యాణ మండపం' చూసి కిరణ్‌ని 'మీటర్'కి తీసుకున్నాం. ఏ పాత్ర అయినా చేయగల సత్తా ఉన్న నటుడు కిరణ్. తన కెరీర్‌లో అత్యధిక బడ్జెట్ మూవీ ఇది. ప్రయోగాత్మక చిత్రాలకు మంచి పేరు రావచ్చు కానీ డబ్బులు రావు. 'మీటర్' లాంటి మూవీస్‌కి సినిమా బావుందంటే మాత్రం బాక్సాఫీస్ కలెక్షన్స్ బెటర్‌గా ఉండే అవకాశం ఉంటుంది. ఓటీటీల ప్రభావం థియేటర్స్‌పై పెద్దగా ఉండదు. సినిమా బావుంది అంటే తప్పకుండా థియేటర్లకి వెళతారు. ఇందుకు ఉదాహరణ ఇటీవల రిలీజైన 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య'. చిన్న సినిమాలకు స్కోప్ లేదని నేనెప్పుడూ అనుకోలేదు. మంచి కథ కుదిరితే మళ్లీ ప్రయోగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం రితేష్ రానా దర్శకత్వంలో ఓ సినిమా నిర్మిస్తున్నాం. అలాగే ఓ కొత్త దర్శకుడితో మరో సినిమా ఉంటుంది'' అన్నారు.

యూత్‌ఫుల్ జంక్షన్




నైనా సర్వార్, ఈశ్వర్

'కొత్తగా మా ప్రయాణం' ఫేమ్ ఈశ్వర్, నైనా సర్వార్ జంటగా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. 'కథనం' ఫేమ్ నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ఎస్ రావు, విష్ణువర్ధన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెలాఖరులో విడుదలకు సిద్ధమవుతోంది. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం ఇది. త్వరలో సెన్సార్‌కి వెళ్లనున్నాం. మా చిత్రంలోని 'మ్యాచింగ్ మ్యాచింగ్..' పాట రీల్స్ పోటీ విజేతలను త్వరలో ప్రకటించి, ప్రీ రిలీజ్ వేడుకలో బహుమతులు ఇస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పాండు అలిజాల, మ్యూజిక్: రోషన్ సాలూరి, గౌర హరి, కెమెరా: అరుణ్ ప్రసాద్.


మూడేళ్ల తర్వాతే బ్రహ్మాస్త్రం పార్ట్ 2



'బ్రహ్మాస్త్రం' చిత్రంలోని తర్వాతి భాగాలను చూడాలనుకుంటున్న ప్రేక్షకులు మరింత సమయం వేచి ఉండక తప్పదు. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న హిందీ ట్రయాలజీ 'బ్రహ్మాస్త్ర'. మూడు భాగాల 'బ్రహ్మాస్త్రం'లోని తొలి భాగం 'బ్రహ్మాస్త్ర: పార్ట్ వన్ శివ' గత ఏడాది సెప్టెంబరు 9న విడుదలై, ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా అమితాబ్ బచ్చన్, నాగార్జున కీలక పాత్రల్లో ఈ చిత్రం రూపొందింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. కాగా 'బ్రహ్మాస్త్ర' ట్రయాలజీలోని రెండో భాగం 'బ్రహ్మాస్త్ర: పార్టు 2 దేవ్', 'బ్రహ్మాస్త్ర' థర్డ్ పార్టులను వరుసగా 2026 డిసెంబరు, 2027 డిసెంబరులో విడుదల చేయనున్నట్లు దర్శకుడు అయాన్ ముఖర్జీ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''బ్రహ్మాస్త్ర: పార్ట్ 1 శివ'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో సెకండ్ పార్ట్, థర్డ్ పార్ట్ స్క్రిప్ట్స్‌పై మరింత ఫోకస్ పెట్టాను. అలాగే ఈ రెండు సినిమాలను ఏడాది గ్యాప్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం'' అని పేర్కొన్నారు దర్శకుడు అయాన్ ముఖర్జీ. అలాగే తాను మరో సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఉందని, సరైన టైమ్‌లో ఆ విషయాన్ని వెల్లడిస్తానని కూడా అయాన్ పేర్కొన్నారు. దాంతో ఇది 'వార్ 2' సినిమా గురించే అనే ఊహాగానాలు మొదలయ్యాయి.



అయాన్ ముఖర్జీ



హృతిక్ రోషన్

త్వరలో సెట్స్‌కి వార్ 2

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలింస్ స్పై బ్యాక్‌డ్రాప్‌లో వరుసగా చిత్రాలను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సల్మాన్ ఖాన్‌తో 'ఏక్తా టైగర్, టైగర్ జిందా హై', హృతిక్ రోషన్‌తో 'వార్', షారుక్ ఖాన్‌తో 'పఠాన్'.. ఇలా యశ్ రాజ్ ఫిలింస్ స్పై బ్యాక్‌డ్రాప్‌లో నిర్మించిన చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే ఇదే సంస్థలో 'టైగర్' ఫ్రాంచైజీలో సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' వచ్చే ఏడాది ఈద్‌కు రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హృతిక్ రోషన్‌తో 'వార్ 2', సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్‌లతో 'పఠాన్ వర్సెస్ టైగర్' చిత్రాలను భారీ బడ్జెట్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యశ్ రాజ్ ఫిలింస్ భావిస్తోంది. ఇందులో భాగంగానే 'వార్ 2' సినిమాను త్వరలోనే సెట్స్‌పైకి తీసుకువెళ్లనున్నారు మేకర్స్. హృతిక్ రోషన్ హీరోగా, టైగర్ ష్రాఫ్ లీడ్ రోల్‌లో నటించిన 'వార్' చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించారు. 'వార్ 2'కు మాత్రం అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్నారని టాక్. ప్రస్తుతం హృతిక్ హీరోగా 'ఫైటర్' చిత్రం తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. వచ్చే ఏడాది జనవరి 25న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పఠాన్ వర్సెస్ టైగర్?

స్పై బ్యాక్‌డ్రాప్‌లో షారుక్‌తో 'పఠాన్', సల్మాన్‌తో 'టైగర్' చిత్రాలను యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన సంగతి తెలిసిందే. 'పఠాన్' చిత్రంలో షారుక్‌ను కాపాడేందుకు టైగర్‌గా వస్తారు సల్మాన్. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఈ ఇద్దరు హీరోల ఫ్యాన్స్‌ను అలరించింది. కాగా ఈ ఇద్దరూ శత్రువులైతే ఎలా ఉంటుందనే నేపథ్యంలో 'పఠాన్ వర్సెస్ టైగర్' సినిమాను ప్లాన్ చేస్తోందట యశ్ రాజ్ ఫిలింస్. ఇదే నిజమైతే చాలాకాలం తర్వాత ఒకే సినిమాలో షారుక్, సల్మాన్‌లను లీడ్ రోల్స్‌లో చూడొచ్చు. ఈ సినిమాకు సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.



షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్

సాక్షి బిజినెస్

బుధవారం
5-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	115	59,106
నిఫ్టీ ▲	38	17,398

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,141	▼	47
డోజోన్స్	33,395	▼	206
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,635	▼	38
డాక్స్	15,603	▲	23
షాంఘై	3,313	▲	16
నికాయ్	28,287	▲	23

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,715
బంగారం (22 క్యారట్)	59,476
వెండి (కిలో)	71,700

2 బిలియన్ డాలర్ల సమీకరణలో రిలయన్స్, జియో

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మరో 2 బిలియన్ డాలర్లను (సుమారు రూ. 16,400 కోట్లు) సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టాయి. విదేశీ కరెన్సీలో తక్కువ వడ్డీ రేట్లకు ఈ నిధులను సమీకరించే యోచనలో కంపెనీలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రెండు సంస్థలు ఇటీవలే 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 24,600 కోట్లు) మొత్తాన్ని సిండికేట్ లోన్ ద్వారా సమీకరించాయి. రెండు డజన్ల తైవాన్ బ్యాంకులతో పాటు బ్యాంక్ ఆఫ్ అమెరికా, హెచ్‌ఎస్‌బీసీ తదితర 55 దిగ్గజ సంస్థలు ఈ నిధులను అందించాయి. ఆ ఒప్పందాల ప్రాతిపదికనే కొత్తగా 2 బిలియన్ డాలర్లను రిలయన్స్, జియో సమీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి.

జాన్ ప్లేయర్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సిద్ధార్థ్ మల్హోత్రా

ముంబై: దేశీయ ఫ్యాషన్ కంపెనీ జాన్ ప్లేయర్స్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా నటుడు సిద్ధార్థ మల్హోత్రాను ప్రకటించింది. అలాగే ''న్యూ స్ప్రింగ్ సమ్మర్ 23 కలెక్షన్''ను ఆవిష్కరించింది. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లుగా ఉత్పత్తులను తీసుకువస్తున్న జాన్ ప్లేయర్స్‌తో కలిసి పనిచేయటం ఎంతో సంతోషంగా ఉందని మల్హోత్రా తెలిపారు. దేశవ్యాప్తంగా బ్రాండ్‌కు మరింత ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో సిద్ధార్థ మల్హోత్రాను ప్రచారకర్తగా నియమించుకున్నామని కంపెనీ బిజినెస్ హెడ్ నితిన్ సైగల్ పేర్కొన్నారు. సంప్రదాయ ప్రింట్స్, అతి సున్నితమైన డిజైన్లతో కలిగిన వస్త్రాలు న్యూ స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్‌లో భాగంగా ఉన్నాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-4-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417-00
విజయవాడ	417-00
రిటైల్ ధర (డజను)	66.00
4-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

భారత్ వృద్ధి రేటుకు ప్రపంచ బ్యాంక్ కోత

- 2023-24 అంచనాలు 6.3 శాతానికి డౌన్
- క్రితం అంచనాలు 6.6 శాతం
- వడ్డీరేట్ల పెరుగుదల, ఆదాయ వృద్ధిలో నెమ్మది కారణం
- అధిక ధరలు, ప్రపంచ పరిణామాలు కూడా అడ్డంకులే..



వాషింగ్టన్: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏప్రిల్‌తో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో (2023-24) 6.3 శాతానికి పరిమితమవుతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఈ మేరకు క్రితం అంచనాలను 6.6 శాతం నుంచి 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. పెరుగుతున్న వడ్డీరేట్లు, ఆదాయ వృద్ధి మందగమనం, అధిక ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు తన క్రితం అంచనాల తాజా తగ్గింపునకు కారణమని దక్షిణాసియాకు సంబంధించి ఆవిష్కరించిన నివేదికలో బహుళజాతి బ్యాంకింగ్ దిగ్గజం పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక (స్ప్రింగ్) సమావేశాలకు ముందు వరల్డ్ బ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ (దక్షిణాసియా) హన్స్ టిమ్మర్ ఈ నివేదిక విడుదల చేశారు. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు...

- బలహీన వినియోగం, కఠిన వడ్డీరేట్ల వ్యవస్థ ముఖ్యంగా ప్రభుత్వ ప్రస్తుత వ్యయ నియంత్రణ అంచనాల డౌన్‌గ్రేడ్‌కు ప్రధాన కారణం.
- దక్షిణాసియాలోని అనేక ఇతర దేశాల కంటే భారతదేశంలో పరిస్థితి మెరుగ్గానే ఉంది. ఆర్థిక రంగంలో పరిస్థితి ఇతర దేశాల కంటే బాగుంది. భారతదేశంలోని బ్యాంకులు పటిష్ట స్థితిలో ఉన్నాయి. మహమ్మారి తర్వాత బ్యాంకింగ్ చక్కటి రికవరీ సాధించింది. ఆర్థిక వ్యవస్థలో తగిన రుణాలకుగాను లిక్విడిటీ బాగుంది. ఇటీవలి సంవత్సరాలతో పోలిస్తే ప్రైవేట్ పెట్టుబడులు చాలా బలంగా ఉన్నాయి. సమస్యల్లా దేశం తన సామర్థ్యాన్ని తక్కువ స్థాయిలో వినియోగించుకోవడమే.
- భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 20 శాతం కంటే తక్కువకు పడిపోయింది. అసంఘటిత రంగం ఉత్పాదకత పెరుగుతోందన్న దాఖలాలు లేవు. అలాగని ఫలితాలూ మరీ అధ్వానంగానూ లేవు. ఆయా అంశాలను పరిశీలిస్తే అన్ని వర్గాల భాగస్వామ్యంతో వృద్ధిని మరింత పెంచడానికి భారత్ ముందు భారీ నిర్మాణాత్మక ఎజెండా ఉందని భావిస్తున్నాం.
- విదేశాల నుండి ప్రైవేట్ పెట్టుబడులు మరింత పెరగాలి. ముఖ్యంగా సేవల రంగాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఇందుకుగాను సంస్కరణల ఎజెండాను మరింత ముందుకు తీసుకువెళ్లాలి. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వాతావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఉద్గారాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలి.

దక్షిణాసియా దేశాలపై ఇలా..

స్వల్పకాలికంగా చూస్తే, భారత్ దక్షిణాసియాలో ఇతర దేశాలకంటే పటిష్ట ఎకానమీని కలిగి ఉంది. భూటాన్ మినహా ఈ ప్రాంతంలోని అన్ని దేశాలు తమ వృద్ధి అంచనాలను కుదించుకుంటున్నాయి. గత ఏడాది విపత్తు వరదల ప్రభావంతో పాకిస్తాన్ ఇంకా సతమతమవుతూనే ఉంది. సరఫరాల వ్యవస్థకు తీవ్ర అంతరాయాలు ఎదురవుతున్నాయి. పెట్టుబడిదారుల విశ్వాసం దిగజారుతోంది. అధిక రుణ, మూలధన వ్యయాలు భారమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాక్ వృద్ధి ఈ ఏడాది 0.4 శాతానికి తగ్గుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఇక రుణ సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక ఎకానమీలో వృద్ధి లేకపోగా, ఇది ఈ ఏడాది 4.3% క్షీణిస్తుందన్నది అంచనా. పర్యాటకం ఊపందుకోవడం మాల్దీవులు, నేపాల్‌కు సానుకూల అంశాలైనా, అంతకుమించి అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి ప్రభావాలు ఈ దేశాలు ఎదుర్కొననున్నాయి. దక్షిణాసియాలో 2023లో 8.9 శాతం ద్రవ్యోల్బణం అంచనాలు ఉన్నాయి. 2024లో ఇది 7% లోపునకు తగ్గవచ్చు. అయితే బలహీన కరెన్సీలు పెద్ద సమస్యగా ఉంది. ద్రవ్యోల్బణం భయాలను పెంచే అంశమిది.

వృద్ధి 6.4 శాతం: ఏడీబీ



ఇదిలాఉండగా, 2023-24లో భారత్ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) అవుట్‌లుక్ ఒకటి పేర్కొంది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేసిన ఏడీబీ, 2023-24లో ఈ రేటు తగ్గడానికి కఠిన ద్రవ్య పరిస్థితులు, చమురు ధరలు పెరగడాన్ని కారణంగా చూపింది. కాగా, 2024-25లో వృద్ధి రేటు 6.7 శాతానికి పెరుగుతుందని ఏడీబీ అంచనావేసింది. ప్రైవేటు వినియోగం, పెట్టుబడులు పెరగడం దీనికి కారణంగా చూపింది. రవాణా రంగం పురోగతికి, వ్యాపార పరిస్థితులు మెరుగుపడ్డానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ఫలితాలు ఇస్తాయని ఏడీబీ వివరించింది. అంతర్జాతీయంగా పలు దేశాలు మాంద్యం ముంగిట నుంచున్నప్పటికీ, భారత్ ఎకానమీ తన సహచర దేశాల ఎకానమీలతో పోల్చితే పటిష్టంగా ఉందని ఏడీబీ కంట్రీ డైరెక్టర్ టకియో కినీషీ పేర్కొన్నారు.

వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వండి.. ఉక్కు ఇస్తాం

వైజాగ్ స్టీల్ వినూత్న ప్రతిపాదన



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ (ఆర్‌ఐఎన్‌ఎల్ - వైజాగ్ స్టీల్) నిధుల సమీకరణ కోసం మార్గాలు అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా తమకు నిర్వహణ మూలధనం లేదా ముడి సరుకును సమకూర్చే కంపెనీలకు ప్రతిగా ఫినిష్డ్ ఉక్కు ఉత్పత్తులను సరఫరా చేసే వినూత్న ప్రతిపాదనను తొలిసారిగా తెరపైకి తెచ్చింది. దీనికి సుముఖంగా ఉన్న ఉక్కు, ఉక్కు సంబంధ ముడి వస్తువుల వ్యాపారం చేసే సంస్థలు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఈవోఐ) సమర్పించాలని ఆహ్వానించింది. కోకింగ్ కోల్, ఇనుప ఖనిజం మొదలైన వాటిని సరఫరా చేయడం లేదా నిర్వహణ మూలధనం సమకూర్చడం ద్వారా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావచ్చని ఒక నోటీసులో ఆర్‌ఐఎన్‌ఎల్ తెలిపింది. దానికి బదులుగా పరస్పరం ఆమోదయోగ్యమైన నిబంధనల ప్రకారం ఉక్కు ఉత్పత్తులను పొందవచ్చని వివరించింది. ఈవోఐల దాఖలుకు ఏప్రిల్ 15 ఆఖరు తేదీ.

ఆసియా కుబేరుడు ముకేశ్

- టాప్-10 ప్రపంచ సంపన్నుల్లో చోటు
- 24వ ర్యాంకుకు జారిన అదానీ
- ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల



న్యూఢిల్లీ: ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ తిరిగి టాప్ ర్యాంకును కైవసం చేసుకున్నారు. 83.4 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియా కుబేరుడిగా ఆవిర్భవించారు. ప్రపంచ కుబేరుల్లో 9వ ర్యాంకును ఆక్రమించారు. వ్యక్తిగత సంపదపై ఫోర్బ్స్ విడుదల చేసిన 2023 ప్రపంచ బిలియనీర్ల తాజా జాబితాలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 24వ ర్యాంకుకు దిగిపోయారు. ఈ ఏడాది జనవరి 24న గౌతమ్ అదానీ 126 బిలియన్ డాలర్ల ఆస్తులతో ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా మూడో ర్యాంకులో నిలిచారు. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక నేపథ్యంలో అదానీ సంపద 47.2 బిలియన్ డాలర్లకు పడిపోయింది.

ప్రపంచ కుబేరుల తీరిలా

అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ సంపదలో 38 శాతం(57 బిలియన్ డాలర్లు) నష్టపోయారు. ఫలితంగా ప్రపంచ కుబేరుల్లో రెండు నుంచి మూడో స్థానానికి తగ్గారు. ఈ ఏడాది టెస్లా చీఫ్ ఎలన్ మస్క్ సంపదలో 39 బిలియన్ డాలర్లు ఆవిరికావడంతో రెండో ర్యాంకుకు పరిమితమయ్యారు. కాగా.. విలాస వస్తువుల ఫ్రెంచ్ టైకూన్ బెర్నార్డ్ ఆర్నాల్ట్ 211 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌తో తొలిసారి ప్రపంచ టాప్ ర్యాంకును ఆక్రమించారు. మస్క్ సంపద 180 బిలియన్ డాలర్లు కాగా, బెజోస్ ఆస్తులు 114 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఈ-కామర్స్ వ్యాపారంలోకి ఫోన్‌పే

పిన్‌కోడ్ పేరుతో షాపింగ్ యాప్

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే తాజాగా ఈ-కామర్స్ వ్యాపారంలోకి ప్రవేశించింది. పిన్‌కోడ్ పేరిట షాపింగ్ యాప్‌ను రూపొందించింది. తొలుత బెంగళూరులో ఈ యాప్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఫోన్‌పే వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్ తెలిపారు. రోజుకు 10,000 పైచిలుకు లావాదేవీలు సాధించిన తర్వాత ఇతర నగరాలకు కూడా దీన్ని విస్తరిస్తామని చెప్పారు. డిసెంబర్ నాటికి రోజుకు లక్ష లావాదేవీలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వినియోగదారులకు సంబంధించి గత ఏడేళ్లలో ఫోన్‌పే నుంచి ఇది రెండో యాప్ అని చెప్పారు. కేంద్రం తీర్చిదిద్దిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫాం ఆధారంగా పిన్‌కోడ్ యాప్‌ను రూపొందించారు.

విప్రో కన్జూమర్ అమ్మకాలు @ రూ. 10 వేల కోట్లు

న్యూఢిల్లీ: ఇటీవలే ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయం రూ. 10,000 కోట్ల మైలురాయిని దాటినట్లు విప్రో కన్జూమర్ కేర్ అండ్ లైటింగ్ వెల్లడించింది. వివిధ ప్రాంతాలు, బ్రాండ్లు, కేటగిరీలవారీగా విక్రయాలు గణనీయంగా వృద్ధి చెందడం ఇందుకు దోహదపడినట్లు పేర్కొంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 8,634 కోట్లుగా నమోదైంది. దేశీయంగా ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్)వ్యాపార విభాగం 17 శాతం పెరిగినట్లు తెలిపింది. సబ్బుల బ్రాండ్ సంతూర్ ఇప్పుడు నిర్దిష్ట విభాగంలో రూ. 2,650 కోట్ల అమ్మకాలతో రెండో స్థానానికి చేరిందని పేర్కొంది. అటు వియత్నాం మార్కెట్‌లో రెండంకెల స్థాయి వృద్ధితో 10 కోట్ల డాలర్ల ఆదాయం మార్కును దాటినట్లు .. దక్షిణాఫ్రికా, మధ్యప్రాచ్యం, ఫిలిప్పీన్స్ తదితర మార్కెట్లలోను రెండంకెల స్థాయి వృద్ధి సాధించినట్లు కంపెనీ తెలిపింది. 2003లో రూ. 300 కోట్ల ఆదాయం ఉండగా .. గత రెండు దశాబ్దాల్లో 33 రెట్లు పెంచుకుని నేడు అంతర్జాతీయ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజంగా ఎదిగామని సంస్థ సీఈవో వినీత్ అగ్రవాల్ తెలిపారు. 1945లో వనస్పతి సంస్థగా ప్రారంభమైన విప్రో కన్జూమర్ కేర్ అండ్ లైటింగ్‌కు ప్రస్తుతం 60 పైగా దేశాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. 18 ఫ్యాక్టరీలు, 10,000 మంది పైచిలుకు సిబ్బంది ఉన్నారు. ఆదాయంలో 51 శాతం వాటా అంతర్జాతీయ వ్యాపారం నుంచి ఉంటోంది.



భవిత

తెలంగాణ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్స్ట్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డిగ్రీతో 7500 కేంద్ర కొలువులు

ఎస్ఎస్‌సీ సీజీఎల్-2023 నోటిఫికేషన్ విడుదల

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ లెవల్(సీజీఎల్) పరీక్ష-2023కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 7500
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఐబీ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఎవోఆర్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఎంవోఈఏ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎఫ్‌హెచ్‌క్యూ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఈ అండ్ ఐటీ), అసిస్టెంట్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్/పీజీ డిగ్రీ/ఎంబీఏ(ఫైనాన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.08.2023 నాటికి ఖాళీలను అనుసరించి 18-27 ఏళ్లు, 20-30 ఏళ్లు, 18-30 ఏళ్లు, 18-32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్ల పాటు వయోసడలింపు కల్పించారు. వీరితో పాటు దివ్యాంగులకు ప్రత్యేకంగా వయో సడలింపు ఇచ్చారు.
- **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.1,51,100(ఆయా పోస్టును బట్టి)
- **ఎంపిక విధానం:** టైర్-1, టైర్-2 ఎగ్జామినేషన్, డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్, ఫిజికల్/మెడికల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో రూ.100ను ఎగ్జామ్ ఫీజుగా చెల్లించాలి (ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది).
- **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.04.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.05.2023.
- **టైర్-1 పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** జూలై 2023.
- **టైర్-2 పరీక్ష తేది:** ప్రకటించాల్సి ఉంది.
- **వెబ్‌సైట్:** www.ssc.nic.in

ఎంపీసీ.. ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో!

ఇంటర్మీడియెట్.. పరీక్షలు రాశారా.. భవిష్యత్ ఉన్నత విద్యావకాశాల గురించి ఆలోచిస్తున్నారా.. బీటెక్‌తోపాటు.. ఇతర కోర్సులు ఏమున్నాయని అన్వేషిస్తున్నారా?! ఇంటర్ ఎంపీసీతో ఇంజనీరింగ్‌తోపాటు అనేక వినూత్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటి గురించి ముందుగానే తెలుసుకొని సన్నద్ధమైతే లక్ష్య సాధన సులువవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో.. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్య కోర్సుల వివరాలు..

» ఇంటర్మీడియెట్ ఎంపీసీ అర్హతతో అనేక ఉన్నత విద్యావకాశాలు
» ఇంజనీరింగ్, సైన్స్, లా, ఫార్మసీ, ఫ్యాషన్ కోర్సుల్లో చేరొచ్చు



ఆఫ్టర్ ఇంటర్

ఇంజనీరింగ్.. ఎవర్‌గ్రీన్

ఇంజనీరింగ్(బీఈ/బీటెక్).. ఎంపీసీ విద్యార్థులకు ఎవర్‌గ్రీన్ కోర్సు. ఇందుకోసం జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, టీఎస్ ఎంసెట్, ఏపీ ఈఏపీసెట్, బిట్‌శాట్ వంటి ఎంట్రన్స్ టెస్ట్‌లకు విద్యార్థులు సిద్ధమవుతుంటారు.

జేఈఈ-మెయిన్

జేఈఈ-మెయిన్.. జాతీయ స్థాయిలోని ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రామాణికంగా నిలుస్తున్న పరీక్ష ఇది. మొత్తం మూడు విభాగాల్లో(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. జేఈఈ-మెయిన్‌తో బీటెక్ మాత్రమే కాకుండా..నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో సైతం ప్రవేశం లభిస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్వహించే జేఈఈ-మెయిన్ పేపర్-2లో ర్యాంకు పొందాల్సి ఉంటుంది. పేపర్-2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మరో పేపర్‌లో పరీక్ష నిర్వహిస్తారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jeemain.nta.nic.in

జేఈఈ-అడ్వాన్స్‌డ్

ఐఐటీ క్యాంపస్‌ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. జేఈఈ అడ్వాన్స్‌డ్. జేఈఈ-మెయిన్ పేపర్-1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా ఐఐటీలతోపాటు ఐఐఎస్‌టీ, ఐఐఎస్‌సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశం పొందొచ్చు.

2023కు సంబంధించి జేఈఈ-అడ్వాన్స్‌డ్ దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 30 నుంచి మొదలు కానుంది. ఎంట్రన్స్‌ను జూన్ 4న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.jeeadv.ac.in

టీఎస్ ఎంసెట్/ఏపీ ఈఏపీసెట్

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్‌లు టీఎస్ ఎంసెట్, ఏపీ ఈఏపీసెట్.
- తెలంగాణ రాష్ట్రంలో ఎంసెట్ పేరుతో, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఈఏపీ(ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ) సెట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.
- రెండు స్ట్రీమ్‌లకు సంబంధించి 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ, మెడిసిన్ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.
- టీఎస్ ఎంసెట్-2023(ఇంజనీరింగ్ స్ట్రీమ్) పరీక్షను మే 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. ఏప్రిల్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://eamcet.tsche.ac.in
- ఏపీ ఈఏపీసెట్-2023 ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే 15నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

బిట్‌శాట్

బీటెక్ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో ఎంట్రన్స్ టెస్ట్.. బిట్ శాట్. ఇంజనీరింగ్ విద్యలో పేరు గడించిన ది బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ -పిలానీ) బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బిట్‌శాట్ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ప్రతిభ ద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఉంది.

- ఈ పరీక్షను కూడా పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలోనే ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. అవి.. ఫిజిక్స్; కెమిస్ట్రీ; ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్; మ్యాథమెటిక్స్(ఇంజనీరింగ్ ఔత్సాహికులకు); బయాలజీ(బీఫార్మసీ అభ్యర్థులు). మొత్తం 130 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- 2023కు సంబంధించి బిట్‌శాట్-2023 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది బిట్‌శాట్‌ను రెండు దశలుగా నిర్వహించనున్నారు. తొలిదశకు ఏప్రిల్ 9 వరకు; రెండో దశకు మే 22 నుంచి జూన్ 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. తొలిదశ పరీక్ష మే 21-26, రెండో దశ పరీక్ష జూన్ 18-22 తేదీల్లో నిర్వహిస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: www.bitsadmission.com

ఆర్కిటెక్చర్‌కు నాటా

ఎంపీసీతో ప్రవేశం పొందే అవకాశమున్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఇందులో ప్రవేశానికి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా బీఆర్క్ కోర్సులో చేరొచ్చు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు(200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రస్తుతం నాటా-2023 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం మూడు విడతల్లో నిర్వహించనున్నారు. తొలి విడత ఏప్రిల్ 21న, రెండో విడత మే 28న, మూడో విడత జూలై 9న నిర్వహించనున్నారు. తొలి విడత దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 10.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

ఐఐఎస్ఈఆర్.. బీఎస్+ఎంఎస్

సైన్స్ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు అందుబాటులో చక్కటి మార్గం..ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)క్యాంపస్‌లలో బీఎస్+ఎంఎస్! ఇందుకోసం 3 అర్హత ప్రమాణాలను నిర్దేశించారు.

- అవి.. జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో పది వేలలోపు ర్యాంకు సాధించిన వారు నేరుగా ఐఐఎస్ఈఆర్ అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- కేవీపీవై ఎస్ఏ స్ట్రీమ్‌లో సైన్స్ సబ్జెక్ట్‌లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా ఐఐఎస్ఈఆర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఐఐఎస్ఈఆర్ నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ర్యాంకుతోనూ ప్రవేశం పొందొచ్చు. ఈ టెస్ట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లలో 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలతో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. 2023 సంవత్సరానికి సంబంధించి ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను జూన్ 17న నిర్వహించనున్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలకు వెబ్‌సైట్: https://iiseradmission.in

హోటల్ మేనేజ్‌మెంట్

వినూత్న కెరీర్‌ను కోరుకునే విద్యార్థులు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంచుకోవచ్చు. జాతీయ స్థాయిలో టూరిజం శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును అందిస్తున్నాయి. ఇందులో ప్రవేశానికి ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఈ ఎంట్రన్స్‌ను అయిదు విభాగాల్లో (న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్; రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్; ఇంగ్లిష్ లాంగ్వేజ్; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్) 200 ప్రశ్నలు అడుగుతారు. 2023కు సంబంధించి ఎన్‌సీహెచ్‌ఎం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఏప్రిల్ 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రన్స్ టెస్ట్‌ను మే 14న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in

'న్యాయ శాస్త్రం'లో ఎల్ఎల్‌బీ

ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే లాసెట్‌లో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

- ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ లాసెట్ పరీక్ష.. మూడు విభాగాల్లో(జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ; కరెంట్ అఫైర్స్; ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా) 120 మార్కులకు నిర్వహిస్తున్నారు.
- తెలంగాణలో టీఎస్ లాసెట్ పేరుతో ఎంట్రన్స్ నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష కూడా ఏపీ లాసెట్ మాదిరిగానే ఉంటుంది.
- టీఎస్ లాసెట్ 2023, ఏపీ లాసెట్‌లకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.
- టీఎస్ లాసెట్ వివరాలకు వెబ్‌సైట్: https://lawcet.tsche.ac.in
- ఏపీ లాసెట్ వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

క్లాట్‌తో నేషనల్ లా స్కూల్స్

న్యాయ విద్యలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా యూనివర్సిటీల్లో.. ఇంటర్‌తోనే ప్రవేశం పొందొచ్చు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్ఎల్‌బీలో అడ్మిషన్ కోసం కామన్ లా అడ్మిషన్ టెస్ట్-యూజీ (క్లాట్-యూజీ) ఎంట్రన్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత, బెస్ట్ స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలో నెలకొల్పిన 22 లా యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకోవచ్చు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ

వినూత్న కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం .. నిఫ్ట్ కోర్సులు. ఫ్యాషన్ కోర్సులను అందించడంలో జాతీయ స్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఇంటర్మీడియెట్ అర్హతగా బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సును నిఫ్ట్ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. ఈ కోర్సులను పూర్తి చేసుకున్న వారికి గార్మెంట్స్, ఫ్యాషన్ సంబంధిత విభాగాల్లో చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

బీఫార్మసీ, ఫార్మ్-డి

బీఫార్మసీ..ఫార్మసీ రంగంలో అడుగు పెట్టే అవకాశం కల్పించే కోర్సు. ఇందులో ఎంపీసీ విద్యార్థులకు కూడా అవకాశం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో బీ ఫార్మసీ, ఫార్మ్-డి కళాశాలల్లో సీట్ల భర్తీని ఎంసెట్(తెలంగాణలో), ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్)లో ర్యాంకు ఆధారంగా చేపడతారు. మొత్తం బీఫార్మసీ సీట్లలో 50 శాతం సీట్లను ఎంపీసీ విద్యార్థులకు కేటాయిస్తారు. బీ.ఫార్మసీ పూర్తి చేసుకుంటే.. ఫార్మాస్యుటికల్ సంస్థలు, డ్రగ్ డిస్కవరీ, ఫార్ములేషన్, బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ సంస్థల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

క్లుప్తంగా...

కొలంబోలో భారత్, శ్రీలంక 'స్లైనిక్స్' విన్యాసాలు



దొండపర్తి(విశాఖ దక్షిణ): భారత్, శ్రీలంక నావికాదళాల 10వ వార్షిక స్లైనిక్స్ ద్వైపాక్షిక సముద్ర విన్యాసాలు శ్రీలంకలోని కొలంబోలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 8 వరకు హార్బర్, సీ ఫేజ్‌లలో ఈ ప్రదర్శనలు కొనసాగుతాయి. భారత నౌకాదళం నుంచి ఐఎన్ఎస్ కిల్తాన్, ఐఎన్ఎస్ సావిత్రి, శ్రీలంక నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ గజబాహు, ఎస్ఎల్ఎన్ఎస్ సాగర యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. అలాగే భారత నౌకాదళానికి చెందిన చేతక్ హెలికాప్టర్, డోర్నియర్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, శ్రీలంకకు చెందిన డోర్నియర్ హెలికాప్టర్లు తమ శక్తియుక్తులను ప్రదర్శిస్తాయి. భారత్, శ్రీలంక నౌకాదళాల మధ్య కార్యకలాపాలు మెరుగుదల, పరస్పర అవగాహన కోసం ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు ఇరుదేశాల నావికాదళాలు ప్రకటించాయి.

తిరుపతి జిల్లాలో స్వల్ప భూ ప్రకంపనలు

దొరవారిసత్రం/నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణం, దొరవారిసత్రం మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం స్వల్పంగా భూమి కంపించింది. కొన్ని క్షణాల పాటు పెద్ద పెద్ద శబ్దాలు వచ్చి భూమి కదలడంతో జనం భయాందోళనకు గురయ్యారు. దొరవారిసత్రం, ఏకొల్లు, మేలనాలత్తూరు గ్రామాల్లో భూమి కంపించింది. భూ ప్రకంపనలతో ఏకొల్లు గ్రామ సచివాలయం సిబ్బంది బయటకు పరుగులు తీశారు.

వినూత్నంగా 'మన్యం జిల్లా' ఆవిర్భావ దినోత్సవం



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీకి సున్నం వేస్తున్న కలెక్టర్, ఎస్పీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి మంగళవారానికి ఏడాది పూర్తైన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధికారులు వినూత్నంగా నిర్వహించారు. శ్రమదానంతో జిల్లా కేంద్రంలోని అన్ని ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దేందుకుగాను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తమ బృందాలతో పాటుగా శ్రమదానంలో పాల్గొన్నారు. జేసీ ఆనంద్ చీపురు పట్టి గోడలకు సున్నం వేశారు. కాలువల్లోని పూడికలు తొలగించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్ఫూర్తి సందేశం ఇవ్వాలన్న ఉద్దేశంతో శ్రమదానం చేశామన్నారు. పార్వతీపురం సుందర పట్టణంగా తీర్చిదిద్దడంలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డీఆర్వో వెంకటరావు, ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రిటన్ యుద్ధ నౌక పర్యటన

విశాఖ నుంచి తిరుగు పయనమైన హెచ్ఎంఎస్ తమర్



తూర్పు నావికాదళం అధికారి మనీష్‌శర్మతో మాట్లాడుతున్న బ్రిటన్ నౌకాదళ అధికారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): బ్రిటన్ యుద్ధ నౌక హెచ్ఎంఎస్ తమర్ విశాఖ పర్యటన మంగళవారం ముగిసింది. రెండు రోజుల క్రితం నౌక విశాఖ పోర్టుకు చేరుకోగా.. ఆ దేశ నౌకాదళ అధికారులు విజయనగరం జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలను సందర్శించారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు క్రాస్–డెక్ సందర్శనలు చేశారు. హెచ్ఎంఎస్ తమర్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సీడీఆర్ మాథ్యూ, నౌకాదళ సలహాదారుడు(బ్రిటిష్ హైకమిషన్, న్యూఢిల్లీ) కెప్టెన్ ఇయాన్ లిన్‌తో తూర్పు నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ మంగళవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం యుద్ధ నౌక విశాఖ నుంచి తిరుగు పయనమైంది.

ఖాళీలను వెంటనే భర్తీ చేయండి: సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ కాలేజీల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో 854 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఆరేళ్లుగా నోటిఫికేషన్ లేదని పేర్కొన్నారు. ఆ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు.

రైలు ప్రమాదాన్ని తప్పించిన బామ్మ

రైలు పట్టాలపై కూలిన భారీ వృక్షం

- ఎర్రటి వస్త్రం ఊపుతూ వెళ్లి రైలు ఆపేసిన వృద్ధురాలు
- గుండె ఆపరేషన్ చేయించుకున్నా సాహసం
- పెను ప్రమాదం తప్పటంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు, అధికారులు



సాక్షి బెంగళూరు: రైలు పట్టాలపై ఓ పెద్ద చెట్టు విరిగిపడింది. అంతలోనే ఆ పట్టాలపై రైలు వస్తోంది. మరికొద్ది నిమిషాల్లో పెను ప్రమాదం జరిగేదే. కానీ.. ఓ బామ్మ ఎరుపు రంగు వస్త్రంతో దేవతలా వచ్చి ఆ రైలును ఆపేసింది. ఇదేదో సినిమాలో సీన్ కాదు. నిజంగా జరిగిన ఉదంతం. ఈ ఘటన మంగళూరు–పడీల్ జోకెట్ట మధ్యలో గల పచ్చనాడి సమీపంలోని మందారలో మార్చి 21వ తేదీన చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్చి 21న మధ్యాహ్నం 2.10 గంటలకు రైలు పట్టాలపై ఒక భారీ వృక్షం విరిగి పడింది. అదే సమయంలో మంగళూరు నుంచి ముంబై వెళ్లే మత్స్యగంధ రైలు వస్తోంది. దీన్ని గమనించిన 70 ఏళ్ల వృద్ధురాలు చంద్రావతి ఇంట్లోంచి ఎరుపు రంగు వస్త్రం తెచ్చి రైలుకు ఎదురుగా వెళ్లి జెండాలా ఊపుతూ నిలబడింది. దీనిని పసిగట్టిన లోకో పైలట్ రైలు వేగాన్ని తగ్గించి ఆపేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం స్థానికులు, రైల్వే సిబ్బంది పట్టాలపై పడిన చెట్టును పక్కకు తొలగించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో రైల్వే అధికారులు, ప్రయాణికులు చంద్రావతిని అభినందించారు.

'ఏం చేయాలో పాలుపోలేదు'

ఈ ఘటనపై చంద్రావతి మాట్లాడుతూ 'ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి బయట కూర్చొన్నాను. మా అక్క ఇంట్లోనే నిద్రపోతోంది. ఉన్నట్టుండి ఇంటి ఎదురుగా ఉన్న పట్టాలపై పెద్ద చెట్టు విరిగిపడింది. అదే సమయంలో మంగళూరు నుంచి ముంబైకి రైలు వెళుతుందనే విషయం గుర్తుకొచ్చింది. ఏం చేయాలో పాలుపోలేదు. ఎవరికైనా ఫోన్ చేసి చెబుదామని ఇంటి లోపలికి వెళ్లాను. అంతలోనే రైలు హారన్ వినిపించింది. వెంటనే ఇంట్లో ఉన్న ఎరుపు రంగు వస్త్రం తీసుకుని పట్టాల వద్దకు పరుగు తీశాను. నాకు గుండె ఆపరేషన్ అయింది. అయినా లెక్కచేయలేదు. రైలు వస్తున్నప్పుడు పట్టాల పక్కన నిలబడి ఆ ఎరుపు రంగు వస్త్రాన్ని ఊపాను. వెంటనే రైలు నెమ్మదించి ఆగిపోయింది. సుమారు అరగంట పాటు పట్టాలపై రైలు ఆగింది. స్థానికుల సహకారంతో ఆ చెట్టును తొలగించారు' అని చెప్పింది. చంద్రావతి చేసిన సాహస కార్యాన్ని ప్రజలంతా అభినందించారు.

'చంద్రయాన్-3'పై ఇస్రో సదస్సు



సదస్సు అనంతరం శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): జూన్ నెలాఖరులో నిర్వహించనున్న చంద్రయాన్–3 ప్రయోగంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ (డాస్) ఆధ్వర్యాన బెంగళూరు సమీపంలోని బైలాలులో ఉన్న ఇండియన్ స్పేస్ సైన్స్ డేటా సెంటర్‌లో రెండురోజుల వర్క్‌షాప్ జరిగిందని ఇస్రో తన అధికారిక వెబ్‌సైట్‌లో మంగళవారం పేర్కొంది. చంద్రయాన్–3 మిషన్, సైన్స్, డేటా అనాలిసిస్'పై ఈ సదస్సు నిర్వహించారు. చంద్రుడిపై భారత్ అన్వేషణ, డేటా ఆర్కైవల్, శాస్త్రీయ ఉపయోగాల వ్యాప్తిపై పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు. ఇస్రో, డాస్ సంస్థల నుంచి దాదాపు 20మంది శాస్త్రవేత్తలు చంద్రుడిపై పరిశోధనలకు ఉపయోగించే పేలోడ్స్‌పై ప్రదర్శనలిచ్చి ప్రయోగాత్మక సెషన్లను నిర్వహించారు. ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్, ఇస్ట్రాక్ డైరెక్టర్ బీఎస్ రామకృష్ణ, స్పేస్ సైన్స్ ప్రోగ్రాం ఆఫీస్ డైరెక్టర్ డాక్టర్ తీర్థ ప్రతిమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై ప్రొక్లెయినర్లతో దాడి

- శ్రీకాకుళం జిల్లా దండుగోపాలపురంలో టీడీపీ నాయకుల గూండాగిరి
- జగనన్న కాలనీలోని ఇళ్లను అర్ధరాత్రి సమయంలో కూల్చివేసిన టీడీపీ నాయకులు
- లబ్ధిదారులను భయపెట్టి.. స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర
- నేలమట్టమైన ఇళ్లను చూసి భోరున విలపిస్తున్న బాధితులు
- గ్రామస్తులు తిరగబడటంతో నిందితులు పరారీ



నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేసిన దృశ్యం

సంతబొమ్మాళి: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లపై టీడీపీ నాయకులు అర్ధరాత్రి సమయంలో ప్రొక్లెయినర్లతో దాడి చేశారు. నిర్దాక్షిణ్యంగా పేదల ఇళ్లను కూల్చివేశారు. లబ్ధిదారులను భయపెట్టి అక్కడి నుంచి తరిమేసి.. స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లాలో జరిగింది. వివరాలు.. సంతబొమ్మాళి మండలంలోని దండుగోపాలపురంలో గొనప సునీత, కోత అమ్మోజీ, నొపడ తవిటమ్మ, బస్వల తులసమ్మ, బస్వల మహాలక్ష్మి, గోరుబండ తులసమ్మకు ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చింది. దీంతో వారు అక్కడ ప్రభుత్వ సాయంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే ఎప్పటి నుంచో ఈ స్థలంపై స్థానిక టీడీపీ నాయకులు కన్నేశారు. ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకోవడంతో.. లబ్ధిదారులను భయపెట్టి అక్కడి నుంచి తరిమేసేందుకు ఇదే సరైన సమయమనుకున్నారు. సోమవారం అర్ధరాత్రి ప్రొక్లెయినర్లతో ఆ ఏడుగురి ఇళ్ల నిర్మాణాలపై దాడి చేసి.. వాటిని కూల్చివేశారు. మంగళవారం ఉదయం అక్కడకు చేరుకున్న లబ్ధిదారులు.. నేలమట్టమైన తమ ఇళ్లను చూసి భోరున విలపించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామస్తులంతా తిరగబడటంతో నిందితులైన టీడీపీ నాయకులు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని పారిపోయారు. కాగా, ఇళ్ల కూల్చివేతపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, బెండి విష్ణు, బెండి సూర్యనారాయణ, రాము, అరుణ్‌కుమార్, కైలాష్, ప్రదీప్, అనిల్, బాలక ప్రసాద్, నారాయణ, పొందల సురేశ్, మధు, ఆరంగి శ్రీధర్, హరిపై కేసు నమోదు చేసినట్లు సంతబొమ్మాళి ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

జగనన్న మహిళా మార్టులు అద్భుతం

- కేరళ కుదుంబశ్రీ విభాగం ఈడీ బృందం ప్రశంస
- తమ రాష్ట్రంలోనూ ఏర్పాటు చేస్తామని వెల్లడి
- మార్టుల నిర్వహణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించిన మెప్మా




గత నెలలో శ్రీకాకుళంలోని జగనన్న మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న కేరళ కుదుంబశ్రీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్ ఖాన్ బృందం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్టుల నిర్వహణ అద్భుతంగా ఉందని కేరళకు చెందిన అధికారులు కితాబిచ్చారు. అతి తక్కువ పెట్టుబడితో స్వయం సహాయక సంఘాల మహిళలు సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇంత ఘన విజయం సాధించడం దేశంలో ఎక్కడా చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మహిళలను స్వయం శక్తిగా తీర్చిదిద్దిన పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) కృషిని అభినందించారు. ఈ తరహా మార్టులను కేరళ రాష్ట్రంలోనూ ప్రవేశపెడతామని పేర్కొన్నారు. ఏపీలోని స్వయం సహాయక సంఘాల మహిళల ప్రగతిని, స్థితిగతులను పరిశీలించేందుకు గతనెలలో కేరళకు చెందిన కుదుంబశ్రీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్ మాలిక్ ఆధ్వర్యంలో అధికారులు రాష్ట్రంలో పర్యటించారు. అందులో భాగంగా వారు శ్రీకాకుళంలోని జగనన్న మహిళా మార్టును, విశాఖపట్నంలోని అర్బన్ మార్కెట్లను పరిశీలించారు.

నిర్వహణకు ఏకీకృత సాఫ్ట్‌వేర్

రెండేళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టుగా తొలి జగనన్న మహిళా మార్టును పులివెందులలో 'మెప్మా' ఏర్పాటు చేసింది. తర్వాత వివిధ దశల్లో రాయచోటి, అద్దంకి, పుంగనూరు, తిరుపతి, చిత్తూరు, శ్రీకాకుళంలో మొత్తం 7 మహిళా మార్టులను అందుబాటులోకి తెచ్చారు. అన్ని స్టోర్లలోనూ స్థానిక పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని ఒక్కో మహిళా రూ.150 చొప్పున వాటాగా పెట్టారు. ఒక్కో స్టోర్‌లో 8 వేల నుంచి గరిష్టంగా 37 వేల మంది వరకు వాటాదారులుగా ఉన్నారు. ఒక్కో మార్ట్ నెలకు రూ.13.50 లక్షల నుంచి రూ.32.56 లక్షల వరకు అమ్మకాలు చేస్తున్నాయి. మొత్తం అన్ని మార్టుల నిర్వహణకు మెప్మా అధికారులు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ప్రతి వస్తువు అమ్మకంపై వచ్చే లాభాలు సైతం కంప్యూటర్‌లో కనిపిస్తుండడంతో 7 మార్టుల సంఘాలు అమ్మకాలు చేసేందుకు పోటీ పడుతున్నాయి.

మన మార్ట్ మోడల్ నచ్చింది..



జగనన్న మహిళా మార్టుల పనితీరు కేరళ అధికారులకు బాగా నచ్చింది. త్వరలో గుంటూరు, రాజమండ్రి, ఒంగోలు, మంగళగిరి, విజయవాడల్లోనూ జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేస్తాం. లాభాలు ఆశించకుండా నాణ్యమైన సరుకులను అందిస్తుండడంతో మార్టులకు మంచి ఆదరణ లభిస్తోంది.

– విజయలక్ష్మి, మెప్మా ఎండీ

జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్‌కు 9.4లక్షల మంది

▶ మొదటి పేజీ తరువాయి

హాజరయ్యే అవకాశముందని పేర్కొంది. దేశంలో 330 పట్టణాలు, విదేశాల్లోని 15 పట్టణాల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 25 పట్టణాల్లో ఈ పరీక్షలకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 6వ తేదీనుంచి 15వ తేదీవరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇంతకుముందు ఈ పరీక్షల షెడ్యూల్‌లో 6వ తేదీనుంచి 12వ తేదీవరకు నిర్వహిస్తామని పేర్కొన్నా.. అభ్యర్థుల సంఖ్య పెరగడంతో 13, 15 తేదీల్లో కూడా పరీక్ష నిర్వహించనున్నట్లు అడ్మిట్‌కార్డుల్లో పొందుపరిచింది. ప్రస్తుతం తొలిరోజు పరీక్ష రాసేవారి అడ్మిట్‌కార్డులను ఎన్‌టీఏ విడుదల చేసింది. తదుపరి రోజులకు సంబంధించి పరీక్షరాసే వారి అడ్మిట్‌కార్డులను వరుసగా ముందు రోజుల్లో ఇవే వెబ్‌సైట్లలో ఉంచనుంది. పుట్టిన తేదీ, అప్లికేషన్ నంబరు నమోదు చేయడం ద్వారా అభ్యర్థులు అడ్మిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఎన్టీఏ తెలిపింది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అడ్మిట్‌కార్డు కాపీలతో పాటు చెల్లుబాటయ్యే ఫొటో గుర్తింపుకార్డు కూడా తీసుకురావాలని సూచించింది.

తొలి సెషన్ కన్నా ఎక్కువమంది అభ్యర్థులు

జనవరిలో నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షకన్నా రెండో సెషన్‌కు ఎక్కువమంది హాజరుకానున్నారని ఎన్‌టీఏ అడ్మిట్‌కార్డుల నోట్‌లో తెలిపింది. తొలి సెషన్‌లో 8.6 లక్షల మంది నమోదు చేసుకోగా ఈసారి 9.4 లక్షల మంది పరీక్ష రాయనున్నట్లు పేర్కొంది. జనవరి సెషన్ సమయంలో ఇంటర్ పరీక్షల సన్నద్ధతతో పాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉండడంతో ఈ పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య తక్కువే. అప్పుడు పరీక్ష రాయని వారితోపాటు రాసినవారు కూడా రెండో సెషన్‌లో పరీక్ష రాయనున్నారు. ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులకు జేఈఈ పరీక్షకు వెసులుబాటు కలిగింది. తొలిసెషన్ పరీక్షకు 8,60,064 మంది పేపర్–1కు, 46,465 మంది పేపర్–2కు రిజిస్టరయ్యారు. వీరిలో పేపర్–1కి 8,23,967 (95.80 శాతం) మంది, పేపర్–2కి 95 శాతానికిపైగా హాజరయ్యారు.

2.5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక

జేఈఈ మెయిన్ రెండు విడతల పరీక్షలకు సంబంధించిన తుది ర్యాంకులతో ఫలితాలు ఈనెలాఖరునాటికి విడుదల కానున్నాయి. రెండు సెషన్లలో సాధించిన మార్కుల్లో ఎక్కువ మార్కులను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ప్రకటిస్తారు. ఏప్రిల్ 30 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు ప్రక్రియ మొదలు కానున్నందున అంతకు ముందే ఈ ఫలితాలు వెలువడనున్నాయి. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన తొలి 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌లో దరఖాస్తుకు అవకాశమిస్తారు.

ఏపీలో 25 సెంటర్లు ఇవే..

అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, నరసరావుపేట, ప్రొద్దుటూరు, సూరంపాలెం, అమరావతి, గూడూరు, మచిలీపట్నం, నంద్యాల, తాడేపల్లిగూడెం.

కటాఫ్ 87 నుంచి 90 మార్కుల వరకు

జేఈఈ మెయిన్ నుంచి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడానికి కటాఫ్ మార్కులు జనరల్ కేటగిరీలో 87 నుంచి 90 వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కటాఫ్ మార్కులు పెరుగుతాయని భావిస్తున్నారు. గతేడాది జనరల్ కటాఫ్ మార్కులు 88. గత ఐదేళ్ల కటాఫ్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటే ఈ సారి కటాఫ్ ఇంచుమించు 90 వరకు ఉంటుందని తెలుస్తోంది.

గత ఐదేళ్లలో జేఈఈ మెయిన్ కటాఫ్ మార్కులు, ఈ ఏడాది అంచనా వివరాలు

కేటగిరీ	2018	2019	2020	2021	2022	2023 (అంచనా)
జనరల్	74	89	90	87	88	87-90
ఈడబ్ల్యూఎస్‌సీ	-	-	70	66	63	63-67
ఓబీసీ	45	74	72	68	67	67-72
ఎస్సీ	29	54	50	46	43	43-47
ఎస్టీ	24	44	39	34	26	25-30
పీడబ్ల్యూడీ	-	35	0.11	0.069	0.0096	0.0031



'మార్కెట్'లో సౌందర్యలహరి

విస్తరిస్తున్న సౌందర్య ఉత్పత్తుల మార్కెట్

ప్రపంచ బ్యూటీ ఉత్పత్తుల వినియోగంలో భారత్ 7వ స్థానం


అందానికి దాసోహమవని వారు ప్రపంచంలో ఉంటారా? సౌందర్యారాధన లేని వారు ఉంటారా? అందుకే సౌందర్య ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ పెరుగుతోంది. పట్టణాల్లోనే కాదు గ్రామాల్లోనూ బ్యూటీ పార్లర్లు, స్టైలిష్ హబ్‌లు వెలుస్తున్నాయి. ఫేస్‌వాష్‌లు, మాయిశ్చరైజర్ల నుంచి కంటి క్రీమ్‌లు, ఫేస్ మాస్కులు, సన్‌స్క్రీన్ లోషన్‌తో అన్నింటినీ మహిళలు, పురుషులు, పిల్లల కోసం కంపెనీలు ప్రత్యేకంగా తయారు చేస్తున్నాయి. 2018లో ప్రపంచ వ్యాప్తంగా సౌందర్య ఉత్పత్తుల మార్కెట్ 134.8 బిలియన్ డాలర్లు ఉంటే, 2021 నాటికి 532 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2024 నాటికి 893 బిలియన్ డాలర్లకు చేరుతుందని జియాన్ మార్కెట్ రీసెర్చ్(జీఎంఆర్) విభాగం అంచనా వేసింది. 2020 నుంచి భారతదేశంలో ప్రీమియం సౌందర్య ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నట్టు గుర్తించింది. ప్రస్తుతం చర్మ, సౌందర్య ఉత్పత్తుల వినియోగంలో 80 శాతం మంది మహిళలే ఉన్నారు. వచ్చే ఐదేళ్లలో పురుషుల సౌందర్య, గ్రూమింగ్ ఉత్పత్తులు కూడా భారీగా పెరుగుతాయని, దాంతో యునిసెక్స్ ఉత్పత్తుల తయారీ విస్తరిస్తుందని జీఎంఆర్ అంచనా వేసింది.

సాక్షి, అమరావతి

చర్మ సౌందర్య ఉత్పత్తులే అధికం

- 2021లో మొత్తం సౌందర్య ఉత్పత్తుల కొనుగోళ్లలో 148.3 బిలియన్ డాలర్లు కేవలం చర్మ రక్షణ ఉత్పత్తులదే.
- పర్సనల్ కేర్ మార్కెట్‌లో 42 శాతం స్కిన్ కేర్ ఉత్పత్తులే ఉన్నాయి. తర్వాత స్థానంలో హెయిర్ కేర్ 22 శాతం, బ్యూటీ అండ్ మేకప్ కేర్ 16 శాతం ఉన్నాయి.
- ప్రపంచ బ్యూటీ ఉత్పత్తుల మార్కెట్‌లో ప్రస్తుతం 7వ స్థానంలో ఉన్న భారత్.. వచ్చే మూడేళ్లలో 4వ స్థానానికి చేరుతుందని అంచనా.
- సర్వే ప్రకారం భారత్‌లో సహజ సౌందర్య ఉత్పత్తుల మార్కెట్ 2022లో 15 బిలియన్ డాలర్లు ఉండగా, 2024 నాటికి 22 బిలియన్ల డాలర్లకు, 2028 నాటికి 38 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని జీఎంఆర్ తెలిపింది.





ఉత్పత్తులు ఏవి ఎంత శాతం..	స్కిన్ కేర్	హెయిర్ కేర్	మేకప్	ఫ్రాగ్రెన్సెస్	హైజీన్ ప్రొడక్ట్స్
	42	22	16	10	10

బీజేపీ ఇంకా బలపడాలి

- భవిష్యత్తు ప్రణాళికపై స్పష్టత వచ్చాక చెబుతాం
- జేపీ నడ్డాతో భేటీ అనంతరం పవన్‌కళ్యాణ్

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో బీజేపీ ఇంకా బలోపేతం కావాల్సి ఉందని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. రెండు పార్టీల భవిష్యత్తు ప్రణాళికపై స్పష్టత వచ్చాక తామే మీడియాకు వెల్లడిస్తామన్నారు. ఆయన మంగళవారం రాత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. బీజేపీ ఏపీ బాధ్యుడు మురళీధరన్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివప్రకాశ్ కూడా పాల్గొన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో పార్టీ ఇంకా బలోపేతం కావాల్సి ఉందని చెప్పారు. బీజేపీ కూడా సంస్థాగతంగా బలోపేతమయ్యేలా నిర్ణయాలు తీసుకుంటుందని భావిస్తున్నానన్నారు. వైఎస్సార్‌సీపీ విముక్త ఏపీనే జనసేన, బీజేపీ అజెండాగా పేర్కొన్నారు. అధికారం దిశగానే రెండురోజులపాటు సమావేశాల్లో చర్చించామన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని కోణాల్లోను మాట్లాడుకున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే జనసేన అభిమతమని, ఆ దిశగానే ముందుకెళుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇతర పార్టీలతో పొత్తుల స్థాయి వరకు జనసేన, బీజేపీ మధ్య చర్చలు జరగలేదన్నారు. దీనిపై సంస్థాగతంగా బీజేపీ బలోపేతం అయ్యాక మాట్లాడుతుందన్నారు. ఈ చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో తెలుస్తాయని చెప్పారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాజకీయ కోణంలోనే కాకుండా అభివృద్ధి కోణంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయడంపై బీజేపీ నేతలకు పవన్‌కళ్యాణ్ చెప్పారన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఈ సమావేశాల ద్వారా అర్థమైందని పేర్కొన్నారు.

పోలవరం ముంపుపై 10న కీలక భేటీ

- కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలో సమావేశం
- పాల్గొననున్న ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) ముంపుపై మూడు రాష్ట్రాల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 10న కేంద్రం మరో కీలక సమావేశం నిర్వహిస్తోంది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగే ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో హాజరుకావాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదే రోజు (ఈనెల 10న) హైదరాబాద్‌లో ఏపీ, తెలంగాణ అధికారులతో నిర్వహించాల్సిన భేటీని పీపీఏ సీఈవో శివ్‌నంద్‌కుమార్ రద్దు చేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు సమస్య ఉత్పన్నమవుతోందని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ (స్పెషల్ లీవ్ పిటిషన్) దాఖలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే నాలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు మరోసారి భేటీ అవుతున్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఇచ్చే నివేదిక ఆధారంగా నాలుగు రాష్ట్రాల సీఎంలతో మంత్రి సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943